www.manatelangana.news
Mana Telangana
మన తెలంగాణ
హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 265 | శుక్రవారం | 16 మార్చి, 2018
...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

సామాజిక సేవలు

రూ.45,479.57 కోట్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : రానున్న ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వం రూపొందించిన బడ్జెట్ లో దాదాపు నాల్గింట ఒక వంతు నిధులు సంక్షేమానికే కేటాయించింది. మొత్తం బడ్జెట్ వ్యయం రూ. 1,74,454 కోట్లు కాగా, అందులో సంక్షేమ రంగానికి రూ. 45,479.57 కోట్లు కేటాయించింది. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, తరువాయి 6లో



సంక్షేమం అభివృద్ధి



ఉజ్వల భవితకు ఊపిరి

రాష్ట్ర బడ్జెట్ పెట్టుబడి రూ.1,74,453.84 కోట్లు

నీటిపారుదల	రూ. 25,000 కోట్లు
వ్యవసాయం, మార్కెటింగ్	రూ. 15,780 కోట్లు
పంటల పెట్టుబడి మద్దతు	రూ. 12,000 కోట్లు
పాఠశాల విద్య	రూ. 10,830 కోట్లు
ఉన్నత విద్య	రూ. 2,448 కోట్లు
వైద్యం, ఆరోగ్యం	రూ. 7,375 కోట్లు

ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ 2018–19 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌ను గురువారం శాసనసభలో ప్రవేశపెట్టారు. సుమారు గంటన్నర పాటు సాగిన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలతో పాటు రైతులకు ఏడాదికి రూ. 8,000 (ఎకరానికి) చొప్పున ఇచ్చే 'రైతులక్ష్మి' పంట పెట్టుబడి పథకానికి రూ. 12,000 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఈటల రాజేందర్ సమర్పించిన ఐదవ పూర్తిస్థాయి బడ్జెట్ ఇది. వ్యవసాయం, విద్య, వైద్యం, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమానికి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేసింది.

- బడ్జెట్‌పై మరిన్ని వార్తలు లోపలి పేజీల్లో

రాష్ట్ర ఆదాయం	రూ. 73,751 కోట్లు
కేంద్రం నుంచి వచ్చే వాటా	రూ. 29,041 కోట్లు
రెవెన్యూ వ్యయం	రూ. 1,25,454 కోట్లు
ద్రవ్య లోటు అంచనా	రూ. 29,077 కోట్లు
ప్రగతి పద్దు	రూ. 1,04,757 కోట్లు
రెవెన్యూ మిగులు అంచనా	రూ. 5,520 కోట్లు

పెరిగిన బిసిల వాటా

- గత ఏడాదితో పోలిస్తే రూ.850 కోట్లు అధికం
- బిసిల ప్రగతికి రూ.5,690.04 కోట్లు
- ఎంబిసిలకు మళ్లీ రూ.1000 కోట్లు
- రజక, నాయీ బ్రాహ్మణ సహకార సంఘాల సమాఖ్యలకు నిధులు
- చేనేతల సహాయానికి రూ.1200 కోట్లు



మన తెలంగాణ / హైదరాబాద్ : 2018–19 వార్షిక బడ్జెట్‌లో బిసిలకు నిధుల కేటాయింపు పెరిగింది. వారి అభివృద్ధికి రూ.5,920 కోట్లు కేటాయించారు. అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే ఇది రూ. 850 కోట్లు అధికం. గత ఏడాది బిసిల సంక్షేమానికి రూ.5,070.36 కోట్లు కేటాయించింది. కాగా ఎంబిసిలకు గత బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనూ వెయ్యి కోట్లు కేటాయించింది. గత సంవత్సరం కేటాయించిన నిధులు ఇప్పటికీ విడుదల చేయలేదు. వచ్చే ఏడాదికి ఇది జమ అవుతుందని మంత్రి ఈటల రాజేందర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. బిసిల అభివృద్ధికి ప్రతిపాదించిన 2018–19 బడ్జెట్ అంచనాల్లో నిర్వహణ పద్దుకు రూ.229.79 కోట్లు, ప్రగతి పద్దుకు రూ.5,690.04 కోట్ల కేటాయించారు. అడ్వకేట్ల రాయితీలకు గతంలో రూ.50 లక్షలు కేటాయించగా ఇపుడు రెండు కోట్లు కేటాయించారు. రాజీవ్ అభ్యుదయ యోజనకు గత సంవత్సరం రూ.9.44 కోట్లు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించారు. రజక సహకార సంఘాల సమాఖ్యకు తరువాయి 6లో

అబద్ధాల బడ్జెట్, ఆశనిపాతం : షబ్బీర్, భట్టి 6

మేడిపండు బడ్జెట్ : కిషన్‌రెడ్డి 6

శాసన సభ్యత్వాల రద్దుపై హైకోర్టులో పిటిషన్ 6

కుంచెపోటు



ఇంకానయం, వెళ్లొచ్చు అన్నారు, 70 కి.మీ. వేగంతో వెళ్లాల్సిందే అనలేదు!


రాష్ట్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం : అక్బరుద్దీన్ ఒవైసి



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను స్వాగతిస్తున్నామని ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి 2000కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. గతేడాది బడ్జెట్‌లో రూ. 1250 కోట్లు కేటాయిస్తే ఈ సారి రూ. 750 కోట్లు పెంచారన్నారు. ఒక్క ఏడాదిలోనే 60% పెంచడం ముఖ్యమంత్రికి మైనార్టీల సంక్షేమం పట్ల ఉన్న శ్రద్ధకు అద్దం పడుతోందన్నారు. ఇది 2014–15 ఆర్థిక సంవత్సరంలో రూ. 1030 కేటాయించారన్నారు. అంటే అప్పటి బడ్జెట్‌తో పోలిస్తే దాదాపు రెట్టిం పు అని ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,33,823 కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వం విశ్వసనీయతను చాటుకుందన్నారు. రాష్ట్రం రూ. 5,520 కోట్లు రెవెన్యూ మిగులు ఆదాయం కలిగి ఉందన్నారు. అన్ని రంగాల వారికి బడ్జెట్‌లో సముచిత ప్రాధాన్యం లభించిందన్నారు.

'స్థానిక' వాటా అపూర్వం

● పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ. 15,562కోట్లు ● స్థానిక సంస్థల అభివృద్ధికి తొలిసారి రూ.1500 కోట్లు



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రం ప్రభుత్వం 2018–19 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ. 15,562.84 కోట్లను కేటాయించింది. ఇప్పటి వరకు దేశంలో ఎక్కడ లేని విధంగా స్థానిక సంస్థల అభివృద్ధి కోసం ఈసారి రూ. 1500 కోట్ల కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే కేటాయింపుల్లో కొంత పెరుగుదల కనిపించింది. త్వరలో పంచాయతి ఎన్నికలు జరగనున్నందున ఈ సారి బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేసి పంచాయతీరాజ్ శాఖకు నిధుల కేటాయింపు గణనీయంగా పెరుగుతుందని వార్తలు వినిపించాయి. కొత్తగా 1500కోట్లు రాష్ట్ర ప్రభుత్వ నిధులను కేటాయిస్తామని ప్రకటించడం తప్ప పెద్దగా వరాలు లేవు. ఈ కేటాయింపుల్లో నిర్వహణా వ్యయం రూ. 2,786.78 కోట్లు కాగా ప్రగతి పద్దు రూ.12,776.07 కోట్లు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, పంచాయతిరాజ్ శాఖాధిపతి నిర్వహణ వ్యయం గత ఆర్థిక సంవత్సరం కేటాయింపులు 538.94కోట్లు కాగా ఈ సారి 614.58 కోట్లకు పెరిగింది. రోడ్లు, వంతెనలు, ఇతరత్రా సాధారణ పంచాయతీ పనులకు నిర్వహణ వ్యయం గత ఆర్థిక సంవత్సరం 154.02కోట్లు కేటాయించగా ఈ సారి 252.47కోట్లు. గ్రామీణ ప్రాంతాల్లో సిఆర్‌ఆర్ కింద నిర్మించే రోడ్ల కోసం రూ. 1080కోట్లు కేటాయించగా చీఫ్ ఇంజనీర్ పరిధిలో జరిగే గ్రామీణ తాగునీటి సరఫరాకు కేటాయింపులు తగ్గాయి. గత ఆర్థిక సంవత్సరం 2998.57 కోట్లు కేటాయించగా ఈ సారి 2751.76 కోట్లు కేటాయించింది. ఈ ఏడాది మిషన్ భగీరథ ద్వారా గ్రామాలకు తాగునీటి సరఫరా ప్రారంభమవుతుండడంతో ఈ కేటాయింపులు తగ్గినట్లు అధికారులు వ్యాఖ్యానించారు. మిషన్ భగీరథకు ఈ బడ్జెట్‌లో రూ. 1801కోట్లు కేటాయించారు. పంచాయతిరాజ్ ఇఎన్‌సి (సాధారణ) పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, ఇతర పనులకు కేటాయింపులు పెరిగాయి. గత ఏడాది ఈ పనులకు రూ. 848.61కోట్లు కేటాయించగా ఈ సారి 948.65 కోట్లు కేటాయించారు. గిరిజన ప్రాంతాల ఉప ప్రణాళిక కింద గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, పలు పథకాల అమలుకు గతేడాది 1542.23 కోట్లు కేటాయించగా ఈ సారి 1826.92కోట్ల కేటాయింపులు జరిపారు. కొత్త పంచాయతీలను ఏర్పాటు చేస్తున్నందున పంచాయతీల ఆదాయం తగ్గుతుందని, ఈ లోటును భర్తీ చేస్తూ ఆయా పంచాయతీలు అభివృద్ధికి బాటలు వేసుకోవడానికి ఈ నిధులను కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం వ్యాఖ్యానించింది. దీంతో పాటే కొత్త పంచాయతిరాజ్ చట్టాన్ని కూడా ఇదే బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

కేంద్ర పథకాలకు తగ్గిన కేటాయింపులు

కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రాయోజిత కార్యక్రమాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సిన తన వాటా కేటాయింపులు ఈసారి తగ్గాయి. ప్రధాన మంత్రి గ్రామ్ సడక్‌యోజనకు గతేడాది రూ. 950కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ. 667.36 కోట్లు కేటాయించారు. స్వచ్ఛ భారత మిషన్(రూరల్)కు గతేడాది రూ. 1949.91 కోట్లు కేటాయించగా ఈ సారి రూ. 1802.83 కోట్లు కేటాయించారు.

డబుల్ బెడ్ రూమ్‌కు ఇచ్చింది వెయ్యి కోట్లు!

కేంద్రం వాటా రూ.1143 కోట్లు




మన తెలంగాణ/హైదరాబాద్ : డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికి అత్యధికంగా కేంద్రం నుంచే నిధులు రానున్నా యి. గృహ నిర్మాణ శాఖకు బ్రడ్జెట్‌లో రూ. 2143.10 కోట్లు కేటాయించినట్లు చూపించారు. అయితే అందులో రాష్ట్ర ప్రభు త్వ వాటా రూ. వెయ్యి కోట్లే. మిగతా రూ. రూ.1143.10 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులే కావడం గమనార్హం. అంతే కాకుండా పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కేటాయించలేదు. ఇక కేంద్రం కేటాయించిన రూ.1143 కోట్లలో ప్రధానమంత్రి అవాస్ యోజన కింద పట్టణ ప్రాంతాలకు రూ.766 కోట్లు, గ్రామీణ ప్రాంతాలకు రూ.376.60 కోట్లు ఉన్నాయి. కాగా గ్రామీణ గృహ నిర్మాణం కోసం రూ.575 కోట్లు రుణంగా తీసుకోనున్నారు. ఇక గత బడ్జెట్‌లో డబుల్ బెడ్ రూమ్ పథకానికి కేటాయించిన నిధుల్లో సైతం రూ.54 కోట్ల వరకు కోత పెట్టారు. ముందుగా రూ.1952.14 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాలు రూ.1898.39 కోట్లుగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 2.72 లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను మంజూరు చేయగా, 9,522 ఇళ్లు పూర్తయ్యాయి. 1.69 లక్షల ఇళ్ళు వివిధ దశల్లో ఉన్నాయి.

పశువులు.. కోళ్ల ఉత్పత్తికి ప్రోత్సాహకాలు

మన తెలంగాణ/హైదరాబాద్ : పశుసంవర్ధక, మత్స్యశాఖలకు ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగాయి. గత ఏడాది మొత్తంగా రూ. 594 కోట్లు ఉండగా ఈసారి రూ.1126 కోట్లు కేటాయించారు. ఇందులో నిర్వహణ పద్దుకు అధికంగా రూ. 789 కోట్లు ఉంది. ప్రగతి పద్దు కింద రూ. 337 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఇందులో పశువుల, కోళ్ల ఉత్పత్తి ప్రోత్సాహకంగా రూ. 108.67 కోట్లు కేటాయింపులు చేశారు. గత ఏడాది ఈ నిధులు రూ. 43 కోట్లుగానే ఉంది. పశువుల వైద్య సర్వీసులకు రూ. 42 కోట్లు ప్రతిపాదించారు.

ప్రగతి పద్దు (2018-19)

(రూ. కోట్లలో)



ప్రగతి పద్దు (2018-19) రూ. కోట్లలో

రంగం	బడ్జెట్ అంచనాలు 2017-18	సవరించిన అంచనాలు 2017-18	బడ్జెట్ అంచనాలు 2018-19
వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలు గ్రామీణాభివృద్ధి	13,640.15	13,512.95	20,820.08
నీటిపారుదల	23,675.73	18,715.89	21,301.35
విద్యుత్	3,583.64	3,583.64	3,770.63
సామాజిక సేవలు	36,853.79	35,351.75	45,479.57
రవాణా	3,851.48	3,572.95	4,461.05
ఇతరములు(పరిశ్రమలు, సాధారణఆర్థిక సేవలు తదితరాలు)	6,434.01	6,109.68	8,925.22
మొత్తం	88,038.80	80,846.86	1,04,757.90

ఇహెచ్‌ఎస్‌కు ప్రత్యేక ట్రస్టు ఏర్పాటు

ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడంపై పునరాలోచించాలి : కారెం రవీందర్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఇహెచ్‌ఎస్)ను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడంపై ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో పాటు వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. ఒకవైపు కొత్తగా వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఏకంగా ఈ పథకాన్ని ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకెళ్ళడంలోని ఆంతర్యం ఏమిటని ఈ సంఘాల ప్రతినిధులు ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్(టిఎన్‌జిఒ) అధ్యక్షులు కారెం రవీందర్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇహెచ్‌ఎస్ పథకానికి ప్రత్యేక ట్రస్టు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇహెచ్‌ఎస్‌ను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం పట్ల ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. తమకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయాలని ఇహెచ్‌ఎస్ పథకం ప్రారంభించేటప్పుడే కోరామని పేర్కొన్నారు. ఇహెచ్‌ఎస్ టారిఫ్, ఆరోగ్య టారిఫ్‌లలో వ్యత్యాసం ఉందని, దానిని ఆరోగ్యశ్రీ పరిధిలో తీసుకువస్తే చెల్లింపుల్లో కూడా గందరగోళం ఏర్పడుతుందన్నారు. ఆరోగ్యశ్రీకి నిధులు కేటాయించకపోవడంతో ఇప్పటికే కొన్ని ఆసుపత్రులు సేవలను నిలిపివేశాయని, ఆ ప్రభావం ఉద్యోగులపై ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం నాలుగు వెల్‌నెస్ కేంద్రాలు పనిచేస్తుండగా ఆరోగ్యశ్రీ పరిధిలోకి ఇహెచ్‌ఎస్‌కు తీసుకువస్తే వెల్‌నెస్ కేంద్రాలు కొనసాగిస్తారా..? లేదా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయన్నారు.

ఆరోగ్యశ్రీకి అప్పగిస్తే జర్నలిస్టుల ఆందోళన : టియుడబ్ల్యూజె

జర్నలిస్టుల ఆరోగ్య పథకం(జెహెచ్‌ఎస్)ను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువస్తే ఆందోళన తప్పదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టియుడబ్ల్యూజె) సలహాదారులు కె.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షులు నగునూరి శేఖర్, ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జర్నలిస్టుల హెల్త్ స్కీంను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం జర్నలిస్టులను నిరుత్సాహానికి గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు వైద్యసేవలు అందించడంలో వైఫల్యం చెందుతున్న ఆరోగ్యశ్రీ పరిధిలోకి జెహెచ్‌ఎస్‌ను తీసుకురావడం అంటే మరో రకంగా ఈ స్కీంకు ప్రభుత్వం స్వస్తి పలకడమే అని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పథకం ప్రవేశపెట్టిన 2017, జూన్ 7 నుంచి ఇప్పటివరకు కేవలం 1,700 మంది జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు మొత్తం రూ.6.56 కోట్లు మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేసిందని, ఇంతటి స్వల్ప ఖర్చును కూడా ప్రభుత్వం భరించలేక నిరాకరించడం శోచనీయమన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ అంశాన్ని పునఃపరిశీలించాలని కోరారు.

విద్యకు విదిల్చింది అంతంతే!

పాఠశాల విద్యకు రూ.10,830 కోట్లు కేటాయింపు




మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన ఐదవ బడ్జెట్‌లో ప్రాథమిక విద్యకు చేసిన కేటాయింపుల్లో స్వల్ప పెరుగుదల మాత్రమే కనిపించింది. గతేడాది మొత్తం రూ.1,49,646 కోట్ల బడ్జెట్‌లో పాఠశాల విద్యకు రూ.10,215.30 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం 1,74,453.84 కోట్ల బడ్జెట్‌లో రూ.10,830 కోట్లు కేటాయింపు ఉంది. మొత్తం బడ్జెట్‌లో పాఠశాల విద్యకు చేసిన కేటాయింపు కేవలం 6.2% మాత్రమే. విద్యారంగానికి అధిక ప్రాముఖ్యత ఇస్తున్నామని చెప్తోన్న ప్రభుత్వం పెద్దగా కేటాయింపులు చేయలేదని, గతేడాది తరహాలోనే ఉన్నాయని పలువురు విద్యావేత్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 404 జూనియర్ కళాశాలల్లో వసతుల కల్పనకు రూ.259 కోట్లు, సాంకేతిక విద్యలో కొత్తగా ప్రారంభించిన 11 పాలిటెక్నిక్‌లకు రూ.95 కోట్లు, 131 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.247 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,448 కోట్ల చొప్పున ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

గురుకులాలకు రూ.2,823 కోట్లు

ఎస్‌సి రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు రూ.401 కోట్లు, బిసి రెసిడెన్షియల్ సంస్థలకు రూ.296 కోట్లు, మైనార్టీ రెసిడెన్షియల్ సంస్థలకు రూ.735 కోట్లు, గురుకుల విద్యాలయాలకు రూ.170 కోట్ల చొప్పున రాష్ట్రంలోని మొత్తం గురుకుల విద్యాలయాలకు రూ. 2,823 కోట్లు కేటాయించింది.

కెజి టు పిజి ఊసేలేని బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్‌లో ఎక్కడా కెజి టు పిజి ప్రస్తావనే లేదు. కెజి టు పిజి ఉచిత విద్యలో భాగంగా రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభిస్తున్నామని చెప్పినప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల్లో కెజి తరగతులు ప్రారంభానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతి నుంచే ప్రవేశాలు చేపడుతుండగా, రాష్ట్రవ్యాప్తంగా 52 మహిళా రెసిడెన్షియల్ కళాశాలల్లోనే డిగ్రీ వరకు ఉచిత విద్య అందిస్తున్నారు.

బలోపేతం ఎలా చేస్తారు?: ఎస్‌టియుటిఎస్

బడ్జెట్‌లో విద్యారంగానికి నామమాత్రపు కేటాయింపులు చేసి ప్రభుత్వ విద్యను ఎలా బలోపేతం చేస్తారని ఎస్‌టియుటిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.భుజంగ రావు, జి.సదానందం గౌడ్‌లు ఒక ప్రశ్నించారు. గత ఏడాది కంటే అంచనాల పెంపుతో రూ. 1,74,453 కోట్లు కాగా, అందులో కేవలం రూ.10,830 కోట్లు మాత్రమే కేటాయించారని, గత ఏడాది కంటే 3 శాతం నిధులు తగ్గించారని పేర్కొన్నారు. కొఠారీ కమిషన్ సిఫార్సుల మేరకు రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం తగ్గకుండా విద్యారంగానికి నిధులు కేటాయించాలని, ఈ బడ్జెట్‌లో కేటాయింపులు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసేదిగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ విద్యారంగానికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం అంటే పరోక్షంగా దానిని బలహీన పరచడమే అని పేర్కొన్నారు.

'ఉన్నత'ంగా లేవు

వర్శిటీలకు అంతంత మాత్రంగానే నిధులు


మన తెలంగాణ/హైదరాబాద్ : ఉన్నత విద్యారంగానికి తాజా బడ్జెట్‌లో రూ.2,448 కోట్లు కేటాయించడంతో యూనివర్సిటీలకు ఇక అరకొర నిధులే మార్గమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నిధులు విశ్వవిద్యాలయాలు, ఇతర సంస్థల్లో సమస్యల పరిష్కారానికి చాలవని పేర్కొంటున్నారు. గత ఏడాది వర్సిటీల అభివృద్ధికి రూ.420.89 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది సగానికి తగ్గించి రూ.210.42 కోట్లు కేటాయించారు. వర్సిటీలలో అధ్యాపకులు, సిబ్బంది వేతనాలకు నిర్వహణ వ్యయం కింద గత ఏడాది రూ.422.12 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది ఆ నిధులను పెంచి రూ. 485.44 కోట్లు కేటాయించారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రగతి పద్దు కింద రూ.60 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కేటాయించారు. అయితే గత ఏడాది ఒయు శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో రూ.200 కోట్లు కేటాయించారు. కాకతీయ వర్సిటీకి గత ఏడాది రూ.30 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ.25.30 కోట్లు కేటాయించారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయానికి గత ఏడాది కేటాయించినట్లుగా ఈ ఏడాది కూడా రూ.20 కోట్లు ప్రతిపాదించారు. అలాగే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి గత ఏడాది రూ.20 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.20.02 కోట్లు, తెలంగాణ వర్సిటీకి, శాతవాహన వర్సిటీకి గత ఏడాదికి కేటాయించినట్లుగా రూ.20 కోట్లు కేటాయించారు. మహాత్మాగాంధీ వర్సిటీకి గత ఏడాది రూ.35 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.25 కోట్లు మాత్రమే కేటాయించారు. పాలమూరు వర్శిటీకి 20 కోట్లు కేటాయించారు.

'మున్సిపల్'కు అదనంగా రూ. 1883 కోట్లు




రాష్ట్ర 2018–19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో మున్సిపల్ శాఖకు ప్రభుత్వం రూ.7250.56 కోట్లను ప్రతిపాదించింది. ఇందులో నిర్వహణ పద్దులో రూ.2570.47 కోట్లు, ప్రగతిపద్దులో రూ.4680.09 కోట్లను ప్రతిపాదించింది. గత ఏడాదితో పోలిస్తే 2018–19 బడ్జెట్‌లో సుమారు రూ.1883 కోట్ల నిధులను అధికంగా ప్రతిపాదించింది. ఈ సారి 14వ ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధుల వివరాలను ఈ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. కేంద్ర ప్రయోజిత కార్యక్రమాల నిమిత్తం 2017–18 ఆర్థిక సంవత్సరంలో రూ. 30.90 కోట్లు ఉండగా ఈసారి మాత్రం రూ.22.90 కోట్లు కేటాయించింది. కొత్త మున్సిపాలిటీల అభివృద్ధి పనుల నిమిత్తం రూ.50 కోట్లు, హైదరాబాద్ మెట్రో ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ నిమిత్తం రూ. 400 కోట్లను ప్రతిపాదించింది. గత ప్రగతి పద్దులో భాగంగా స్మార్ట్‌సిటీ నిమిత్తం రూ.89.39. కోట్లు, అమృత్ పట్టణాలకు రూ. రూ. 313.63 కోట్లు, మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటిఎస్)సబర్బన్ రైల్ నిమిత్తం రూ.50 కోట్లు ప్రతిపాదించింది. మూసీ అభివృద్ధికి ఈసారి రూ. 566.02 కోట్లు కేటాయించింది.

అర్బన్ అథారిటీలకు నిధులు..



కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్‌కు రూ. 4కోట్లు, యాదగిరిగుట్ట అర్బన్‌డెవలప్‌మెంట్‌కు రూ. 250 కోట్లు, వేములవాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.100 కోట్లు ప్రతిపాదించింది. భద్రాచలం టెంపుల్ అథారిటీకి రూ. 100 కోట్లు, ధర్మపురి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.50 కోట్లు, బాసర టెంపల్ డెవలప్‌మెంట్ అథారిటీ రూ.50 కోట్లు, తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.200 కోట్లు కేటాయించింది. మున్సిపల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ నిమిత్తంరూ. 81.16 కోట్లు, కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛ భారత్‌కు రూ.125 కోట్లు, మున్సిపాలిటీలకు ఆర్థిక సహాయం నిమిత్తం రూ. 755.20 కోట్లు, మున్సిపల్‌లలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 230 కోట్లు ప్రతిపాదించింది. వడ్డీ లేని రుణాల నిమిత్తం రూ. 141.64 కోట్లు, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, రామగుండం కార్పొరేషన్ల నిమిత్తం రూ. 301.88 కోట్లు ప్రతిపాదించగా, వరంగల్ కార్పొరేషన్‌కు రూ. 226.41కోట్లు ప్రతిపాదించింది. 'ఈ సేవ' నిమిత్తం రూ. 19.97 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రయోజిత కార్యక్రమాల నిమిత్తం మొత్తంగా రూ. 567.79 కోట్ల ప్రతిపాదన చేసింది. హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డ్ కు రూ. 670 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ కు రూ. 200 కోట్లు , రణాల నిమిత్తం చేసి హెచ్‌ఎండిఎ కు రూ. 250 కోట్లు, ఓఆర్‌ఆర్‌కు 235 కోట్లను ప్రతిపాదించింది.

ఐటిలో దూసుకుపోతున్నాం...



ఐటి శాఖకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. 2018–19 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 289.20 కోట్లు కేటాయించింది. గత ఏడాది ఐటి శాఖకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 252.89 కోట్లు కేటాయింపులు జరిగాయి. గత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌తో పోల్చి చూస్తే ఈ సారి రూ. 36.31 కోట్లు అధికంగా కేటాయించినట్లయింది. ప్రపంచవ్యాప్తంగా పేరు గాంచిన సంస్థలు హైదరాబాద్ నగరంలో తమ యూనిట్లను ప్రారంభిస్తున్నాయి. ఐటి ఎగుమతుల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలో 12 శాతం వాటా కల్గి రెండో స్థానాన్ని ఆక్రమించింది. ఐటి పరిశ్రమను ప్రొత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు పాలసీలను అమలు చేస్తోంది. ఐటి అండ్ ఎలక్ట్రానిక్స్ పాలసీ, రూరల్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ పాలసీలతో పాటుడాటా సెంటర్ల పాలసీ, ఓపెన్ డాటా పాలసీలను కూడా ఐటి శాఖ అందుబాటులోకి తెచ్చింది.

మైనారిటీ సంక్షేమానికి రూ.2వేల కోట్లు



మైనారిటీల సంక్షేమానికి 2018–19 వార్షిక బడ్జెట్‌లో రెండు వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదించింది. అంతకు ముందు సంవత్సరం రూ.1249.66 కోట్లు ప్రతిపాదించగా ఈ ఏడాది దాదాపు రూ.750 కోట్లు అధికంగా కేటాయించింది. నిర్వహణ ఖర్చుల కింద రూ.25.57 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ.1,974.43 కోట్లు ప్రతిపాదించింది. మైనారిటీలకు శిక్షణ ఉపాధి కోసం రూ.15 కోట్లు, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.12 కోట్లు, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.90 కోట్లు, దైరతుల్ మారిఫ్‌కు రూ.5 కోట్లు, ఉర్దూ అకాడమికి రూ.2 కోట్లు, మైనారిటీ విద్యార్థుల ఉపకార వేతనాలకు రూ.100 కోట్లు, ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ కోసం రూ.248 కోట్లు, సబ్సిడీ రుణాలకు రూ. 160 కోట్లు, ఉర్దూ అకాడమి, ఉర్దూ ఘర్ కం షాదీ ఖానాలకు రూ.40 కోట్లు, వక్ఫ్ బోర్డు, ఇమామ్‌లకు గౌరవ వేతనాలకు రూ. 80 కోట్లు, మైనారిటీ విద్యా సంస్థల అభివృద్ధికి రూ.4 కోట్లు, హజ్ కమిటికి రూ.4 కోట్లు, 'టి ప్రైమ్' , 'టి సెజ్'లకు రూ. 25 కోట్లు, స్టడీ సర్కిళ్ళకు రూ.8 కోట్లు, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు రూ.30 కోట్లు, షాదీ ముబారక్‌కు రూ. 200కోట్లు, మైనారిటీ విద్యార్థుల విదేశీ విద్యకు రూ.100 కోట్లు, మైనారిటీ గురుకులాలకు రూ.735 కోట్లు, మక్కా మసీదు మరమ్మతులు, నిర్వహణకు రూ. 7 కోట్లు ప్రతిపాదించింది.

ఎన్‌ఆర్‌ఐ శాఖకు వంద కోట్లు



ఈ సారి బడ్జెట్‌లో తెలంగాణ ఎన్‌ఆర్‌ఐ శాఖకు గతంలో ఎన్నడు లేనన్నిభారీ నిధులను ప్రభుత్వం కేటాయించింది. ప్రవాస భారతీయుల సంక్షేమం కోసం 2018–19 ఆర్థిక సంవత్సర తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో ఎన్‌ఆర్‌ఐ శాఖకు రూ. 100 కోట్లు కేటాయింపు చేసింది. తెలంగాణ ఏర్పడక ముందు ఎన్‌ఆర్‌ఐ శాఖ బడ్జెట్ కేవలం రూ. 5 కోట్లు మాత్రమే ఉండేది. గత కొంత కాలంగా ప్రవాస తెలంగాణీయుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపట్టింది. ఎన్‌ఆర్‌ఐ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మంత్రి కెటిఆర్ తెలంగాణ ఎన్‌ఆర్‌ఐల కోసం చేపట్టాల్సిన చర్యలపైన ఒక విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ దేశాల నుంచి వచ్చిన ఎన్‌ఆర్‌ఐ తెలంగాణ బిడ్డలు, నిపుణులు ఇచ్చిన సూచనల మేరకు చర్యలు తీసుకోవడంపై దృష్టి పెట్టారు. ప్రవాస భారతీయుల కోసం చేపట్టాల్సిన చర్యలపై వివిధ రాష్ట్రాల్లోని అత్యుత్తమ విధానాలను ఇటీవలే ఎన్‌ఆర్‌ఐ శాఖ అధ్యయనం చేసింది. ఈ సారి బడ్జెట్‌లో భారీ ఎత్తున నిధులు కేటాయించడంతో ప్రవాస తెలంగాణ వాసుల అభివృద్ధి, సంక్షేమానికి నూతన కార్యక్రమాలను ప్రవేశపెట్టే అవకాశం లభించనుంది. ముఖ్యంగా గల్ఫ్ తెలంగాణ వాసుల కష్టాలను తీర్చేందుకు ఈ బడ్జెట్ ఉపయోగపడే అవకాశం ఉంది.



బడ్జెట్ బాగుంది : సిఎం కెసిఆర్



మన తెలంగాణ / హైదరాబాద్ : ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ 2018–19 సంవత్సరానికి సమర్పించిన బడ్జెట్ బాగుందని, అన్ని రంగాల అభివృద్ధి, అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి ఉపయోగపడే విధంగా ఉందని ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యాఖ్యానించారు. బడ్జెట్‌లో సమతుల్యత కనిపించిందని, రాష్ట్రానికి ఉన్న ఆదాయ వనరులు, రాష్ట్రానికి ఉన్న అవసరాలు, ప్రభుత్వ లక్ష్యాలు... వీటి మధ్య పూర్తి సమన్వయం కుదురుస్తూ బడ్జెట్ రూపొందించినట్లు స్పష్టమవుతోందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు సమర్థంగా అమలుచేసే విధంగా వార్షిక ఆర్థిక ప్రణాళికను రూపొందించిన మంత్రి ఈటల రాజేందర్ బృందాన్ని సిఎం అభినందించారు. వ్యవసాయ రంగానికి అత్యధిక నిధులు ప్రతిపాదించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, పంట పెట్టుబడి మద్దతు పథకం, విద్యుత్ సబ్సిడీలకు ఎక్కువ మొత్తంలో నిధులు సమకూర్చడం వలన ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలు ముందుకు సాగుతాయన్నారు.

ప్రాజెక్టులకు ప్రాధాన్యత

● బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయింపు ● కాళేశ్వరానికి మరోసారి పెద్దపీట



మన తెలంగాణ/హైదరాబాద్: ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఎప్పటి లాగే సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. వరుసగా మూడో బడ్జెట్‌లో ఇరిగేషన్ శాఖకు రూ.25వేల కోట్లు కేటాయించింది. ఇందులో మేజర్ ఇరిగేషన్‌కు రూ.21,891 కోట్లు , మైనర్ ఇరిగేషన్ (మిషన్ కాకతీయ)కు రూ.2,743 కోట్లు కేటాయించారు. ఆయకట్టు అభివృద్ధికి రూ.251.5 కోట్లు, వరద నిర్వహణకు రూ.114.5 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లు కేటాయించగా, ఇప్పటి వరకు రూ.20 వేల కోట్లు ఖర్చు చేయగలిగారు. ఇందులో కాళేశ్వరం కార్పోరేషన్ నుంచి తీసుకున్న రుణమే రూ.9,000 కోట్లు కావడం గమనార్హం. గత బడ్జెట్‌లో ఉత్తర తెలంగాణ వరదాయిని కాళేశ్వరంకు ఇచ్చిన ప్రాధాన్యతను ఈ సారి కూడా కొనసాగించారు. ఈ ప్రాజెక్టుకు 2017–18లో సుమారు రూ.6,681 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల్లో రూ.8,298.11 కోట్లకు పెంచారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా అత్యధికంగా రూ.6,094 కోట్లు కాళేశ్వరానికే కేటాయించగా, తరువాతి స్థానంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.3,035 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో ఇదే రీతిలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకం ఖర్చులు కూడా కార్పోరేషన్‌లు సమకూర్చుకున్న నిధుల ద్వారానే చేయనున్నారు. ఇరిగేషన్ రంగంలో 2015–16లో రూ.10,933.57 కోట్లు, 2016–17లో రూ.15,723. 72 కోట్లు, 2017–18లో 20,040.04 కోట్లు ఖర్చు చేశారు. తాజా బడ్జెట్‌లో ప్రాజెక్టుల వారీగా కేటాయింపుల వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రాజెక్టు	2017–18 సవరించిన బడ్జెట్ (రూ. కోట్లలో)	2018–19 (రూ.కోట్లలో)
1. కాళేశ్వరం	8298.11	6094.41
2. ప్రాణహిత	220	350
3. పాలమూరు ఎత్తిపోతల	1660.45	3035.10
4. సీతారామ, రామదాసు	380	1225
5. డిండి	260	524.93
6. నాగార్జునసాగర్ ఆధునీకరణ	488	197.3
7. ఎల్లంపల్లి	150	300
8. తుపాకులగూడెం	120	500
9. దేవాదుల	1374	1966.46
10. ఎస్ఆర్ఎస్‌పి 1	190	200
11. ఎస్ఆర్ఎస్‌పి 2	119	200
12. వరద కాలువ	890.59	690
13. కల్వకుర్తి	370	500
14. నెట్టెంపాడు	70	200
15. భీమా	118	170
16. కోయిల్‌సాగర్	20	120
17. రాజోలిబండ	29	144.5
18. లోయర్ పెన్‌గంగ	200	250
19. నిజాంసాగర్	70	100.10
20. సింగూరు	42	50
21. ఎస్ఎల్‌బిసి	653	700
22. కడెం	319	159.54
23. లెండి	..	40
24. మోడికుంట వాగు	5.4	111.50
25. కుమ్రం భీం ప్రాజెక్టు	88.30	100
26. ఘనపూర్	26.5	40
27. శనిగరం	42.82	82.40
28. జగన్నాధపూర్	13	50
29. మూసీ	4.62	25
30. అసిఫ్‌నహర్	4.62	25

సకల జనుల సంక్షేమం

సామాజిక వర్గాలకు భారీ కేటాయింపులు

రానున్నది ఎన్నికల ఏడాది కావడంతో ఏ సామాజికవర్గాన్నీ నొప్పించకుండా ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఇప్పటికే గొల్ల కుర్మలకు గొర్రెల పంపిణీ, మరో సామాజిక వర్గానికి చేపపిల్లల పెంపకం, ఇంకో సామాజిక వర్గానికి కులవృత్తులకు సంబంధించిన దుకాణాలను పెట్టుకోడానికి ఆర్థిక సాయం.. ఇలా ఇప్పటికే అమలుచేస్తున్న పథకాలకు తోడు రానున్న ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్‌లో సైతం సామాజికవర్గాలవారీగా నిధుల ప్రతిపాదనలు జరిగాయి. ఇవి కాక బ్రాహ్మణ కార్పొరేషన్ లాంటివాటికి అదనంగా నిధులు, భవన్ నిర్మాణానికి మరికొన్ని నిధుల కేటాయింపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే జరిగిపోయింది. ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ గురువారం సమర్పించిన బడ్జెట్‌లో వివిధ సామాజికవర్గాలకు, వాటి సమాఖ్యలకు ప్రతిపాదించిన కేటాయింపులు ఇలా ఉన్నాయి

కార్పొరేషన్లకు కేటాయింపులు ఇలా..

బిసి ఫైనాన్స్ కార్పొరేషన్‌కు	రూ.5 కోట్లు,
రజక సమాఖ్యకు	రూ. 200 కోట్లు
నాయీబ్రహ్మణ సమాఖ్యకు	రూ. 250 కోట్లు
వడ్డెర సమాఖ్యకు	రూ.5.45 కోట్లు,
కృష్ణ బలిజ ఫెడరేషన్‌కు	రూ.5 కోట్లు
వాల్మీక, బోయ ఫెడరేషన్‌కు	రూ. 2.10 కోట్లు
భట్రాజ్ ఫెడరేషన్ కు	రూ. 2 కోట్లు
మేదర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు	రూ.3 కోట్లు
విశ్వ బ్రహ్మణ కార్పొరేషన్‌కు	రూ. 10 కోట్లు
శాలివాహన ఫెడరేషన్‌కు	రూ. 8 కోట్లు
కల్లుగీత ఫైనాన్స్ కార్పొరేషన్‌కు	రూ.10 కోట్లు
సంచార జాతుల ఫెడరేషన్‌కు	రూ. 10 కోట్లు
సాగర ఫెడరేషన్‌కు	రూ. 10 కోట్లు
ఎంబీసి కార్పొరేషన్‌కు	రూ. 1000 కోట్లు
చేనేతకారుల సహాయానికి	రూ. 1200 కోట్లు

అప్పు రూ.1.80 లక్షల కోట్లు!



మన తెలంగాణ/ హైదరాబాద్ : వచ్చే ఏడాది మార్చి నాటికి రాష్ట్రం అప్పులు రూ.1.80 లక్షల కోట్లకు చేరనుంది. అంటే తెలంగాణలో సగటున ఒక్కో వ్యక్తిపై రూ.51వేలు అప్పుగా ఉండ నుంది. మరో వైపు మార్కెట్ ధరల ప్రకారం తలసరి ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 1.75 లక్షలు ఉంటుందని అంచనా. అంటే తలసరి ఆదాయంలో అప్పు వాటా మూడో వంతు. రాష్ట్ర ఆవిర్భావించే నా టికి రాష్ట్రానికి సంక్రమించిన అప్పులు రూ.72వేల కోట్లు అని స్వయంగా ముఖ్యమంత్రి కెసిఆర్ అసెంబ్లీలో ప్రకటించారు. 2017–18 ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి ఇది రూ.1.51 లక్షల కోట్లకు పెరగనుంది. ఆ తరువాత 2018–19 సం వత్సరంలో రుణ భారం రూ.1.80 లక్షల కోట్లకు చేరనుంది. అంటే ఐదేళ్ళ లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులు సుమారు రూ.1.08 లక్షల కోట్లు అవుతుందని అంచనా. ప్రభుత్వం శరవేగంగా నీటి పారుదల ప్రాజెక్టులు, ఇంటింటికి రక్షిత నీరందించే కార్యక్రమం, మౌలిక సదుపాయల కల్పన పనులు చేపడుతుండడమే ఇందుకు కారణం. అప్పులు 2015– 16లో రూ.93వేల కోట్లు ఉండగా, 2016– 17లో రూ.1.27 లక్షల కోట్లకు చేరింది.

బహిరంగ మార్కెట్ నుండే అధికం: ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ప్రతిపాదించిన బడ్జెట్ ప్రకారం అప్పులు రూ.1,80,238 కోట్లకు చేరనుంది. ఇందులో అత్యధికంగా బహిరంగ మార్కెట్ నుండి సేకరించిందే రూ.1.38 లక్షల కోట్లు. కేంద్ర ప్రభుత్వం నుండి రూ.9,409 కోట్లు, స్వయం ప్రతిపత్తి సంస్థల నుండి రూ.13,611 కోట్లు, చిన్న మొత్తాల పొదుపు, పిఎఫ్ వంటి సంస్థల నుండి రూ.18,738 కోట్లు రుణం తీసుకున్నట్లవుతుంది. మరోవైపు మొత్తం బడ్జెట్ రూ.1.74 లక్షల కోట్లు కాగా, అప్పులు దానికంటే కొద్దిగా ఎక్కువగా రూ.1.80 లక్షల కోట్లుగా ఉండనుంది.

పరిమితికి లోబడే అప్పులు: తమ ప్రభుత్వం అప్పు చేసి పప్పు కూడు తినడం లేదని, అప్పు చేసి ఆస్తులను సృష్టిస్తున్నదని, ప్రాజెక్టులు కడుతు న్నామని, రోడ్లు వేస్తున్నామని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. జిఎస్‌డిపికి 25 శాతం లోపే మొత్తం అప్పులు ఉండాలని, అలాగే ఆర్థిక సంవత్సరంలో ఎఫ్ఆర్‌బిఎం చట్టం ప్రకారం 3.5 శాతానికి మించి రుణా లు తీసుకోకూడదని, మొత్తం రాబడిలో పది శాతం మించి ఉండొద్దనే నిబంధనలు ఉన్నాయని వివరించారు. వాటికి అనుగుణంగానే అప్పులు తెస్తున్నామని చెప్పారు. పలు పథకాలకు బడ్జెటేతర వనరుల ద్వారా నిధులు సేకరిస్తున్నామని, ఇందుకు ప్రభుత్వం బ్యాంకు గ్యారెంటీ ఇస్తున్నదని, రూ.80వేల కోట్ల వరకు గ్యారెంటీకి వెసులుబాటు ఉన్న దన్నారు.

పరిశ్రమకు ప్రోత్సాహం

బడ్జెట్‌లో రూ. 1,285.72 కోట్లు కేటాయింపు

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో పరిశ్రమల రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ సారి భారీ నిధులను కేటాయించింది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ. 1,285.72 కోట్లలో రూ. 186 కోట్లు నిర్వహణ పద్దుకు పోగా మిగతా రూ. 1,098 కోట్లు పరిశ్రమల రంగానికి వినియోగించుకోనుంది. క్రిందటి సారి బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే 2017–18 ఆర్థిక సంవత్సరంలో రూ. 984 కోట్లు పరిశ్రమల శాఖకు ప్రభుత్వం కేటాయించింది. క్రితం సంవత్సరం కంటే కూడా ఈ సారి రూ. 301 కోట్లు అధిక కేటాయింపులు చేసింది. ఎస్ఎంఈ రంగంలో పరిశ్రమల అభివృద్ధి కోసం ఈ 301 కోట్లలో 256 కోట్ల వరకు ఖర్చు చేయాలని భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిశ్రమల శాఖ భవనం స్థానంలో నూతన భవన నిర్మాణం కోసం కూడా ప్రభుత్వం ఈ నిధులను వినియోగించుకోవాలని భావిస్తోంది.



చేనేత, జౌళి రంగానికి 1200 కోట్లు

రాష్ట్రంలో చేనేత కార్మికులను ఆదుకునేందుకు రూ. 1200 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. చేనేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయడం, నూలు, రంగులు, డైయింగ్ తదితర రసాయనాలను సబ్సిడీపై అందజేయనుంది. అలాగే నేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాల మార్కెటింగ్ బాధ్యతలను కూడా టెస్కోకు అప్పగించింది. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న పవర్ చేనేత, పవర్ లూమ్‌లను ఆధునీకరించేందుకు కూడా చర్యలు తీసుకుంటుంది. కార్మికులకు ప్రతి నెలా రూ. 15 వేలకు తగ్గకుండా వేతనం ఇచ్చే విధంగా పవర్ లూమ్ యాజమాన్యాలతో ఒప్పించింది. వరంగల్‌లో టెక్స్‌టైల్ పార్కు, సిరిసిల్లలో అప్పెరల్ పార్కులను ఏర్పాటు చేస్తోంది.

ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రగతి నిధి

మన తెలంగాణ / హైదరాబాద్ : ఈ సారి బడ్జెట్‌లో తెలంగాణ ప్రభుత్వం ఎస్‌సి , ఎస్‌టిలకు ప్రగతి నిధిని కేటాయించింది. ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమ శాఖలకు గతేడాది కంటే కొంత మేర నిధుల కేటాయింపు తగ్గినప్పటికి ప్రగతి నిధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. ఎస్‌సిల ప్రగతినిధికి రూ.16,453 కోట్లు, ఎస్‌టిల ప్రగతి నిధికి రూ.9,693 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఈ నిధులతో పాటు షెడ్యూలు కులాల శాఖకు రూ.12,709 కోట్లు, షెడ్యూలు తెగల శాఖకు రూ.8,063 కోట్ల కేటాయింపులు జరిపారు. ఈ సారి ప్రగతి నిధిని ప్రత్యేకంగా కేటాయించడంతో గతంలోని కేటాయింపులకంటే ఈసారి బడ్జెట్ లో నిధులను తగ్గించారు. ఎస్‌సి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు గతేడాది రూ.60 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ.66 కోట్లు, మెట్రిక్ అనంతరం విద్యకు ఇచ్చే ఉపకార వేతనాలకు గతేడాది రూ.100.44 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ.102.32 కోట్లు కేటాయించారు. ఉపకార వేతనాలు, స్టైఫండ్ల కోసం కేటాయింపులు గతేడాది 190 కోట్లు కాగా ఈ ఏడాది రూ.190. 85 కోట్లు కేటాయించారు. వసతి గృహాలకు సరఫరా చేసే వస్తువులు, రేషన్ కాస్మొటిక్ చార్జీలు ఇతరత్రా వాటికి రూ.116. 65 కోట్లు కేటాయించారు. విద్యార్థులకు అదనపు సౌకర్యాలు కల్పించడం కోసం గతేడాది రూ.97.50 కోట్లు కేటాయించగా ఈ సారి రూ.130 కోట్లు కేటాయింపులు జరిపారు. వృద్దాప్య, వితంతు, ఆసరా పింఛన్లకు గతేడాది జరిపిన కేటాయింపుల మాదిరిగానే ఈ సారి అంతే మొత్తంలో రూ.646.19 కోట్లు, పౌష్టికాహారం కోసం రూ.780.30 కోట్లు, పాలీహౌస్ రాయితీ కోసం రూ.15.4 కోట్లు కేటాయించారు. ఎస్‌టిల ఆర్థిక సహకార పథకాలకు రూ.214. 15 కోట్లు, అటవీ పరిరక్షణకు రూ.50 లక్షలు, ప్రి మెట్రిక్ ఉపకార వేతనాలు, స్టైఫండ్లకు రూ.224.21 కోట్లు, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు రూ. 142.25 కోట్లు, అంబేద్కర్ విదేశి విద్యానిధికి రూ.14.50 కోట్లు కేటాయించారు. ఆరోగ్యలక్ష్మి కి రూ.54 కోట్లు కేటాయించారు.

వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి

మన తెలంగాణ / హైదరాబాద్ : సమగ్ర ప్రణాళికతో ప్రజారోగ్యాన్ని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించింది. ప్రివెన్షన్ ఈజ్ బెటర్ ద్యాన్ క్యూర్ అని వ్యాఖ్యానించిన ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ 2018 – 19 ససంవత్సరానికి బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్యం కోసం రూ.7,375.20 కోట్లను కేటాయించింది. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి వైద్య, ఆరోగ్యశాఖకు రూ. 1299.03 కోట్ల మేర పెంచింది. ఎంఎన్‌జె ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రానికి రూ.15 కోట్లు, వైద్య విధాన పరిషత్‌లో ఆసుప్రతుల స్థాయిని పెంచేందుకు రూ.46.70 కోట్లు, నూతన పరికరాల కోసం రూ.30 కోట్లు, రోగ నిర్ధారణ కోసం రూ.40 కోట్లను తాజా బడ్జెట్‌లో కేటాయించింది. ఆరోగ్యశ్రీ పథకంలోకి రానివారికి నిమ్స్ ఆసుప్రతిలో చికిత్స కోసం రూ.10 కోట్లను కేటాయించింది. కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్శిటి నిర్వహణ కోసం రూ.10 కోట్లు, భవనాలు, ఇతర పనుల కోసం రూ.511 కోట్లు, ఆరోగ్య శ్రీ పథకానికి రూ.699.44 కోట్లు, కేసీఆర్ కిట్ల కోసం రూ.560.50 కోట్లు, ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్ స్కీం కోసం రూ. 300 కోట్లను కేటాయించింది. రాష్ట్రంలో నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుప్రతులు నిర్మించాలని గత బడ్జెట్‌లో ప్రతిపాదించారు. గర్భిణీలు, బాలింతల కోసం ప్రత్యేకమైన చర్యలు చేపట్టింది. ఇందుకోసం అమ్మ ఒడి పథకాన్ని చేపట్టిన ప్రభుత్వం దాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం రూ.561 కోట్ల రూపాయాలను కేటాయించింది.

సాగు బాగు

పెట్టుబడి.. యాంత్రీకరణ..

రైతుబీమాకు పెద్ద పీట

ఇక సబ్సిడీపై నాట్ల మిషన్



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర వ్యవసాయశాఖకు ఈసారి బడ్జెట్ కేటాయింపులు భారీగా పెరిగాయి. వ్యవసాయ, ఉద్యాన, సహకార శాఖలకు మొత్తంగా కలిపి ప్రగతి పద్దు కింద వివిధ రాష్ట్ర పథకాలకు రూ. 15,511.56 కోట్లు కేటాయింపులు చేశారు. గత ఏడాది బడ్జెట్ రూ.6498.15 కోట్లుగా ఉంటే దాదాపు రూ. 9013 కోట్లు పెరిగింది. వచ్చే నెల నుంచి అమలు చేయనున్న ఎకరాకు రూ. 4వేలు వ్యవసాయ పెట్టుబడి పథకానికి చేసిన రూ. 12 వేల కోట్లు అదనం. జూన్ 2వ తేదీ నుంచి అమలు చేయనున్న రైతు బీమాకు రూ. 500 కోట్లు కేటాయింపులు చూపారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌లో భాగంగా రూ. 2943.60 కోట్లు మిగతా రైతులకు రూ.9056.40 కోట్లు వేరువేరు పద్దులో చూపారు. , ట్రాక్టర్లు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు వ్యవసాయ యాంత్రీకరణ కింద రూ.522 కోట్లు, గత ఏడాది దీనికి రూ. 336.80 కోట్లు మాత్రమే ఉంది. ఇకపై సబ్బిడిపై నాటు వేసే యంత్రాలు కూడా పంపిణీ చేయాలని సంకల్పించారు. పావలా వడ్డీ, వడ్డీ లేని రుణాలకు రూ. 500 కోట్లు (గత బకాయిలు కలుపుకుని), వ్యవసాయ విస్తరణ అధికారుల క్లస్టర్ పరిధిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు, ఇతర సమావేశాలు నిర్వహించుకునేందుకు రైతు వేదికల నిర్మాణానికి రూ. 158.94 కోట్లు కేటాయించారు. అలాగే పంటల బీమాకు ఈసారి కేటాయింపులు తగ్గాయి. ఈసారి రూ. 224.53 కోట్లు కాగా, గత ఏడాది రూ.210 కోట్లుగా ఉంది. విత్తన, ఎరువుల నమూనాల పరీక్షల ల్యాబ్‌లను బలోపేతం చేసేందుకు రూ.9 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేంద్రం నుంచి వ్యవసాయశాఖకు రూ. 775.68 కోట్లు రానున్నాయి. గత ఏడాది ఈ మొత్తం రూ. 683.07గా ఉంది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీకి రూ. 105.50 కోట్లు, కొండా లక్ష్మ ణ్ బాపుజీ ఉద్యాన వర్సిటీకి రూ. 17.61 కోట్లు కేటాయించారు.

మళ్లీ పాలీహౌస్‌లు.. పట్టు పరిశ్రమకు పెంపు

ఉద్యాన పంటల సాగు చేపట్టి అధిక లాభాలు గడించాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ బడ్జెట్‌లో కేటాయింపులు మాత్రం ఆశాజనకంగా లేవు. గత ఏడాదితో పోలిస్తే ప్రగతి పద్దులో కేటాయింపులు పెరిగినప్పటికీ, పథకాలు మాత్రం పెద్దగా ఏమి లేవు. ఉద్యానశాఖకు ప్రగతి పద్దు కింద ఈసారి రూ.245.10 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో పాలీహౌస్‌ల నిర్మాణానికి రూ.119.53 కోట్లు కేటాయింపులు చేసింది. గత ఏడాది ఈ పద్దు శూన్యంగా ఉంది. అలాగే ఉద్యాన పంటల ప్రోత్సాహకానికి రూ. 66.59 కోట్లు, సూక్ష్మ సేద్యానికి రూ.55.98 కోట్లు కేటాయింపులు చూపారు. పట్టు పరిశ్రమను ప్రోత్సాహించేందుకు రూ.7.64 కోట్లు ఉంది. గత ఏడాది ఇది రూ. 2 కోట్లు మాత్రమే ఉండటం గమనార్హం. కేంద్ర ప్రాయోజిత పథకాలకు కోసం ఉద్యాన శాఖకు రూ. 60 కోట్లు రానున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు.

మార్కెటింగ్‌కు తగ్గిన కేటాయింపులు

గత ఏడాదితో చూస్తే ఈసారి మార్కెటింగ్ శాఖకు నిధులు భారీగా తగ్గాయి. ఈసారి కేంద్ర ప్రాయోజిత నిధులతో కలిపి ప్రగతి పద్దులో రూ. 122.57 కోట్లు కేటాయించగా, గత ఏడాది ఈ మొత్తం రూ. 457 కోట్లుగా ఉంది. గ్రామీణభివృద్ధి మౌలిక సదుపాయాలకు గతంలో రూ. 348 కోట్లు ఉండగా ఈసారి రూ. 50 కోట్లకు కుదించారు. బహిరంగ మార్కెట్‌లో పంట ఉత్పత్తుల ధరలు పడిపోతే మద్ధతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు అవసరమైన మార్కెట్ జోక్య నిధి (రివాల్వింగ్ ఫండ్)ను బడ్జెట్‌లో చూపలేదు. దాదాపు రూ. 500 కోట్లతో తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితికి రివాల్వింగ్ ఫండ్ ఇస్తామని గతంలో సిఎం కె.చంద్రశేఖర్ రావు ప్రకటించినప్పటికీ కేటాయింపులు మాత్రం చూపలేదు.

అద్భుతమైన బడ్జెట్


మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను అద్భుతమైన బడ్జెట్‌గా పలువురు టీఆర్ఎస్ ఎంఎల్‌సిలు అభివర్ణించారు. ఇటువంటి బడ్జెట్‌ను ఇప్పటి వరకు దేశంలో మరే రాష్ట్రం ప్రవేశపెట్టలేదని, పెట్టే పరిస్థితి కూడా ఉండదని వ్యాఖ్యానించారు. ఇటువంటి ప్రత్యేకత కలిగిన బడ్జెట్‌ను విమర్శించడం ప్రతిపక్షాలకు తగదన్నారు. ప్రజాభీష్టం మేరకు సీఎం కేసీఆర్ దార్శనికత్వంలో ఈ బడ్జెట్ రూపుదిద్దుకుందని తెలిపారు. గురువారం శాసనమండలిలో బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాత మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌సిలు నారాదాసు లక్ష్మ ణరావు, పురాణం సతీశ్, బోడకుంటి వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బడ్జెట్ పెంపుదలతో పాటు కేటాయింపులు ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే ఉందన్నారు.

హెల్త్ స్కీమ్‌లపై ప్రచారం అవాస్తవం : సిఎంఒ


మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ లను ఆరోగ్యశ్రీలో కలుపుతూ బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరిగిందని, కానీ క్యాబినెట్‌లో అలాంటి నిర్ణయం ఏదీ జరగలేదని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. . ఆరోగ్య శ్రీ, ఎంప్లాయిస్ , పెన్షనర్లు, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ ప్రస్తుతం ఎలా నిర్వహిస్తున్నారో, భవిష్యత్తులో కూడా అలాగే నిర్వహిస్తారని, ఇందులో ఎలాంటి మార్పు లేదని పేర్కొంది. ఎంప్లాయిస్, పెన్షనర్లు, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ నిర్వహణకు కావాల్సిన ఉద్యోగులను నియమించడానికి క్యాబినెట్‌లో ఆమోద ముద్ర వేసినట్లు సమాచారం.

రాబడి : ఖర్చు (2018-19)

(రూ. కోట్లలో)



❝పనిని ఎప్పటికీ వదిలిపెట్టకూడదు. అది జీవితానికి అర్థాన్ని ఇస్తుంది. పని లేకపోతే జీవితం లేదు.
– స్టీఫెన్ హాకింగ్❞



రైతుకు, సంక్షేమానికి పెద్దపీట

సంపాదకీయం

టిఆర్ఎస్ ప్రభుత్వం గురువారం శాసనసభకు సమర్పించిన – ఎన్నికలముందు చివరి బడ్జెట్ – తమ సంక్షేమ వరవడిని కొనసాగిస్తూ ఇరిగేషన్ సహా వ్యవసాయరంగానికి పెద్దపీట వేసింది. సాధారణంగా పాలకపార్టీలు అనుసరించే విధంగా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేకించి తాయిలాలేమీ ప్రకటించకపోవటం విశేషం. మౌలికరంగాల్లో అభివృద్ధిని ముందుకు నడిపిస్తూ సమాజంలోని వివిధ విభాగాల ప్రజలకు ముఖ్యమంత్రి కెసిఆర్ ఇంతకుముందే – గడచిన నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాలు ప్రకటించారు. సమైక్యరాష్ట్రంలో 2013–14 సంవత్సరంలో 5.4శాతంగా ఉన్న తెలంగాణ ప్రాంత జిడిపి వృద్ధిరేటు అంచెలంచెలుగా పెరుగుతూ 2017–18లో 10.4శాతానికి చేరనుండటమే రాష్ట్రాభివృద్ధికి మచ్చుతునక. జిడిపి జాతీయ వృద్ధిరేటు 6.6శాతంగా ఉండటం గమనార్హం. విద్యుత్ రంగంలో సంస్కరణలు, కొత్తపారిశ్రామిక విధానంవల్ల తయారీరంగంలో వృద్ధిరేటు 2017–18 లో 7.4శాతానికి చేరనుంది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధి 2017–18లో 6.9శాతానికి చేరుకుందని, సాగునీటి లభ్యత పెరగటం, కోతల్లేని 24 గంటల విద్యుత్ సరఫరా, భూగర్భ జలాల సద్వినియోగంతో 2018–19లో కూడా వ్యవసాయ అభివృద్ధి గణనీయంగా ఉంటుందని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ తమ బడ్జెట్ ప్రసంగంలో ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర తలసరి ఆదాయం 2016–17లో రూ.1,54,734 కాగా 2017–18లో రూ.1,75,534కు చేరుతుందని, ఈ 13.4శాతం వృద్ధి జాతీయ వృద్ధిరేటు 8.6శాతంతో పోల్చితే ఎంతో ఎక్కువని రాజేందర్ చెప్పారు.

2018–19 సంవత్సరానికి రూ.1,74,453 కోట్ల అంచనా వ్యయంతో ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర స్వంత ఆదాయం రూ.73,751.88కోట్లుగా, కేంద్రంనుంచి వచ్చే నిధులు రూ.29,041.88 కోట్లుగా అంచనా వేశారు. అంటే బడ్జెట్ వ్యయం–ఆదాయం మధ్య రూ.71,660కోట్ల వ్యత్యాసం ఉంది. జిఎస్‌టి అమలులోకి వచ్చాక రాష్ట్రప్రభుత్వానికి పన్నులు పెంచే అవకాశం పరిమితం కాబట్టి కొత్త రుణాల ద్వారా ఈ వ్యత్యాసాన్ని పూడ్చుకోవాల్సి ఉంటుంది. అయితే మొత్తంమీద రెవెన్యూ మిగులు రూ.5520.14 కోట్లుగా, ద్రవ్యలోటు రూ.29077.07కోట్లుగా అంచనా వేశారు.

గణాంకాలను అలా ఉంచి, బడ్జెట్ దిశను పరిశీలిస్తే, కోటి ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా గోదావరి, కృష్ణ నదులపై 23 మేజర్, 13మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేబట్టిన ప్రభుత్వం, ఈ బడ్జెట్ గతంలోవలె భారీగా రూ.25వేలకోట్లు కేటాయించింది. 35,29,944 మంది రైతులకు చెందిన రూ.16,124కోట్ల పంట రుణాలను బ్యాంకులకు చెల్లించి రుణమాఫీ అమలు చేసిన ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ పెట్టుబడి అనే వినూత్న పథకాన్ని దేశంలోనే మొదటిసారి ప్రారంభించింది. ఎకరాకు రూ.4 వేల చొప్పున రెండు పంటలకు రూ.8 వేలు ఉచితంగా అందజేసే ఈ పథకానికి రూ.12వేలకోట్లు కేటాయించారు. అలాగే రైతులకు బీమా పథకం కింద ప్రీమియం చెల్లించేందుకు రు.500 కోట్లు కేటాయించారు. ఇంటింటికీ నల్లాల ద్వారా సురక్షితమైన నీరు అందించే మిషన్ భగీరథ వలె ఇవి రెండూ దేశానికే ఆదర్శం.

సంక్షేమ రంగానికి వస్తే, ఆసరా పెన్షన్‌ను బోదకాలు బాధితులకు కొత్తగా విస్తరించారు. 41,78,291 మందికి ఆసరా పథకం కింద ప్రభుత్వం రూ.5300 కోట్లు వెచ్చిస్తున్నది. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆరోగ్యలక్ష్మి పథకాలతో పేద ఆడపిల్లల వివాహాలకు, గర్భిణీ స్త్రీలను ఆదుకుంటున్నది. అమ్మ ఒడి పథకం కింద గర్భిణులకు మూడు విడతల్లో రూ.12వేలు నగదు, ప్రసవానంతరం కెసిఆర్ కిట్ వల్ల ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పులు 51శాతానికి చేరాయి. ప్రభుత్వాసుపత్రుల్లో డయాలసిస్, ఐసియు, కాన్సర్ పరీక్షల వంటి ఆధునిక వసతుల విస్తరణ జరుగుతోంది. గ్రామీణ వృత్తులకు ప్రోత్సాహ పథకాలు కొనసాగుతున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల సంక్షేమానికి, ముఖ్యంగా రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీల ద్వారా జరుగుతున్న కృషి ప్రశంసనీయం. పాఠశాల విద్య మెరుగుదలకు 8792 టీచర్లను నియమించనున్నారు.

ఉద్యోగ నియామకాలకు సంబంధించి 1,10,012 ఖాళీలు గుర్తించగా, 83,048 భర్తీకి ఉత్తర్వులు జారీకాగా 27,588 నియామకాలు పూర్తి అయినట్లు ఆర్థికమంత్రి తెలిపారు.

టిఆర్ఎస్ ప్రభుత్వ హామీల్లో ప్రధానమైన మరో రెండు కార్యక్రమాలు – దళితులకు 3 ఎకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ళు – కొనసాగుతున్నాయి. గత 45నెలల్లో 4939మంది దళితులకు 12,745 ఎకరాలు పంపిణీ చేసినట్లు, అలాగే డబుల్ బెడ్ రూం ఇళ్లకింద 2,72,763 ఇళ్లు మంజూరు చేసినట్లు, 9522 పూర్తి అయినట్లు, 1,68,981 పురోగతిలో ఉన్నట్లు ఈటల తెలిపారు.ఈ ప్రభావవంతమైన పథకాలకు నిధుల కేటాయింపు మరికొంత పెంచి ఉంటే బాగుండేది. ఏమైనా, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో అనేక రాష్ట్రాలకన్నా ముందున్నట్లు, దేశానికే ఆదర్శమైన కొన్ని వినూత్న పథకాలు అమలు జరుపుతూ ప్రశంసలు పొందుతున్నట్లు విదితమవుతున్నది.

రాటుదేలిన రైతు ఉద్యమం

చూపు


మహారాష్ట్ర రైతుల లాంగ్‌మార్చ్ మార్చి 6వ తేదీన ప్రారంభమైంది? మండే ఎండలో రైతులు ఇంతదూరం నడిచొచ్చేవరకు మహారాష్ట్ర ప్రభు త్వం ఏం చేస్తోంది? నిజంగా రైతుల సమస్యల పట్ల చిత్త శుద్ధి ఉంటే వారు ముంబయి నడిచి వచ్చే వరకు వేచి ఉండాలా? పాలనా యంత్రాంగమే రైతుల వద్దకు వెళ్ళి వారి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయదా? ఏడాది క్రితం పాలకేన్లను రైతులు పారబోసినప్పుడు, రోడ్లపై కూరగాయలను విసిరికొట్టినప్పుడు ప్రభుత్వం రైతుల బాధల గురించి ఎందుకు ఆలోచించలేదు. అధికారంలోకి రాగానే పశుమాంసం గురించి ఆలోచించిన ప్రభుత్వానికి, రైతుల సమస్యలు ఆలోచించే సమస్యలుగా కనబడలేదా?రైతుల పాదయాత్ర మీడియా దృష్టిని ఆకర్షించడం వల్లనే ప్రభుత్వం కాస్త దిగి వచ్చి మాట్లాడింది. కాని పట్టణాల్లో, నగరాల్లో నివసిస్తున్న మేధావులకు రైతుల సమస్య పూర్తిగా అర్థమైనట్లు కనబడడం లేదు. రైతులకు రుణమాఫీ అనేది ఆర్థికంగా చాలా చెడ్డ నిర్ణయం అని చెబుతుంటారు. కూరగాయల మండీకి వెళితే గీచి గీచి బేరాలాడేది కూడా మనమే. కొందరైతే రైతుల ఈ పాదయాత్ర చూసి ''పట్టణ నక్సలైట్లు'' అని పేరు కూడా పెట్టేశారు. వ్యవసాయరంగం దేశంలో సంక్షోభస్థితిలో ఉంది. రైతులకు రుణమాఫీ అనేది ఒక ఊరట. శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నాలు జరగవలసి ఉంది. రైతులు కూడా రుణమాఫీ మాత్రమే కోరుకోవడం లేదు. ఎమ్మెస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని కోరుతున్నారు. కాని మన మధ్యతరగతి మేధావుల్లో చాలా మందికి వ్యవసాయరంగం ఎంత దుస్థితిలో ఉందో తెలియదు. మన న్యూస్ చానళ్ళకు ఇవి వార్తలు కావు. రైతులకు రుణసదుపాయం అందుబాటులో లేదు. వడ్డీ వ్యాపారుల నుంచి రుణాలు తీసుకునే పరిస్థితి. వడ్డీ ఊబిలో చిక్కుకుపోయే దారుణస్థితి. ప్రభుత్వాలు, బ్యాంకులు బడా పారిశ్రామికవేత్తలకు వేలాది కోట్లు రుణాలిస్తాయి కాని చిన్నకారు రైతుకు రుణమివ్వాలంటే ముందుకు రావు. వ్యవసాయ ఖర్చులు పెరగడం, గిట్టుబాటు ధర లేకపోవడం. వ్యవసాయం ఆకలిని పండించేదిగా మారిపోయింది.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్ జూన్ 2017న రైతు రుణాల మాఫీ ప్రకటించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ ఛేత్కారీ సమ్మాన్ యోజన పేరుతో ప్రకటించిన ఈ స్కీము వల్ల 89లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని అంచనా. మహారాష్ట్రలో 2017 సం॥ లో ఆత్మహత్య చేసుకున్న రైతుల సంఖ్య 2,917మంది. ఇందులో 60శాతం ఆత్మహత్యలు రుణమాఫీ ప్రకటన తర్వాతివేనని కూడా తెలిసింది. రుణమాఫీ తర్వాత కూడా ఎందువల్ల రైతులకీ దుస్థితి అంటే రుణమాఫీ చెప్పినంత సజావుగా జరగకపోవడం ఒక కారణమైతే, వర్షాలు లేకపోవడం, కరువు పరిస్థితులు, చీడ వగైరా కారణాల వల్ల పంటలు నష్టపోవడం మరో కారణం. రుణాల రద్దు ప్రకటించినప్పటికీ రద్దు ఎప్పుడు జరుగుతుందో, కొత్తగా రుణాలు ఎప్పుడు దొరుకుతాయో తెలియని అయోమయం ఒకటి. ఉత్పాదక ఖర్చు కన్నా కనీసం 50శాతం ఎక్కువ గిట్టుబాటు ధర ప్రకటించాలని స్వామినాథన్ కమిటి చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగులకు కరువుభత్యం పేరిట జీతాలు పెరుగుతున్నట్లే రైతులకు గిట్టుబాటు ధర ప్రతి సంవత్సరం సమీక్షించి పెంచవలసిన అవసరం కూడా ఉంటుంది. కానీ ప్రభుత్వాలు అలా చేయవు. ప్రతి సంవత్సరం గిట్టుబాటు ధరను పెంచడం కన్నా రుణమాఫీయే మంచిదనుకుంటున్నాయి. ఏతావాత వ్యవసాయం అంటే నష్టం తప్ప లాభం లేని వ్యాపకమైపోయింది. పైగా గిట్టుబాటు ధర విషయంలో మహారాష్ట్ర రైతులకు మరిన్ని కష్టాలున్నాయి. ఉదాహరణకు బీహారులో రోజుకూలి 100 రూపాయల నుంచి 150 వరకు మాత్రమే కాని అదే మహారాష్ట్రలో కనీసం 300 రూపాయలు. రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య విత్తనాలు, ఎరువుల ధరల్లోను తేడా ఉంది. అనేక కారణాల వల్ల మహారాష్ట్ర రైతులకు ఉత్పాదక ఖర్చు ఎక్కువ.

గత సంవత్సరం కూడా మహారాష్ట్ర రైతులు సమ్మె చేశారు. తమ ఉత్పత్తులు అమ్మడం లేదంటూ నిరాకరించారు. పాలు, పండ్లు, కూరగాయలు మార్కెట్లకు రాలేదు. ఈ స్ట్రయిక్ వల్లనే ఫడ్నవీస్ ప్రభుత్వం చివరకు రుణమాఫీ ప్రకటించింది. మహారాష్ట్ర రైతులు పారెస్ట్ రైట్స్ చట్టం ప్రకారం తరతరాలుగా అటవీ భూములు సాగు చేస్తున్న వారికి ఆ భూమిపై హక్కు ఇవ్వాలి. కాని ప్రభుత్వం ఇంకా నాన్చుతూనే ఉంది. రైతు సాగు చేయాలంటే పెట్టుబడి కోసం అప్పు చేయక తప్పని పరిస్థితి, రుణసదుపాయం అందించే పటిష్టమైన యంత్రాంగమేదీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. కోఆపరేటివుల ద్వారా లభించే రుణాలకు సంబంధించిన ఫిర్యాదులు చాలా ఉన్నాయి. చీడ కారణంగా పత్తి పంట నష్టపోయినప్పుడు పంట ఇన్సురెన్స్ విషయంలో విషయంలో కాని రైతులకు రిలీఫ్ విషయంలో కాని ప్రభుత్వం విఫలమైంది. 2012 నుంచి 2017 వరకు రాష్ట్రంలో వ్యవసాయరంగం పతనోన్ముఖంగా ఉంది. ఫలితంగా రైతుల చేతుల్లో డబ్బులే మిగలని పరిస్థితి. 2017లో ప్రకటించిన రుణమాఫీ వల్ల లక్షన్నర రూపాయల రుణం తీసుకున్న వారికి రుణమాఫీ ప్రకటించారు. అంతకన్నా ఎక్కువ తీసుకున్నవారికి వన్ టైమ్ సెటిల్ మెంట్ అన్నారు. కాని లక్షన్నర కన్నా ఎక్కువ రుణం తీసుకున్న వారు వన్ టైమ్ సెటిల్ మెంటుకు చెల్లించే సొమ్ము కూడా చేతిలో లేని స్థితిలో ఉన్నారు. పైగా రుణమాఫీలోని అనేక ఆంక్షల వల్ల చాలా మందికి రుణాలు మాఫీ జరగలేదు. రుణమాఫీ జరక్కపోతే కొత్త రుణం దొరకదు. రుణం దొరక్కపోతే మళ్ళీ సాగు చేయలేరు. సాగు చేసినా గిట్టుబాటు ధర లేదు. ఈ సమస్యలే రైతులను ఆందోళన బాట పట్టించాయి.

రైతుల పాదయాత్ర మీడియా దృష్టిని ఆకర్షించడం వల్లనే ప్రభుత్వం కాస్త దిగి వచ్చి మాట్లాడింది. కాని పట్టణాల్లో, నగరాల్లో నివసిస్తున్న అపరమేధావులకు రైతుల సమస్య పూర్తిగా అర్థమైనట్లు కనబడడం లేదు. రైతులకు రుణమాఫీ అనేది ఆర్థికంగా చాలా చెడ్డ నిర్ణయం అని చెబుతుంటారు? నిజానికి గిట్టుబాటు ధర విషయంలో ప్రభుత్వం న్యాయంగా వ్యవహరిస్తే, వ్యవసాయం లాభసాటిగా మారిస్తే రుణమాఫీ చేయవలసిన అవసరమే ఉండదు. అసలు రైతులు సాగు చేయడానికి రుణం పై ఆధారపడే పరిస్థితి లేకుండా చేయడం అవసరం. కొందరైతే రైతుల ఈ పాదయాత్ర చూసి ''పట్టణ నక్సలైట్లు'' అని పేరు కూడా పెట్టేశారు. వ్యవసాయరంగం దేశంలో సంక్షోభస్థితిలో ఉంది. రైతులకు రుణమాఫీ అనేది ఒక ఊరట. శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నాలు జరగవలసి ఉంది. రైతులు కూడా రుణమాఫీ మాత్రమే కోరుకోవడం లేదు. ఎమ్మెస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని కోరుతున్నారు.

✻ సబ



ఐక్యసంఘటనలే కావాలిప్పుడు

త్రిపుర ఎన్నికల్లో గొప్ప విజయం తర్వాత ఉత్తరప్రదేశ్, బీహార్ ఎన్నికల్లో ఘోరపరాజయం. బిజెపి బలమేమిటో, బలహీనతలేమిటో తెలుసుకోవాలంటే ఈ ఎన్నికలను విశ్లేషిస్తే చాలు.

ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల గురించి ముందు మాట్లాడుకుందాం. గోరఖ్ పూర్ నియోజకవర్గంలో ఓటు వేసిన వెంటనే ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ 2014 కన్నా గొప్ప విజయం సాధిస్తామని చెప్పాడు. ఆయన ముఖ్యమంత్రి అయిపోయిన తర్వాత ఈ నియోజకవర్గం నుంచి పార్లమెంటు సీటు ఖాళీ చేయవలసి వచ్చింది. మరో నియోజకవర్గం ఫూల్ పూర్ లో డిప్యూటీ ముఖ్యమంత్రి కేశవప్రసాద్ మౌర్య ఖాళీ చేయవలసి వచ్చింది కాబట్టి అక్కడ కూడా ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలు 2019కు రిహార్సల్ అని కూడా యోగీ అన్నాడు. గోరఖ్ పూర్ లో 1989లో హిందూ మహాసభ ఆ తర్వాతి నుంచి వరుసగా బిజెపి గెలుస్తూ వచ్చింది. అంటే దాదాపూ మూడుదశాబ్దాలుగా హిందూత్వ రాజకీయాలే అక్కడ రాజ్యం చేస్తున్నాయి. త్రిపురలో పాతికేళ్ళ వామపక్షాల పాలన కూలినట్లే గోరఖ్‌పూర్ లోను హిందూత్వ ప్రాబల్యం కూలింది. త్రిపుర ఎన్నికలు గెలవడానికి ఎలా శాయశక్తులు వినియోగించారో అదేవిధంగా గోరఖ్ పూర్ లోను గెలవడానికి ధారాళంగా డబ్బు ఖర్చు చేయడం మొదలు జాతీయ స్థాయి నాయకులు ప్రచారం చేయడం వరకు అన్నీ చేశారు. కాని ఫలితాలు మారిపోయాయి.

గోరఖ్‌పూర్ ఉప ఎన్నికలో సమాజవాదీ పార్టీ, బహుజనసమాజ్ పార్టీలు కలిసి ఐక్యసంఘటనగా ఏర్పడ్డాయి. రెండు నియోజకవర్గాల్లోను సమాజవాది పార్టీకి బహుజన సమాజ్ పార్టీ మద్దతిచ్చింది. బహుజనసమాజ్ పార్టీ ఓట్లు సమాజవాదీ పార్టీకి బదిలీ అయ్యాయి. ఫలితం భారతీయ జనతాపార్టీ ఓడిపోయింది. ఈ ఓటమి చిన్న ఓటమి కాదు. 2014లో భారతీయ జనతాపార్టీ అభ్యర్థిగా యోగీ ఆదిత్యనాథ్ 5,39,127 ఓట్లు పొందాడు. అప్పుడు సమీప ప్రత్యర్థి సమాజవాది పార్టీకి చెందిన రాజమతి నిషాద్ కు వచ్చిన ఓట్లు 2,26,344. అంటే 3,12,783 ఓట్ల మార్జిన్ తో ఘనవిజయం సాధించాడు. నిజంగా ఇది గొప్ప విజయమే. అప్పుడు మూడోస్థానంలో నిలిచిన బహుజనసమాజ్ పార్టీకి చెందిన రాంభూపాల్ నిషాద్ 1,76,412 ఓట్లు పొందాడు. అప్పుడు సమాజవాది, బహుజనసమాజ్ పార్టీల ఓట్లు కలిపినా మొత్తం 4,02756 మాత్రమే అవుతాయి. అప్పుడు కూడా 1,36,371 ఓట్ల ఆధిక్యం యోగికి ఉంది. బిజెపికి 51.8 శాతం ఓట్లు పోలయ్యాయి అప్పుడు. సమాజవాది, బహుజనసమాజ్ పార్టీలు రెండు కలిసి కూడా కేవలం 38.6శాతం ఓట్లు మాత్రమే పొందాయి. బహుశా ఈ లెక్కల వల్లనే యోగీ ఆదిత్యనాథ్ ఈ ఎన్నికలు 2019కి రిహార్సల్ అని గర్వంగా ప్రకటించాడు. కాని ఫలితాలు తారుమారయ్యాయి. ఈ ఉప ఎన్నికల్లో సమాజవాది పార్టీ అభ్యర్థి ప్రవీణ్ నిషాద్ కు 4,56,513 ఓట్లు లభించాయి. బిజెపి అభ్యర్థి ఉపేంద్ర శుక్లాకు 4,34,632 ఓట్లు పడ్డాయి. స్పష్టంగా అర్థమవుతున్న వాస్తవమేమంటే బహుజనసమాజ్ పార్టీ మద్దతివ్వడంతో బిఎస్‌పి ఓట్లన్నీ సమాజవాది పార్టీకి బదిలీ అయ్యాయి. అంతే కాదు, పెద్ద సంఖ్యలో కాంగ్రెసు ఓట్లు కూడా ఈసారి ఐక్యసంఘటనకే పడ్డాయి. కాంగ్రెసు పార్టీ అభ్యర్థి సురీతా చటర్జీ కరీం కేవలం 18,858 ఓట్లు మాత్రమే పొందారు. కాంగ్రెసుకు చెందిన అష్టభుజ ప్రసాద్ 2014లో 45,719 ఓట్లు పొందాడు. అంటే కాంగ్రెసు ఓట్లు కూడా సమాజవాది పార్టీ వైపు వెళ్ళాయి. బిఎస్‌పి మద్దతున్న సమాజవాది పార్టీ అభ్యర్థి ప్రవీణ్ నిషాద్ 3,34,463 ఓట్లు సాధిస్తే, బిజెపి అభ్యర్థి 3,08,593 ఓట్లు పొందాడు. బిజెపి ఓట్లను కూడా సమాజవాది పార్టీ తనవైపు మరల్చుకున్నట్లే కనబడుతుంది.

సమాజవాది, బహుజనసమాజ్ పార్టీలు ఇంతకు ముందు కూడా ఉత్తరప్రదేశ్ లో కలిసి పోటీ చేశాయి. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు –1993లో ఈ రెండు పార్టీలు కలిసి బిజెపిని నిలువరించాయన్నది గుర్తుంచుకోవాలి. అప్పుడు సమాజవాది పార్టీకి 109 స్థానాలు వచ్చాయి. బహుజనసమాజ్ పార్టీ 67 స్థానాలు పొందింది. భారతీయ జనతాపార్టీ 177 స్థానాలు సాధించింది. కాంగ్రెసు పార్టీ 28 స్థానాలు, జనతాదళ్ యునైటెడ్ 27 స్థానాలు పొందాయి. సిపిఐ కూడా 3 స్థానాలు సాధించింది. 1989 శిలాన్యాస్ తర్వాత కాంగ్రెసు అవకాశవాద రాజకీయాలు, 1991 మధ్యంతర ఎన్నికల్లో బిజెపి 221 సీట్లు సాధించి అధికారంలోకి వచ్చింది. అప్పుడు ములాయం సింగ్ యాదవ్ జనతాదళ్ సోషలిస్టులో ఉన్నాడు. 1991 మధ్యంతర ఎన్నికల్లో కేవలం 30 స్థానాలు మాత్రమే ములాయంకు దక్కాయి. కాంగ్రెసు పార్టీ పతనాన్ని, కాంగ్రెసు ఓట్లు బిజెపి వైపు బదిలీ కావడాన్ని జాగ్రత్తగా గమనించిన ములాయం వెనుకబడిన వర్గాల ఓట్లను కాంగ్రెసు నుంచి తనవైపు మళ్ళించేందుకు 1992లో సమాజవాది పార్టీని ఏర్పాటు చేశాడు.

ఉత్తరప్రదేశ్ లో ఉపఎన్నికలు జరిగిన మరో నియోజకవర్గం ఫుల్ పుర్. ఒకప్పుడు భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఇక్కడి నుంచి గెలుపొందారు. ఇక్కడ 2014 ఎన్నికల్లో బిజెపి తరపున ప్రస్తుత ఉపముఖ్యమంత్రి కేశవ ప్రసాద్ మౌర్య 5,03,564 ఓట్లు పొందారు. సమాజవాది పార్టీ ధర్మరాజ్ సింగ్ 1,95,256 ఓట్లు, బహుజన సమాజ్‌పార్టీ కపిల్ ముని కర్వారియా 1,63,710 ఓట్లు పొందారు. ఈ నియోజకవర్గంలో కూడా సమాజవాది, బహుజన సమాజ్ పార్టీల ఓట్లు మొత్తం కలిపినా 3,58,966 మాత్రమే. కాని ఈసారి ఈ పరిస్థితి మారింది. ఫుల్ పూర్‌లో మాఫియా డాన్ గా పేరొందిన రాజకీయ నాయకుడు ప్రస్తుతం జైల్లో గడుపుతున్న అతీఖ్ అహ్మద్ కూడా రంగంలో ఉన్నాడీసారి. ఆయనకు 33,818 ఓట్లు పడ్డాయి. అతీఖ్ అహ్మద్ ను బిజెపియే రంగంలోకి దించిందన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఓట్లను చీల్చడానికి అతీక్ అహ్మద్‌ను రంగంలోకి దించారని ఆరోపణలున్నాయి. అనుకున్నట్లే అతీఖ్ అహ్మద్ కొన్ని ఓట్లను చీల్చాడు. దాదాపు 6 శాతం ఓట్లు ఆయనకు పడ్డాయి. అతీక్ అహ్మద్ చీల్చిన ఓట్లన్నీ కాంగ్రెసు ఓట్లుగానే కనబడుతుంది. ఈసారి కాంగ్రెసుకు చెందిన మనీష్ మిశ్ర కేవలం 19,334 ఓట్లు మాత్రమే సాధించాడు. అంటే కాంగ్రెసు ఓట్లు కూడా ఐక్యసంఘటనకు తరలిపోయాయని చెప్పవచ్చు. కాంగ్రెసుకు డిపాజిట్ కూడా దక్కలేదు. బహుజన సమాజ్ పార్టీ మద్దతున్న సమాజవాది పార్టీ అభ్యర్థి నాగేంద్ర ప్రతాప్ సింగ్ 59,613 ఓట్ల ఆధిక్యంతో ఈసారి విజయం సాధించాడు. ఆయనకు 342796 ఓట్లు పడ్డాయి. బిజెపి అభ్యర్థి 2,83,183 ఓట్లు పడ్డాయి.

ఉత్తరప్రదేశ్‌లో సమాజవాది, బహుజనసమాజ్ పార్టీలు కలిస్తే బిజెపి గెలిచే అవకాశాలు ఉండవు. ఈ వాస్తవం గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ బయటపడింది.

మరోవైపు సమాజవాది పార్టీకి 1,89,23,689 ఓట్లు వచ్చాయి. అంటే 21.8 శాతం ఓట్లు. బహుజన సమాజ్ పార్టీకి 1,92,81,352 ఓట్లు వచ్చాయి. అంటే 22.2 శాతం ఓట్లు. అఖిలేష్, మాయావతి ఇద్దరి పార్టీలకు పోలైన మొత్తం ఓట్లను కలుపుకుంటే 3,82,05,041 ఓట్లు, అంటే బిజెపి పొందిన 3.44 కోట్ల ఓట్ల కన్నా చాలా ఎక్కువే. దీనికి కాంగ్రెసు సాధించిన 6.2 శాతం ఓట్లను కూడా కలుపుకుంటే దాదాపు కోటి ఓట్ల తేడా ఉంటుంది. అంటే సమాజవాది, బహుజనసమాజ్, కాంగ్రెసు పార్టీలకు పోలయిన మొత్తం ఓట్లు బిజెపి పోలయిన ఓట్ల కన్నా దాదాపు కోటి ఎక్కువ. దాదాపు 50.2 శాతం.

గోరఖ్ పూర్, ఫూల్ పూర్ వంటి నియోజకవర్గాల్లో, దాదాపు మూడు లక్షల మార్జిన్ తో గెలుపొందిన నియోజకవర్గాల్లో కూడా బిజెపి ఓడిపోయింది. సమాజవాది, బహుజనసమాజ్ పార్టీల ఐక్యసంఘటన బిజెపి ఓట్లను కూడా చీల్చగలిగింది. ఈ ఐక్యసంఘటన ఇలాగే కొనసాగితే 2019లో ఫలితాలు ఎలా ఉంటాయన్నది ఆలోచించవచ్చు.

ఈ ఉప ఎన్నికలు కాంగ్రెసుకు గుణపాఠం కావాలి. త్రిపుర ఎన్నికల్లో బిజెపి గెలవడానికి ముఖ్యమైన కారణం అక్కడ కాంగ్రెసు ఓటర్లు ఇప్పుడు బిజెపి ఓటర్లుగా మారిపోవడమే. వామపక్షాల ఓటింగ్ షేర్ అక్కడ తగ్గలేదు. బీహారులో మహాసంఘటన్ లో చేరిన కాంగ్రెసు నితీష్ కుమార్ తర్వాత రంగు మార్చడంతో ఖంగుతింది. ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెసు స్వంతంగా రంగంలోకి దిగింది, కాని డిపాజిట్లు కూడా దక్కలేదు. ఇప్పుడు కాంగ్రెసు తేల్చుకోవలసిందేమిటంటే, సమాజవాది, బహుజనసమాజ్ వంటి పార్టీల కూటమిలో చేరడం ద్వారా మోడీ రాజకీయాలను అడ్డుకోవడమా లేక స్వంతంగా బలం పెంచుకోడానికి త్రిముఖ పోటీనివ్వడమా. కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెసు రంగం లో ఉండి త్రిముఖ పోటీ ఇస్తే బిజెపికి లాభించే అవకాశాలున్నాయి.

ఈ ఉప ఎన్నికల ఫలితాల నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఇటీవల చెప్పిన మూడో ప్రత్యామ్నాయం కూడా ప్రస్తావించదగింది. కాని కేవలం ప్రాంతీయపార్టీలను మాత్రమే కలుపుకునే ఫెడరల్ ఫ్రంటు ద్వారా బిజెపిని నిలవరించడం సాధ్యమా? చాలా రాష్ట్రాల్లో కాంగ్రెసు బలాన్ని తక్కువ అంచనా వేయలేము. కాంగ్రెసు కూడా రంగంలో ఉంటే త్రిముఖ పోటీలో బిజెపికే లాభం అన్నది ఓటింగ్ సరళిని పరిశీలిస్తే అర్థమవుతుంది. కాబట్టి కాంగ్రెసును కూడా కలుపుకుపోయే బీహారు మాదిరి మహాఘటబంధన్ కోసం ప్రయత్నించవలసిన అవసరం ఉంది. భారత రాజకీయాలు మరోసారి 1989 తర్వాతి దశలోకి ప్రవేశిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. రానున్న కాలం సంకీర్ణ రాజకీయాలదే కావచ్చు.

✻ దబ్ల్యుఎ

ఎడిటర్‌కు లేఖలు

పరోక్ష కారుణ్య హత్యలపై సుప్రీం తీర్పు మంచిదే..!!

మనిషి ఎలాంటి అసమానతలు లేకుండా జీవించడానికి అందరూ సమానమే అనే స్ఫూర్తితో రాజ్యాంగం ద్వారా మనకు హక్కులు కల్పించి వాటిని ఎవరైనా ఉల్లంఘన చేస్తే తగిన శిక్షలు విధిస్తున్నారు. అలాగే నేడు అత్యున్నత న్యాయస్థానం పరోక్ష కారుణ్య హత్యలపై ఇచ్చిన తీర్పు ఆహ్వానించదగినది. మనిషి ఎంత గౌరవంగా బతుకుతాడో అంతే గౌరవంగా తన మరణం కూడా ఉండాలని అనుకోవడంలో తప్పు లేదు. దానిని గ్రహించిన సుప్రీం ఇచ్చిన తీర్పు సరైనదే కాని చట్టం చేసేటప్పుడు మాత్రం కఠినమైన విధివిధానాలు ఉండాలి. లేకపోతే దుర్మార్గులు అమాయకులను చంపే మార్గాలలో ఇది కూడా ఒకటిగా ఉండిపోయే ప్రమాదం ఉంది. మన శరీరానికి నయం కాని జబ్బు వచ్చి ఇంకా మనం అందులో నుండి కోలుకోవడం జరగదు అని తెలిసి చలనం లేని శరీరంతో బతకడం కన్నా మరణం కోరుకోవడంలో తప్పు లేదు. అది ఆ వ్యక్తి సొంత నిర్ణయం అయితే అంగీకరించవచ్చు కాని కుటుంబం ఆస్తి కోసమో, భారమైనారనో సాకులు చెప్పి ఇలాంటి వాటిని వాడుకునే ప్రమాదం లేకపోలేదు. కావున అత్యున్నత సభ దీనిపై సుదీర్ఘంగా చర్చించి సరైన చట్టం చేయాలి. ఎవరైనా ఈ కారుణ్య హత్యలు సాకు గా తీసుకొని కుటిలమైన పనులు చేస్తే మాత్రం కఠినమైన శిక్షలు అమలు చేయాలి. ఏది ఏమైనా కొన్ని దేశాలలో ఇప్పటికే అమలులో ఉన్న ఈ కారుణ్య హత్యలపై అనుమతి మన దేశంలో కూడా రావడం సబబే కాని వ్యక్తికి తను జీవించే హక్కు ఎంతైతే ఉందొ తన మరణంపై హక్కు కూడా తనకే ఉంటుంది. ఇది కేవలం అనారోగ్యం ఉన్న వారి సొంత నిర్ణయమై ఉండాలి. నిర్జీవంగా బతకడం కన్నా మరణమే శరణం అనే వారి అభిప్రాయాన్ని గౌరవించాలి.

– విరాజిత

నీటికొరతను నివారించాలి

రాష్ట్రంలో ఎండలు దంచి కొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఎండల తీవ్రతకు ప్రజలకు బయటికి రాని పరిస్థితి ఉంది. మార్చి మొదటివారంలోనే ఎండలు ఇంత తీవ్రంగా ఉంటే ఏప్రిల్, మే నెలలో ఎండలు ఎలా తారెత్తిస్తాయో అని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. గ్రామాలలో, పట్టణాలలో చెరువులు, బావులలో నీటి మట్టం తగ్గి ఎండిపోతున్నాయి. పశువులకు నీరు దొరకక అల్లాడిపోతున్నాయి. మహిళలు నీటికోసం బిందెలు పట్టుకుని కిలోమీటర్ల దూరం వెళ్లి నీళ్లు తెచ్చే పరిస్థితి దాపురించింది. గ్రామాలలో బోరింగ్ పంపులలో నీళ్ళు పాతాళానికి చేరాయి. గ్రామాలు, పట్టణాలలో నల్లా నీరు రాని పరిస్థితి ఉంది. ప్రజలు దాహార్తిని తీర్చుకోవడానికి మంచినీటిని కొని త్రాగుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామాలు, పట్టణాలలో నీటి కొరతను నివారించే చర్యలపై దృష్టి పెట్టాలి. గ్రామాలు, పట్టణాలలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి. గ్రామాలలో పశువులకు నీటితొట్టెలు ఏర్పాటు చేసి వాటి దాహార్తిని తీర్చాలి.

– కామిడి సతీష్‌రెడ్డి

ఫ్లోరైడ్ బాధితులకు నెలకు 3000 పింఛన్ ఇవ్వాలి

ఉమ్మడి నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలో ప్రజలను ప్రపంచంలోనే ఎక్కడా లేనటువంటి ఫ్లోరైడ్ మహమ్మారి పట్టి పీడిస్తున్నది. నియోజకవర్గంలో ఎంతోమంది ఫ్లోరైడ్ బారిన పడి చేతులు, కాళ్ళు, వంకర్లుగా, కొందరు పుట్టుకతోనే మరికొందరు ముప్పై ఏండ్లకే జీవచ్ఛవంలా మంచానికే పరిమితమై దీనమైన పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న కుటుంబాలు ఎన్నో.

గత ప్రభుత్వాలు ఫ్లోరైడ్ బాధితులను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటిఇంటికీ మంచినీళ్లు ఇచ్చి ఒక గొప్ప ప్రయత్నం చేస్తుంది. ఈ మునుగోడు నియోజకవర్గానికీ ఇంటిఇంటికీ మంచినీళ్లు అందితే ఫ్లోరైడ్ సమస్య అంతమైపోతుందని ఇక ముందు ఫ్లోరైడ్ బాధితులు ఉండరనీ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మునుగోడు నియోజకవర్గ ఫ్లోరైడ్ బాధితుల ఆరోగ్యానికీ, ఆర్థిక కుటుంబ సమస్యలను పరిశీలించుకునేందుకు అర్హులైన వారికీ బ్యాంక్ సహాయం లేకుండా ప్రభుత్వం స్వయం ఉపాధిలో రాణించే విధంగా రుణాలు మంజూరు చేయాలి. అదేవిధంగా ఫ్లోరైడ్ బాధితులకు నెలకు రు.3000/– ఆసరా పింఛన్ ఇచ్చి కుటుంబాలను ఆదుకోవాలి.

– గుండమల్ల సతీష్‌కుమార్

అలంకారానికే ఎటిఎంలు

పెద్దనోట్ల రద్దు తర్వాత ఎటిఎంల వద్ద రద్దీ తిరుపతిలో దైవదర్శనం కోసం కట్టిన క్యూని తలపించింది. క్రమ క్రమంగా ఆ కష్టాలు తొలగిపోయాయనుకున్నాము. ఎటిఎం ల వద్ద తిప్పలు షరా మామూలైనాయి. బ్యాంకులలో నగదు లేక ఎటిఎంలలో డబ్బులు ఉండటం లేదు. అత్యవసర పరిస్థితి ఏర్పడి డబ్బులు డ్రా చేయాలంటే, ఏ ఎటిఎం చూసినా 'నో క్యాష్'. తిరిగి తిరిగి బైకులు, కార్లలో ఇంధనం వృధా. సమయం వృధా. ఇక సామాన్యులు, నిరుపేదల తిప్పలు ఇన్నీ, అన్నీకావు. డబ్బులే వేయనప్పుడు ఇన్ని ఎటిఎంలు ఎందుకు? పనిచేయని ఎటిఎంలను తొలగించండి. లేదా ఎటిఎంల వద్ద నిత్యండబ్బులు నిల్వ ఉండేలా చేసి సామాన్యుల కష్టాలను తొలగించండి.

– సరికొండ శ్రీనివాసరాజు



జీవితంలో పాఠశాల దశ చాలా ముఖ్యమైంది. భవిష్యత్తుకు పునాది పడేది ఇక్కడి నుంచే. స్కూలు అంటే కేవలం పాఠాలు బట్టీ కొట్టడం, పరీక్షలు రాసి మంచి మార్కులు సంపాదించడమే కాదు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలు వంటి ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌కు ప్రాధాన్యం ఇచ్చేది కేవలం కేంద్రీయ విద్యాలయాలే. ఇక్కడ విద్యార్థులకు విలువైన నైపుణ్యాలు అలవడతాయి. ప్రస్తుతం పట్టణం, పల్లె అనే తేడా లేకుండా కార్పొరేట్ సంస్కృతి విస్తరిస్తోంది. అయినప్పటికీ కేవీ (కేంద్రీయ విద్యాలయాలు) తమ ప్రాధాన్యాన్ని కోల్పోకుండా, విద్యార్థి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దే నిలయాలుగా అందరి ప్రశంసలు పొందుతున్నాయి. కేంద్రీయ విద్యాలయాల్లో 2018-19 సంవత్సరానికి ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడింది. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయాల గురించి తెలుసుకుందాం....

బంగారు భవితకు నిలయాలు
కేంద్రీయ విద్యాలయాలు



కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కేంద్రీయ విద్యాలయాలు (కేవీ) పనిచేస్తాయి. అధునాతన సాంకేతిక విద్యను అందించడంలో ఇవి ముందంజలో ఉంటున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తరచుగా బదిలీలు జరుగుతుంటాయి. అలాంటప్పుడు ఉద్యోగుల పిల్లల చదువులకు ఇబ్బంది కలుగకుండా ఉండటం కోసం కేంద్రప్రభుత్వం కేంద్రీయ విద్యాలయ వ్యవస్థను 1963లో ప్రారంభించింది. అంతకుముందు వీటిని సెంట్రల్ స్కూల్స్‌గా పిలిచేవారు. కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా ప్రాధాన్యక్రమాన్ని అనుసరించి మిగతా కుటుంబాలకు చెందిన పిల్లలకు కూడా ప్రవేశం కల్పించడం మొదలైంది. ప్రస్తుతం దేశంలో 1136 కేవీ పాఠశాలలున్నాయి. వీటిల్లో 12,57,099 మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలుస్తోంది.

తల్లిదండ్రుల ఆలోచనా సరళిలో మార్పు వచ్చింది. విద్యతోపాటు క్రీడలు వంటి ఇతర వ్యాపకాలకు ప్రాధాన్యం ఇస్తున్న కేంద్రీయ విద్యాలయాలవైపు అందరి దృష్టి మరలింది. దీంతో కేవీలో ప్రవేశాల కోసం పోటీ పెరిగింది. 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం మార్చి 1 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే ప్రక్రియ మొదలైంది. ఒకటి కంటే ఎక్కువ విద్యాలయాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా ఇందులో ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో 68 కేంద్రీయ విద్యాలయాలున్నాయి. అవి అదిలాబాద్, అనంతపురం, భీమునిపట్నం (ఐఎన్ఎస్ కళింగ), బోధన్, ఏలూరు, గుంతకల్, గుత్తి, గుంటూరు, కడప, కాకినాడ, కరీంనగర్, ఖమ్మం, కర్నూలు, జారసంగం (మెదక్ జిల్లా), మచిలీపట్నం, మిర్యాలగూడ, నెల్లూరు, నల్లగొండ, తిరుపతి 1,2, విజయవాడ 1,2, ఎన్‌టీపీసీ రామగుండం, ఓఎన్‌జీసీ రాజమండ్రి, ఒంగోలు, రాజంపేట, సిరిసిల్ల, శ్రీకాకుళం, సూర్యలంక (బాపట్ల), తెనాలి, మహబూబ్‌నగర్, వాల్తేర్, విశాఖపట్నం, ఎన్ఏడీ, విశాఖపట్నం మల్కాపురం, విశాఖపట్నం నెం.1 నౌసేనాబాగ్, విశాఖపట్నం నెం.2 నౌసేనాబాగ్, విశాఖపట్నం నెం.1 శ్రీవిజయ్‌నగర్, విశాఖపట్నం నెం.2 శ్రీవిజయ్‌నగర్, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, వరంగల్, మహబూబాబాద్, భువనగిరి, రాజంపల్లి, సత్తెనపల్లి , వెంకటగిరి.

హైదరాబాద్‌లో..ఎఫ్ఎస్ బేగంపేట్, హకీంపేట, బొల్లారం, బోయిన్‌పల్లి, సీఆర్‌పీఎఫ్, గచ్చిబౌలి, కంచన్‌బాగ్, ఎన్ఎఫ్‌సీ నగర్ షట్కేసర్, 1,2 ఏఎఫ్ఏ , గోల్కొండ 1,2, ఉప్పల్ 1,2, శివరాంపల్లి, ఎద్దుమైలారం మెదక్ జిల్లా, పికెట్ , తిరుమలగిరి.

సీబీఎస్ఈ సిలబస్

కేవీల్లో దేశ వ్యాప్తంగా ఒకే రకమైన పాఠ్యప్రణాళిక అమల్లో ఉంటుంది. హిందీ, ఇంగ్లీషు భాషల్లో బోధిస్తారు. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు తరగతులు ఉంటాయి. సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్)కి అనుబంధంగా పనిచేస్తాయి.

రెండో తరగతి, అంతకంటే పైతరగతుల్లో ఆయా విద్యాలయాల్లో ఉన్న ఖాళీల మేరకే ప్రవేశాలను కల్పిస్తారు. పదో తరగతిలో ప్రవేశం పొందాలంటే 9 వ తరగతిలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. 11వ తరగతి లో దరఖాస్తులను 10 వ తరగతి ఫలితాల తర్వాత అందుబాటులో ఉంచుతారు. 11 వ తరగతిలో కూడా ఆయా విద్యాలయాల్లోని ఖాళీల ప్రకారమే అడ్మిషన్లు కల్పిస్తారు. 12 వ తరగతిలో ప్రవేశానికి 11వ తరగతిలో 55 శాతం మార్కులు సాధించాలి.

ఎలా దరఖాస్తు చేసుకోవాలంటే...

ముందుగా ఆసక్తి ఉన్న కేవీలను ఎంచుకోవాలి. kvadmissiononline2018.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సమర్పించిన తర్వాత యునిక్ అప్లికేషన్ నెంబర్ వస్తుంది. ఇదే పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నెంబర్‌గా ఉపయోగపడుతుంది. ప్రవేశాలకు సంబంధించిన అన్ని రకాల వివరాలను తెలుసుకోవడానికి ఈ నెంబర్ ఆధారంగా ఉంటుంది. అందుకనే దీన్ని జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. అప్లికేషన్‌లో ఏమైనా పొరపాట్లు ఉన్నట్లయితే గడువు తేదీలోపు ఎడిట్ ఆప్షన్ ద్వారా ఎన్నిసార్లయినా సరిచేసుకోవచ్చు. వెబ్‌సైటులోని అప్లికేషన్ స్టేటస్ లింక్ లేదా దరఖాస్తు చేసుకున్న పాఠశాల నోటీస్ బోర్డ్ ద్వారా అడ్మిషన్ ఖరారుకు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చు. దరఖాస్తు చేసుకున్న అందరికీ ప్రవేశాలు కల్పించరు. కేవీఎస్ నిబంధనల ప్రకారం ప్రాధాన్యక్రమాన్ని అనుసరిస్తారు. దాని ప్రకారం సీట్లను కేటాయిస్తారు. ప్రాధాన్యక్రమం ఈ విధంగా ఉంటుంది.

కేటగిరీ 1 కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు
కేటగిరీ 2 కేంద్రప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పిల్లలు
కేటగిరీ 3 రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు
కేటగిరీ 4 రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పిల్లలు
కేటగిరీ 5 ప్రైవేట్ ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్నవారు , తదితర వర్గాల పిల్లలు
ఒకే సంతానం (అమ్మాయి) కలిగిన కుటుంబాల్లోని వారికి ప్రాధాన్యం
పార్లమెంట్ సభ్యులు , కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఉన్నతాధికారులు సిఫార్సు చేసిన విద్యార్థులకు ప్రవేశాల్లో ప్రాధాన్యం.

ప్రవేశాలు ఎలాగంటే... ఒకటి నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలు ప్రాధాన్యతాక్రమం ఆధారంగా చేపడతారు. ఎక్కువగా సీట్లు ఖాళీ ఉండి వెయిటింగ్‌లో విద్యార్థులుంటే లాటరీ పద్ధతిలో అర్హుల ఎంపికను చివరిదశలో నిర్వహిస్తారు.


రెండు నుంచి ఎనిమిదో తరగతి వరకు ప్రాధాన్యక్రమం ఆధారంగా ఎడ్మిషన్లు చేపడతారు. ఖాళీల కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే లాటరీ ద్వారా ప్రవేశాలను ఖరారు చేస్తారు.

తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి పరీక్ష ఉంటుంది. మూడు గంటల వ్యవధిలో వంద మార్కులకు పరీక్ష రాయాలి. హిందీ, ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్‌స్టడీస్ పాఠ్యాంశాల్లో పరీక్ష ఉంటుంది. ఇందులో ప్రతి సబ్జెక్ట్ నుంచి 20 మార్కులు కేటాయిస్తారు. ఈ పరీక్షలో కనీసం 33 మార్కులు సాధిస్తేనే అర్హులుగా పరిగణిస్తారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 25 మార్కులు సాధిస్తే చాలు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం అంటే 11వ తరగతిలో ప్రవేశాలు పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటాయి. 11 వ తరగతిలో సైన్స్, కామర్స్, హ్యుమానిటీస్ గ్రూపులుంటాయి. ఇందులో సైన్స్ స్ట్రీమ్‌లో ప్రవేశానికి పదో తరగతిలో 60శాతం మార్కులు , కామర్స్ స్ట్రీమ్ కోసం 50శాతం మార్కులు , హ్యుమానిటీస్ కోసం కనీస ఉత్తీర్ణత ఉండాలి. ఈ నిబంధన కేంద్రీయ, కేంద్రీయేతర విద్యార్థులకు వేర్వేరుగా ఉంటాయి. ఖాళీలతోపాటు అదనపు సీట్ల భర్తీని జూలై 31తేదీలోపు చేపడతారు.

దరఖాస్తు గడువు : ఒకటో తరగతిలో ప్రవేశాలకు మార్చి 1 నుంచి 19వ తేదీ వరకు. మిగిలిన తరగతులకు రెండో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం వరకు ఏప్రిల్ 2 నుంచి 9 వరకు.

వయసు నిర్ధారణ: ఒకటో తరగతిలో ప్రవేశానికి మార్చి 31వ తేదీ నాటికి ఐదేళ్లు నిండి ఉండాలి. ఏడేళ్లలోపు వారికే ప్రవేశం ఉంటుంది. రెండో తరగతికి ఆరేళ్లు. మూడో తరగతికి ఏడేళ్లు. నాలుగో తరగతికి ఎనిమిదేళ్లు, ఐదుకి తొమ్మిదేళ్లు, ఆరో తరగతికి పదేళ్లు, ఏడుకి 11ఏళ్లు, ఎనిమిదికి 12 ఏళ్లు, తొమ్మిదికి 13ఏళ్లు, పదో తరగతికి 14 ఏళ్లు నిండి ఉండాలి.

ఆస్కార్ అవార్డ్స్ 2018



ఉత్తమ చిత్రం – ది షేప్ ఆఫ్ వాటర్
ఉత్తమ నటుడు – గ్యారీ ఓల్డ్‌న్ (డార్కెస్ట్ అవర్)
ఉత్తమ నటి – ఫ్రాన్సెస్ మెక్‌డోర్మాండ్ (త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సౌడ్ ఎబ్బింగ్, మిస్సోరి)
ఉత్తమ దర్శకత్వం – గుల్లెర్మో డెల్ టోరో (ది షేప్ ఆఫ్ వాటర్)
ఉత్తమ సహాయ నటుడు – సామ్ రాక్‌వెల్ (త్రీ బిల్‌బోర్డ్స్ అవుట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి)
ఉత్తమ సహాయ నటి – అల్లిసన్ జన్నె (ఐ, టోన్యా)
ఉత్తమ లఘుచిత్రం (యానిమేటెడ్) – డియర్ బాస్కెట్‌బాల్
ఉత్తమ చిత్రం (యానిమేటెడ్) – కోకో
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ – బ్లేడ్ రన్నర్ 2049
ఉత్తమ ఫిల్మ్ ఎడిటింగ్ – లీ స్మిత్ (డన్‌కిర్క్)
ఉత్తమ ఒరిజినల్ స్కోర్ – అలెగ్జాండర్ డెస్ప్లాట్ (ది షేప్ ఆఫ్ వాటర్)
ఉత్తమ ఒరిజినల్ సాంగ్ – రిమెంబర్ మి: కోకో (సంగీతం: క్రిస్టెన్ అండెర్సన్, రచన: రాబర్ట్ లోపెజ్)
ఉత్తమ డాక్యుమెంటరీ (షార్ట్ సబ్జెక్ట్) – హెవెన్ ఈజ్ ఎ ట్రాఫిక్ జామ్ ఆన్ ద 405
ఉత్తమ లఘుచిత్రం (లైవ్ యాక్షన్) – ది సైలెంట్ చైల్
ఉత్తమ విదేశీ చిత్రం – ఎ ఫెంటాస్టిక్ ఉమన్ (చిలీ)
ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే – జేమ్స్ ఐవరీ (కాల్ మి బై యువర్ నేమ్)
ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే – జోర్డాన్ పీలే (గెట్ ఔట్)
ఉత్తమ ఛాయాగ్రహణం – రోజర్ ఎ. డీకిన్స్ (బ్లేడ్ రన్నర్ 2049)
ఉత్తమ మేకప్, హెయిర్ స్టైలింగ్ – డార్కెస్ట్ అవర్
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ – మార్క్ బ్రిడ్జెస్ (ఫాంటమ్ త్రెడ్)
ఉత్తమ డాక్యుమెంటరీ (ఫీచర్) – ఐకారస్
ఉత్తమ సౌండ్ ఎడిటింగ్ – డన్‌కిర్క్
ఉత్తమ సౌండ్ మిక్సింగ్ – డన్‌కిర్క్
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ – ది షేప్ ఆఫ్ వాటర్

జీకే – కరెంట్ అఫైర్స్

అణు సామర్థ్యం గల పృథ్వీ క్షిపణి విజయవంత ప్రయోగం: ఇటీవల భారత దేశం ఏ అణు సామర్థ్యం గల క్షిపణిని విజయవంతంగా ప్రయోగించింది?
పృథ్వీ–II క్షిపణి.
పృథ్వీII క్షిపణిని ఇటీవల ఎక్కడి నుంచి విజయవంతంగా పరిక్షించారు?
ఒడిస్సాలోని చాందిపూర్.
పృథ్వీII మిస్సైల్ ఏ రకానికి చెందినది?
ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే బాలిస్టిక్ మిస్సైల్.
పృథ్వీ మిస్సైల్‌ను అభివృద్ధి చేసింది ఎవరు?
డి.ఆర్.డి.ఓ అనగా (డిఫెన్సు రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)
ఏ కార్యక్రమంలో భాగంగా డి.ఆర్.డి.ఓ పృథ్వీ క్షిపణులను అభివృద్ధి పరిచింది?
ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(IGMDP)
ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(IGMDP)లో భాగంగా డి.ఆర్.డి.ఓ అభివృద్ధి చేసిన మొట్టమొదటి మిస్సైల్ ఏది? **పృథ్వీ.**
పృథ్వీII మిస్సైల్ ను భారత సైన్యానికి ఎప్పుడు అందించారు? **2003**

పృథ్వీ పరిధులు:

పృథ్వీ I	150 కిలోమీటర్లు
పృథ్వీ II	250 350 కిలోమీటర్లు
పృథ్వీ III	350 600 కిలోమీటర్లు.

మహామస్తకాభిషేకాలు ప్రారంభం

ఇటీవల ప్రపంచ ప్రసిద్ధిచెందిన మహామస్తకాభిషేక కార్యక్రమం ఎక్కడ ప్రారంభం అయినది?
కర్నాటకలోని శ్రావణబెలగొళలో.
ఈ కార్యక్రమాన్ని ఎవరు ప్రారంభించారు?
రాష్ట్రపతి రామనాథ్ కోవింద్
మహామస్తాకాభిషేక కార్యక్రమం కర్నాటకని శ్రావణ బెలగొళలో ఎన్ని సంవత్సరాలకు ఒక్కసారి నిర్వహిస్తారు?
12 సంవత్సరాలకు ఒక్కసారి
కర్నాటకలోని శ్రావణబెలగొళలో 2018లో నిర్వహించిన మహా మస్తకాభిషేక కార్యక్రమం ఇప్పటి వరకు ఎన్నిసార్లు జరిగింది?
88వ మహామస్తకాభిషేకం
ఈ కార్యక్రమంలో ఎవరు అభిషేక కార్యక్రమాలు అందుకుంటారు?
బాహుబలి గోమటేశ్వరుడు
కార్యక్రమం ఏ వర్గానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక కార్యక్రమం? **జైనులు**
బాహుబలి గోమటేశ్వరుని విగ్రహాన్ని ఎవరు ప్రతిష్టించారు?
గంగవంశ రాజుల వద్ద పనిచేసే మంత్రి, సైన్యాధ్యక్షుడు చావుండరాయ
బాహుబలి గోమటేశ్వరుని విగ్రహాన్ని ఎప్పుడు ప్రతిష్టించారు? **క్రీ,శ. 981**

ఇంటర్నేషనల్ ఇంటెలెక్చ్యువల్ ప్రాపర్టీ ఇండెక్స్ – 2018

ఇటీవల విడుదలైన ఇంటర్నేషనల్ ఇంటెలెక్చ్యువల్ ప్రాపర్టీ ఇండెక్స్ 2018 లో ప్రపంచంలోని 50 ఆర్థిక వ్యవస్థలో భారతదేశం ఎన్నవ స్థానంలో నిలిచింది?
44వ స్థానం
ఇంటర్నేషనల్ ఇంటెలెక్చ్యువల్ ప్రాపర్టీ ఇండెక్స్‌ను ఎవరు రూపొందిస్తారు?
యుఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్
ఇంటర్నేషనల్ ఇంటెలెక్చ్యువల్ ప్రాపర్టీ ఇండెక్స్ 2018 లో ప్రపంచం లోని 50 ఆర్థిక వ్యవస్థలో మొదటి స్థానంలో ఏ దేశం నిలిచింది? **–అమెరికా.**

గూగుల్ కు అపరాధ రుసుం విధించిన సిసిఐ

ఆమోదం కాని వ్యాపార కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు ఏ ప్రముఖ సంస్థ కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (CCI) అపరాధ రుసుము విధించింది? **–గూగుల్**
ఎంత అపరాధ రుసుము విధించింది? **–136 కోట్ల రూపాయలు**



వినియోగదారుల హక్కులకు భంగం కలగకుండా, వివిధ పరిశ్రమల చర్యలు వాణిజ్య స్వేచ్ఛకు విఘాతం కలిగించకుండా పర్యవేక్షించుటకు, కాంపిటీషన్ చట్టం 2002 ప్రకారం ఏర్పాటు చేయబడిన క్వాజీ జుడిషియల్ సంస్థ ఏది?
కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (CCI)
కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (CCI) ఎప్పుడు ఏర్పాటు చేయబడింది?
2003 అక్టోబర్.

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

జాతీయ నులిపురుగుల దినోత్సవం ఎప్పుడు నిర్వహించారు? **ఫిబ్రవరి 10**
ఈ కార్యక్రమాన్ని ఎవరు ప్రారంభించారు?
–కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ
ఇది ఏ వయస్సు మధ్య ఉన్న పిల్లలకు ఉద్దేశించినది? **1 – 19 సంవత్సరాలు.**
జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం ఎంతమందిని లక్ష్యంగా పెట్టుకున్నది? **–32.2 కోట్ల మంది.**
మొదటి జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం మొదటిసారిగా ఎప్పుడు ప్రారంభించారు? **–2015.**
2018లో నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం ఎన్నవది? **–నాలుగవది.**
ఈ కార్యక్రమంలో భాగంగా ఏఏ తేదీలలో 1 , 19 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలకు నులి పురుగుల నివారణ చేపడతారు? **ఫిబ్రవరి 10, ఆగస్ట్ 10 (సంవత్సరంలో రెండు సార్లు).**
నులిపురుగుల నివారణకు ఏ మందును పిల్లలకు అందిస్తారు? **–ఆల్బెండజోల్.**
నులిపురుగుల నివారణకు వాడే ఆల్బెండజోల్.
1, 2 సంవత్సరాల మధ్య వయస్సు వారికి సగం టాబ్లెట్
2 , 19 సంవత్సరాల మధ్య వయస్సు వారికి పూర్తి టాబ్లెట్
జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం వ్యాధి నివారణకు ఉద్దేశించిన కార్యక్రమం? **మృత్తిక ద్వారా వ్యాప్తి చెందే హెల్మింత్ పరాన్న జీవుల నివారణకు(Soil Transmitted Helminths).**

మణిపూర్ హైకోర్ట్ మొట్టమొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తి

మణిపూర్ హైకోర్ట్ మొట్టమొదటి ప్రధాన న్యాయమూర్తి గా ఎవరు నియమితులయ్యారు**–అభిలాషాకుమారి**
ఇప్పటికి మణిపూర్ హైకోర్ట్‌కి ఎన్నవ పూర్తి కాల ప్రధానన్యాయమూర్తి?
మూడవ.
అభిలాషా కుమారి చేత ఎవరు ప్రమాణ స్వీకారం చేయించారు? –
మణిపూర్ గవర్నర్
మణిపూర్ ప్రస్తుత గవర్నర్ ఎవరు? **–నజ్మా హెప్తుల్లా**
మణిపూర్ హైకోర్ట్ ఎక్కడ ఉన్నది? **మణిపూర్ రాజధాని ఇంఫాల్.**
ఇంఫాల్ లో మణిపూర్ హైకోర్ట్ ఎప్పుడు ఏర్పాటు చేశారు?
2013 మార్చి
మణిపూర్ హైకోర్ట్ మొదటి ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
–అభయ్ మనోహర్ సప్రే.
మణిపూర్ హైకోర్ట్ ఏర్పడక ముందు మణిపూర్ హైకోర్ట్ బెంచ్ ఎక్కడ ఉండేది?
–అస్సాం రాజధాని గౌహతిలో.

అభిలాషా కుమారి గురించి...
మణిపూర్ మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తి
హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ కుమార్తె
హిమాచల్ ప్రదేశ్ యునివర్సిటీలో న్యాయవాద డిగ్రీ పొందారు
గుజరాత్ హైకోర్ట్‌లో న్యాయమూర్తిగా పనిచేసారు.
ఈమె హిమాచల్‌ప్రదేశ్‌కు చెందినది.


యుఎఇ జకుమ్ చమురు క్షేత్రంలో వాటా పొందిన ఓఎన్‌జీసీ

యుఎఈ ఏ చమురు క్షేత్రంలో ఇటీవల ఓఎన్‌జీసీ వాటాను కొనుగోలు చేసింది? **–జకుమ్ చమురు క్షేత్రం.**
జకుమ్ చమురు క్షేత్రంలో ఎంత వాటా ను ఇటీవల 600 మిలియన్ డాలర్ల కు ఓఎన్‌జీసీ కొనుగోలు చేసింది? **–10%.**



ఏ సందర్భం లో జకుమ్ చమురు క్షేత్రం ను ఓఎన్‌జీసీ కొనుగోలు చేసింది? **–ప్రధాని నరేంద్ర మోడీ యుఎఇ పర్యటన సందర్భంగా...**
జకుమ్ చమురు క్షేత్రం కొనుగోలు ఒప్పందం జరిగిన సందర్భంలో పాల్గొన్న యుఏఈ యువరాజు ఎవరు?
–షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్.
జకుమ్ చమురు క్షేత్రంను ఎవరు అభివృద్ధి పరిచారు?
అబూ దాబి నేషనల్ ఆయిల్ కంపెనీ
జకుమ్ చమురు క్షేత్రంలో మొత్తం ఉన్న చమురు నిల్వలు ఎంత అని అంచనా?
–17.2 బిలియన్ బారేల్స్.
జకుమ్ చమురు క్షేత్రం లో రోజుకు ఉత్పత్తి అవుతున్న చమురు ఉత్పత్తి ఎంత?
–4,25,000 బారేల్స్ .

అధికారిక నివాసాలు



దేశాధ్యక్షులు/ప్రధానులు	అధికారిక నివాసం పేరు
భారత రాష్ట్రపతి	రాష్ట్రపతి భవన్ –ఢిల్లీ
భారత ప్రధాని	రేస్ కోర్స్ రోడ్
నేపాల్ అధ్యక్షుడు	శీతల్ నివాస్
బంగ్లాదేశ్ అధ్యక్షుడు	గణ భవన్
పాకిస్థాన్ అధ్యక్షుడు	ఐవన్–ఎ–సదార్
అమెరికా అధ్యక్షుడు	వైట్ హౌస్–వాషింగ్టన్
రష్యా అధ్యక్షుడు	క్రెమ్లిన్
బ్రిటన్ రాణి	బకింగ్ హోం ప్యాలెస్–లండన్
బ్రిటన్ ప్రధాని	10,డౌనింగ్ స్ట్రీట్
దక్షిణ కొరియా అధ్యక్షుడు	బ్లూహౌస్
సింగపూర్ అధ్యక్షుడు	ఇస్తానా
మెక్సికో అధ్యక్షుడు	లోస్పినోస్
జర్మనీ అధ్యక్షుడు	సెషల్స్ బెల్లీవ్
ఒమన్ సుల్తాన్	అల్ అలాం ప్యాలెస్
ఐర్లాండ్ అధ్యక్షుడు	అరాసన్ వాబ్ తెరైన్
జపాన్ రాజు	అకసాకా ప్యాలెస్
ఫ్రాన్స్ అధ్యక్షుడు	ఎలిసిప్యాలెస్–ప్యారిస్
ఇటలీ అధ్యక్షుడు	మోన్ క్లియో క్విరినల్ ప్యాలెస్
కెనడా ప్రధాని	24, ససెక్స్ డ్రైవ్–మాంట్రియల్

ఇది ఎన్నికల బడ్జెట్

మన తెలంగాణ / హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల బడ్జెట్ అని బిజేపి ఎంఎల్‌సి రాచందర్‌రావు అభివర్ణించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వివిధ శాఖలకు భారీగా కేటాయింపులు చేశారని, మరికొన్ని శాఖలకు కేటాయించిన నిధులు అందులో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది జీతభత్యాలకే సరిపడేలా లేవని ఆరోపించారు. భారీ కేటాయింపులు కేవలం బడ్జెట్‌కే పరిమితమవుతున్నాయని మండిపడ్డారు. గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులను ఖర్చు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఈసారీ కేటాయింపులు కూడా పూర్తిస్థాయిలో ఖర్చయేలా లేవనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పట్టణాభివృద్ధికి అరకొరగా నిధులను కేటాయించిన ప్రభుత్వం హైదరాబాద్ మహానగరాభివృద్ధి ప్రస్తావన లేదన్నారు. కేవలం ఏడు వేల కోట్లను మాత్రమే కేటాయించారని తెలిపారు. ఈ ఏడాది వరకు 2.75 లక్షల డుబల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని నిర్దేశించుకున్న సర్కార్ ఆ మేరకు నిధులను కేటాయించలేదన్నారు. ఇప్పటి వరకు కేవలం 9 వేల ఇంట్లను మాత్రమే పూర్తి చేశారని ఆరోపించారు. సంక్షేమం, విద్యారంగానికి కేటాయించిన నిధులు కేవలం వారి జీతభత్యాలకే పరిమతం కానున్నాయన్నారు. నూతన మెడికల్ కాలేజీల ఏర్పాటు ప్రస్తావనే లేదన్నారు.





ఈసీకి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

మనతెలంగాణ/న్యూఢిల్లీ: ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం లేకున్నా తెలంగాణ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. గురువారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ప్రధాన ఎన్నికల అధికారిని కలిసారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ...... రాజ్యాంగ విరుద్ధంగా, చట్ట విరుద్ధంగా తెలంగాణ స్పీకర్ చర్యలు తీసుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘము దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. మరోవైపు తమ శాసన సభ్యులు సభ్యత్వం రద్దు పై న్యాయపరంగా పోరాడుతున్నాము, హైకోర్టు లో పిటిషన్ వేశామని వెల్లడించారు. హైకోర్టు తీర్పు వచ్చేదాకా తెలంగాణ ప్రభుత్వం పంపిన గెజిట్ పై ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరామని తెలిపారు.మేము చెప్పిన విషయాలను కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ సావధానంగా విన్నారు, తప్పకుండా తమకు న్యాయం చేస్తారన్ని అశాభావంతో ఉన్నామని మర్రిశశిధర్ రెడ్డి వెల్లడించారు. ఎంపి నంది ఎల్లయ్య, తెలంగాణ కాంగ్రెస్ నేతలు మర్రిశశిధర్ రెడ్డి, వి. హనుమంతరావు, వినోద్ రెడ్డి, బొల్లి కిషన్ సహా పలువురు నేతలు ఉన్నారు.

రాష్ట్ర బడ్జెట్ అబద్ధాల చిట్టా

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా వాస్తవవిరుద్ధంగా, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, అంకెల గారడితో అబద్ధాల చిట్టా లాగా ఉన్నదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. దూరదృష్టి లేని కెసిఆర్ బడ్జెట్‌గా అభివర్ణించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదాయానికి మించి అంచనాలను చూపిస్తూ కాకి లెక్కలతో ఎన్నికల కోసం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎంత జీవం, సారం ఉన్నదో ఆర్థిక శాఖ మంత్రి ప్రజలకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. అంచనాలు బారెడు, వాస్తవాలు జానెడు అనే తరహాలో ఉన్నదని ఎద్దేవా చేశారు.


ఇది అంకెల గారడీ బడ్జెట్



మన తెలంగాణ/హైదరాబాద్ : టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్ ప్రజల ఆలోచలనకు, ఆశయాలకు అనుగుణంగా లేదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ ప్రాంగణంలోని టిడిఎల్‌పి కార్యాలయంలో ఎంఎల్‌వ సండ్రతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్ ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా అంకెల గారడీ చేశారన్నారు.

మందకృష్ణపై ఆరోపణలు అర్థరహితం : శాసన సభ వేదికగా సిఎం కెసిఆర్ మందక్రిష్ణ మాదిగపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంఎల్‌వ సండ్ర వెంకటవీరయ్య అన్నారు. దేశ చరిత్రలో తొలిసారిగా ఏ రాష్ట్రంలో లేని విధంగా మాల, మాదిగలు క్యాబినెట్‌లో లేకుండా పాలన సాగిస్తున్నారని విమర్శించారు.

పెట్టుబడికి చట్టబద్ధత లేదు



మనతెలంగాణ/హైదరాబాద్: వ్యవసాయ రంగానికి కేటాయింపులు కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేశారని టిడిపి ఎంఎల్ ఎ ఆర్. కృష్ణయ్య అన్నారు. ఎకరా కు రూ. 4 వేలు నాలుగేండ్ల నుంచి ఇవ్వకుండా ఈసారి నుంచి ఇవ్వడంలో అర్థమేమిటని ప్రశ్నించారు. రైతులకు ప్రభుత్వంపై నమ్మకం లేదని, రైతు పెట్టుబడి పథకానికి చట్టబద్ధత కూడా కల్పించలేదన్నారు. ఎన్నికల బడ్జెట్‌లో కొత్తగా ఒక్క పథకం కూడా ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఎంఎల్ఎ సండ్ర వెంకటవీరయ్యతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో ప్రజల మౌలిక అభివృద్ధి ఎక్కడా లేదని, ఆయా సామాజిక వర్గాల సం క్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కూడా లేదన్నారు. పారిశ్రామికరంగాన్ని ప్రైవేట్‌కు ధారాదత్తం చేశారన్నారు. బిసి కార్పొరేషన్ ఏర్పాటు మాటే కాని ఇంతవరకు ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. బిసిలకు బడ్జెట్‌లో రూ. 10 వేల కోట్లు పెట్టాలని డిమాండ్ చేశారు.

అబద్ధాల బడ్జెట్ : షబ్బీర్ అలీ



మన తెలంగాణ/ హైదరాబాద్: ఈటల రాజేందర్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను దగాకోరు బడ్జెట్‌గా కాంగ్రెస్ నేత, శాసనమండలి విపక్ష నేత మహ్మద్ అలీ షబ్బీర్ ఆరోపించారు. ఇది బోగస్, అబద్ధాల బడ్జెట్ అని, వాస్తవాలకు దూరంగా ఉందన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎం కెసిఆర్ కు అబద్ధాలతో పిహెచ్‌డి ఇవ్వాలని, ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టేలా బడ్జెట్ ఉందన్నారు. గత బడ్జెట్‌లో రూ. 1.49 లక్షల కోట్లు కేటాయించి, రూ.1.08 లక్షల కోట్లే ఖర్చు చేశారని, ఈ సారి రూ.1.74 లక్షల కోట్లలో 40 శాతం ఖర్చు చేయరని పేర్కొన్నారు. గతంలో ని మైనార్టీ లకు కేటాయింపులు పేపర్ మీదే తప్ప ఖర్చు చేసింది లేదన్నారు. కమిషన్‌లు వచ్చే చోట బడ్జెట్ ఖర్చు చేశారని చెప్పారు.పాతబస్తీ కి మెట్రో అంటున్న కెసిఆర్ బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు.టిఆర్ఎస్,ఎంఐఎంలు కలిసి మైనార్టీలను మోసం చేస్తున్నారు.

అఘాతంలో నెట్టేసింది: రాష్ట్ర బడ్జెట్ ప్రజలను అఘాతంలోకి నెట్టేసేలా ఉన్నదని, ఇది అశనిపాతం లాంటిదని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. లెక్కల్లో గొప్పలు తప్ప, ఆదాయం, వ్యయం మధ్య పొంతన లేదన్నారు. అరవై ఏళ్లలో ఎవరు చేయని అప్పులు చేయడంలో కేసీఆర్ ప్రగతి సాధించారన్నారు. ప్రభుత్వ దొంగ లెక్కలను సభలో నిలదీస్తాననే తమను సస్పెండ్ చేశారని, చూస్తుంటే డబుల్ బెడ్ ప్రజలకు కలగానే మిగలనుందని పేర్కొన్నారు. అదనంగా సృష్టిస్తామన్న లక్ష ఉద్యోగాలు దేవుడెరుగు, ఖాళీగా ఉన్న లక్ష ఉద్యోగాలనే నాలుగేళ్ళైనా ప్రభుత్వం భర్తీ చేయలేదన్నారు. మాజీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ సభ్యులు సభలో లేకుండా బడ్జెట్ ను ప్రవేశపెట్టడం అత్యంత దారుణమన్నారు. ఎంఎల్‌వ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ తప్పుడు లెక్కలు ,మాయ మాటల బడ్జెట్ తో ప్రజలను మోసం చేశారని, తెలంగాణ సమాజాన్ని మోసం చేసేలా బడ్జెట్ ఉందన్నారు.

కాంగ్రెస్ నేతల దీక్ష విరమణ

- అసెంబ్లీలో నిలదీస్తామన్న భయంతోనే సస్పెండ్ చేశారు
- కోమటిరెడ్డి, సంపత్‌కుమార్ ధ్వజం



మన తెలంగాణ/హైదరాబాద్/ గోషామహల్: కాంగ్రెస్ ఎమ్మెల్యేల సభ్యత్వ రద్దు, సస్పెన్షన్‌లను నిరసిస్తూ గాంధీ భవన్ ప్రాంగణంలో సస్పెన్షన్‌కు గురైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి , సంపత్‌కుమార్‌లు చేపట్టిన 48 గంటల ప్రజాస్వామ్య పరిరక్షణ నిరాహారదీక్షకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివ చ్చారు. నాంపల్లిలోని గాం ధీభవన్‌లో గురువారం టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సిఎల్‌పి నేత జానారెడ్డి, టిపిసిసి కార్య నిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి లో విపక్ష నేత షబ్బీర్‌అలీలు కూడా పాల్గొన్నారు. తెలంగాణ పొలిటికల్ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండ రామ్ గాంధీభవన్‌లో కాంగ్రె స్ నేతల దీక్షా శిబిరా న్ని సందర్శించి వారికి సం ఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను సిఎం కెసిఆర్ మోసం చేశారన్నారు. అసెంబ్లీలో నిలదీస్తామనే భయంతోనే తమను అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేశారన్నారు. ప్రధాన ప్రతి పక్షాన్ని సస్పెండ్ చేసి, అసెంబ్లీని నడుపుతున్నారని, అలాంటి అసెంబ్లీని ఫామ్‌హౌస్‌లో కానీ, ప్రగతిభవన్‌లో కానీ జరుపుకోవాలని ఎద్దేవా చేశారు. సభ నుంచి స భ్యులను బహిష్కరించి తెలం గాణ ప్రజలను అవమానించారన్నారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని, ప్రజాస్వామ్యాన్ని అప హాస్యం చేసేలా టిఆర్ ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన ధ్వజమెత్తారు. కెసిఆర్ కుటుంబాన్ని తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. టిజెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం పై సిఎం కెసిఆర్ వాడిన భాష ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికలు కెసిఆర్ కుటంబానికి, తెలంగాణ సమాజానికి జరుగ నున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్‌కు దమ్ముంటే నల్గొండలో తనపై పోటీ చేసి గెలవాలని సవాల్ చేశారు. కెసిఆర్ పోటీ చేయకపోతే వారి కుటుంబం నుంచి ఎవరు పోటీ చేసినా తనకు అభ్యంతరం లేదన్నారు. ఎమ్మెల్యే సంపత్‌కుమార్ చివరిసారిగా ఎమ్మెల్యేగా మాట్లాడుతున్నానంటూ ఉ ద్వేగానికి లోనయ్యారు. తాను ఎప్పటికీ అలంపూర్ ప్రజల గుండెల్లో ఉండిపోతానన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, గీతా రెడ్డి, మర్రి శశధర్‌రెడ్డి, దానం నాగేందర్, శ్రీధర్‌బాబు, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డిలతో పాటు పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ్యత్వాల రద్దు నియంతృత్వమే

మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి

మనతెలంగాణ/న్యూఢిల్లీ:తెలంగాణలో కెసిఆర్ నియంతృత్వ ధోరణి విలయనాట్యం చేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి ఆరోపించారు. గురువారం తెలంగాణ అసెంబ్లీలో జరిగిన పరిణామాలపై పార్లమెంటులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ఆయన జాతీయ మీడియాకు వివరించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న పరిణామాలు చాలా బాధను, విచారాన్ని కల్గిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ సభ్యులు గవర్నర్‌కి వ్యతిరేకంగా కాదు, ఆయన ప్రసంగంలోని తప్పుడు సమాచారంపై నిరసన తెలిపారని స్పష్టం చేశారు. కొందరు మా ఎమ్మెల్యేలు కూడా పరిధి దాటి ప్రవర్తించారని నేను గమనించాను, కాని అందుకు పూర్తిగా సభ్యత్వాన్ని రద్దు చేసి ఉప ఎన్నికలకు వెళ్లాలనుకోవడం నియంతృత్వం అన్నారు. దీనిపై మేం తెలంగాణ స్థాయిలో, జాతీయ స్థాయిలో కూడా ఆందోళన చేస్తామని వెల్లడించారు.ఈ ఘటనపై కాంగ్రెస్ శ్రేణుల్లోనే కాదు, ఇతర అన్ని వర్గాల నుంచి టీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేక స్పందన వస్తోందన్నారు. టీఆర్ ఎస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య వల్ల కాంగ్రెస్ పార్టీకే లాభం జరిగిందన్నారు.

మేడిపండు బడ్జెట్ !

బిజెపి నాయకులు కిషన్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మేడి పండులా పైన మేలిమిలా ఉందని, లోపలా మాత్రం ఏమి లేదని బిజెఎల్‌పి నేత కిషన్ రెడ్డి అన్నారు. పెట్రోల్, డీజిల్‌లను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న రెవిన్యూని గమనిస్తే నోట్ల రద్దు, జిఎస్‌టి మంచి ఫలితాలనే ఇస్తున్నాయన్నారు. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం అనంతరం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. సిఎం కె.చంద్రశేఖర్‌రావు, టిఆర్ఎస్ ప్రభుత్వం చెప్పినవి ఇప్పటి వరకు చేయలేదని, ఇది ఎన్నికల బడ్జెట్ అని చెప్పుకోవడమే కానీ ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు.

హైకోర్టుకు కోమటిరెడ్డి, సంపత్

శాసనసభ్యత్వాల రద్దుకు వ్యతిరేకంగా న్యాయస్థానానికి, నేడు విచారణ

మన తెలంగాణ/ హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు ఇద్దరి సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. శాసనసభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని ప్రశ్నిస్తూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎ. సంపత్‌కుమార్‌లు హైకోర్టును ఆశ్రయించారు. అదేవిధంగా తమను చట్ట వ్యతిరేకంగా బడ్జెట్ సమావేశాలు మొత్తం బహిష్కరించడం పట్ల న్యాయపోరాటానికి శ్రీకారం చుట్టారు. నల్లగొండ, ఆలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఖాళీయేనంటూ అసెంబ్లీ కార్యదర్శి నోటిఫికేషన్ జారీ చేయడాన్ని ఇద్దరు నేతలు తమ వ్యాజ్యాల్లో సవాల్ చేశారు. ఈ కేసును వెంటనే విచారణ జరపాల్సిన అత్యవసర కేసని వారి తరఫు లాయర్ న్యాయమూర్తిని అభ్యర్థించారు. కేసును శుక్రవారం విచారణ చేస్తామని న్యాయమూర్తి శివశంకరరావు ప్రకటించారు. ఈ కేసులో తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి, రాష్ట్ర న్యాయ,శాసనవ్యవహారాల శాఖ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల కార్యదర్శులను ప్రతి వాదులుగా చేశారు. పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాల సమయంలో రాష్ట్రపతి లేదా గవర్నర్ ప్రసంగం చేయడాన్ని సభా వ్యవహారాల పరిధిలోకి రాదు. న్యాయనిపుణులు, సభా వ్యవహారాలపై రాజ్యాంగ నిపుణులు పలుసార్లు తేల్చి చెప్పారు. గవర్నర్ ప్రసంగ సమయంలో శాసన సభసభ్యులపై స్పీకర్‌కు నిర్ణయం తీసుకునే అధికారం ఉండదు. గవర్నర్ ప్రసంగం తర్వాత సభా కార్యక్రమాలు జరుగుతాయి. గవర్నర్ ప్రసంగం కూడా ప్రభుత్వం తయారు చేసిన ప్రసంగాన్ని చదువుతారు. గవర్నర్ ప్రసంగానికీ, సభా వ్యవహారాలకు ఎంతో తేడా ఉంది. స్పీకర్ అధికారాలు కూడా సభా వ్యవహారాల్లో ఉంటుంది. తాము సభలో హుందాగా వ్యవహరించకపోవడంపై తమకు 11, 12వ తేదీల్లో చెప్పలేదు. కనీసం తమకు నోటీసు కూడా జారీ చేయలేదు. తమ వాదన కూడా వినలేదు. వివరణ పొందలేదు. సంజాయిషీ తీసుకోకుండానే నిర్ణయం తీసుకున్నారు. గవర్నర్ ప్రసంగాన్ని ఇతరపార్టీ సభ్యులు వ్యతిరేకించి వాకౌట్ చేశారు. ఇలా చేయడం హుందా అవుతుందా.. గవర్నర్ ప్రసంగ సమయంలో అధికారపార్టీ సభ్యులు సీఎం కేసీఆర్‌ను కొనియాడుతూ బల్లలు చరచడం హుందాతనం అవుతుందా.. హుందాతనంపై తమ పై వేటు వేసే నిర్ణయం తీసుకోవడం సరైన దే అయితే ఆ విధంగా చేసిన వారిపై చర్య తీసుకోకపోవడం పక్షపాతమే అవుతుంది. గవర్నర్ ఉభయ సభల్ని ఉద్దేశించి ప్రసంగించేప్పుడు మండలి చైర్మన్ స్వామి గౌడ్‌పై హెడ్‌ఫోన్ విసిరారని, నినాదాలు చేశామని తమపై ఆరోపణ. స్వామి గౌడ్ కు గాయం అయినట్లుగా ఆ తర్వాత ఆస్పత్రిలో చేరారు. నిజంగానే గాయపడితే గవర్నర్‌కు వీడ్కోలు చెప్పేప్పుడు స్వామి గౌడ్ ఆయన వెంట ఎలా వెళ్లారు? గాయపడితే గవర్నర్‌తో స్వామి గౌడ్ ఎలా మాట్లాడారు? గవర్నర్‌కు వీడ్కోలు చెప్పిన తర్వాత స్వామి గౌడ్ కంటికి దెబ్బ తగిలిందని చెప్పి ఆస్పత్రిలో చేరడం, కంటికి కట్టుకట్టుకోవడం విడ్డూరంగా ఉంది. హెడ్‌ఫోన్ తగిలితే ఆ మేరకు అసెంబ్లీ వీడియో ఫుటేజీని బహిర్గతం చేయాలి. వీడియో ఫుటేజీని హైకోర్టు తెప్పించుకోవాలి. వాస్తవాల్ని పరిశీలించి ఏది హుందానో.. ఏది హుందా కాదో తేల్చాలి. ఈలోగా తమ సభ్యత్వాన్నిరద్దు చేసిన నిర్ణయం అమలు కాకుండా స్టే ఉత్తర్వులు ఇవ్వాలి. రెండు అసెంబ్లీ సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఇచ్చిన నోటిఫికేషన్ నిలుపుదల చేయాలి. రెండు అసెంబ్లీ ఖాళీ అయినట్లుగా ప్రకటించకుండా కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలి.. అని వ్యాజ్యంలో హైకోర్టును కోరారు.

ఆసుపత్రి నుంచి స్వామిగౌడ్ డిశ్చార్జ



మన తెలంగాణ / హైదరాబాద్ : సరోజినిదేవి ఆసుప్రతి డాక్టర్లతో పాటు సిబ్బంది ఇతర అధికారులకు తాను రుణపడి ఉంటానని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. తాను కంటికి దెబ్బ తగిలి ఆసుప్రతిలో చేరిన క్షణం నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు తనను ఒక ఇంటి సభ్యుడిగా చూసుకున్నారని తెలిపారు. ఇటువంటి ఆసుప్రతిలో చికిత్స చేయించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. శాసనసభ సమావేశాల సందర్భంగా మొదటిరోజు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం చేస్తుండగా కాంగ్రెస్ సభ్యులు చేసిన ఆందోళనలో స్వామిగౌడ్ కంటికి గాయమైన సంగతి తెలిసిందే. గురువారం ఆసుప్రతి నుంచి ఆయన డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా ఆసుప్రతి ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు. అసెంబ్లీలో మొదటి రోజు జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. దీన్ని ప్రతిపక్షాలు రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదన్నారు. దెబ్బ తలగకున్నా ఆసుప్రతిలో చేరానని కొందరు, హెడ్‌ఫోన్ తాకిడి దెబ్బతగులుతుందాని మరి కొందరు వెటాకారంగా మాట్లాడడం ఆవేదన కలిగించిందన్నారు. ఇలా మాట్లాడడాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని చెప్పారు. దెబ్బ తలగకున్నా ఆసుప్రతిలో చేరాల్సిన అవసరం తనకు లేదన్నారు. ప్రతిపక్షాలు సమన్వయం పాటించాలని, సమస్యలపై పోరాడేందుకు ఒక పద్ధతి ఉంటుందన్నారు. ఆసుప్రతిలో చేరినప్పటి నుంచి గవర్నర్‌తో పాటు సీఎం కేసీఆర్ రెండు పర్యాయాలు తనను ఫోన్‌లో పరామర్శించారని తెలిపారు. మిగతా ఎంఎల్‌ఎలు, ఎంపిలు, మంత్రులతో పాటు అభిమానులు తనను పామర్శించి ఆత్మస్థైరాన్ని నింపారని తెలిపారు. ఆసుప్రతిలో సౌకర్యాలతో పాటు అక్కడ పనిచేసే అధికారులు, డాక్టర్లు, సిబ్బంది మంచి మనస్సుతో పనిచేస్తున్నారని తెలిపారు. ఇది తనకు చాలా ఆనందాన్ని కలిగించిందన్నారు. తనకు దెబ్బ తగిలిందో లేదో అనే విషయాన్ని సరోజినిదేవి ఆసుప్రతి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆసుప్రతి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆయన కొలుకున్నారని తెలిపారు. వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన తర్వాతనే డిశ్చార్జ్ చేస్తున్నట్లు చెప్పారు. డిశ్చార్జ నేపథ్యంతో స్వామిగౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి వెళ్ళారు.

పేరు గొప్ప ఊరు దిబ్బగా బడ్జెట్ : చాడ

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 'పేరు గొప్ప ఊరు దిబ్బ' మాదిరిగా ఉందని, ప్రతిపాదించిన రూ.1.74 లక్షల కోట్ల వార్షిక బడ్జెట్‌లో రూ.29 వేల కోట్లను ద్రవ్యలోటుగా చూపడమే ఇందుకు నిదర్శనమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. ఈ బడ్జెట్ ద్వారా మరొకసారి ప్రజల చెవులల్లో ప్రభుత్వం పువ్వులు పెడుతున్నదని చెప్పడంలో అతిశయోక్తి లేదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌లో 6వ వంతు కేటాయింపులకు ఖజానాలో డబ్బు లేదని, కేటాయింపులు భారీగా చూపి, మంజూరీలు నామమాత్రంగా విడుదల చేయడం ఈ ప్రభుత్వ తంతుగా మారిందని ఆయన విమర్శించారు. ద్రవ్యలోటుతోపాటు ఈ వార్షిక బడ్జెట్ అమలుకు మరో రూ.33 వేల కోట్ల అప్పు చేయడానికి ప్రభుత్వం అధికారిక ప్రతిపాదనలు చేసిందని, గడిచిన నాలుగేళ్లలో టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు ఈ నూతన వార్షిక బడ్జెట్‌కు సమానంగా ఉండడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచుతున్నదనేది యదార్థమన్నారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీకి సంబంధించిన వడ్డీ చెల్లింపునకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం దారుణమన్నారు. స్థానిక సంస్థలకు కేవలం రూ.1500 కోట్లు కేటాయించడం ఆ సంస్థలను నిర్వీర్యం చేయడమేనన్నారు. దళితులకు మూడెకరాల భూమికి గానీ, డబుల్ బెడ్‌రూమ్స్‌కు గానీ సరిపడ నిధులు కేయించకపోవడం, వాటి అమలుకు అప్పుల మార్గాలనే వెతకాలని పేర్కొనడం విచాకరమన్నారు.

రాష్ట్ర వృద్ధి రేటు 9%

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర వృద్ధి రేటు ఏడాదికేడాది శరవేగంగా దూసుకుపోతోంది. గత ఏడాదితో పోలిస్తే 2017–18లో రాష్ట్ర జిఎస్‌డిపి 14.1శాతం పెరగడమే ఇందుకు నిదర్శనం. రాష్ట్రంలో సగటు వృద్ధిరేటు 9 శాతంగా నమోదుకాగా జాతీయ వృద్ధిరేటు 7.3 శాతంగా ఉండడం గమనార్హం.అలాగే స్థిర ధరల్లో చూస్తే 10.4 శాతం పెరిగింది. జాతీయ జిడిపిలో రాష్ట్ర ఏర్పడిన మొదటి ఏడాది 4.02 శాతంగా ఉన్న వాటా ప్రస్తుతం 4.37 శాతానికి పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన సామాజిక, ఆర్థిక సర్వేలో వెల్లడించింది. రాష్ట్ర తలసరి ఆదాయం 2017–18లో రూ.1.75 లక్షలు కాగా, గత ఏడాది రూ. 1.54 లక్షలుగా ఉంది. ఈ లెక్కన ఏడాదిలోనే 13.4 శాతం రూ. 21 వేలు పెరిగింది. దీనిని జాతీయ తలసరి ఆదాయంతో పోలిస్తే 8.6 శాతం ఎక్కువగా ఉండటం విశేషం.

సామాజిక,ఆర్థిక సర్వేలోని ప్రధాన అంశాలు

* వ్యవసాయం, అనుబంధ రంగాలలో ఈ ఆర్థిక సంవత్సరంలో 9.8 శాతం వృద్ధి నమోదైంది. గొర్రెల పంపిణీ పథకం, పశువైద్య సేవలను మెరుగు పర్చడంతో పశుసంపదతో వచ్చే ఆదాయం 13.6 శాతం వృద్ధి చెందింది.
* టిఎస్‌ఐపాస్ వంటి నూతన పారిశ్రామిక విధానం, పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా వంటి క్రియాశీలక నిర్ణయాలతో పారిశ్రామిక రంగంలో 8.6 శాతం వృద్ధి
* రాష్ట్రంలో ఆహార ధాన్యాల దిగుబడి ఈ ఏడాది 95.01 లక్షల టన్నులుగా ఉంటుందని అంచనా. గత ఏడాదితో చూస్తే 6 లక్షల క్వింటాళ్లు తగ్గనుంది.
* ఉత్పత్తుల ఎగుమతులలో జాతీయస్థాయిలో రాష్ట్రం ప్రధాన భూమిక పోషిస్తోంది. 2016–17లో రూ.40,322 కోట్లు ఉత్పత్తులను ఎగుమతి చేసింది. 2015–16లో ఇది రూ.35,444 కోట్లుగా ఉంది.

రైతులకు ఉపయోగపడేదేమీ లేదు ?

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలతో ప్రజలకు ఒరిగిందేమి లేదని సిపిఐ(ఎం) ఎంఎల్‌వ సున్నం రాజయ్య అన్నారు. ఎస్‌సి,ఎస్‌టిలకు ఖర్చు చేయాల్సిన వాటిలో రూ. 10 వేల కోట్లు మిగిలిపోయాయన్నారు. అటవీ చట్టాన్ని అటకెక్కించారన్నారు. కౌలుదారులకు పెట్టుబడి పథకం అమలు చేయడం లేదని 14 లక్షల మందికి అన్యాయం జరుగుతోందన్నారు. ప్రణాళిక నిధి పేరుతో ఎస్‌సి, ఎస్‌టిలకు నిధులు రాకుండా చేస్తున్నారని, చేతకాని ప్రభుత్వమన్నారు.

అప్పుల్లోకి దిగజార్చారు : సిపిఐ(ఎం)

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏటా రు.32వేల కోట్ల రుణాన్ని జమ చేస్తూ 2018 మార్చి నాటికి రు.1.51 లక్షల కోట్ల రుణంలోకి రాష్ట్రాన్ని దిగజార్చిందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. బడ్జెట్‌లను ఏటా 15 శాతం పెంచడమే తప్ప ఖర్చు మాత్రం బడ్జెట్‌లో 15 శాతం లోటు కొనసాగుతున్నది. రాష్ట్రంలో 52 శాతంగా ఉన్న వెనుకబడిన తరగతులకు రు.5919 కోట్లు మాత్రమే కేటాయించడం విచారకరమన్నారు.

పెరిగిన బిసిల వాటా

(మొదటిపేజీ తరువాయి)

రూ.84.30 లక్షలు గ్రాంట్, 200 కోట్ల పెట్టుబడి, నాయి బ్రహ్మణ సహకార సంఘాల సమాఖ్యకు రూ.51.05 లక్షలు గ్రాంట్, రూ. 250 కోట్ల పెట్టుబడులు, వడ్డెర సహకార సంస్థకు రూ.5.45 కోట్లు, కృష్ణ బలిజ, పూసల కో ఆపరేటివ్ ఫెడరేషన్‌కు రూ.5 కోట్లు కేటాయించారు. వాల్మికి, బోయ కో ఆపరేటివ్ ఫెడరేషన్‌కు రూ. 2.10 కోట్లు, భట్రాజ్ కో ఆపరేటివ్ ఫెడరేషన్‌కు రూ. 2 కోట్లు, మేదర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.3 కోట్లు, విశ్వ బ్రహ్మణ కో ఆపరేటివ్ కార్పొరేషన్‌కు రూ. 10 కోట్లు, శాలి వాహన కో ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌కు రూ. 8 కోట్లు, కల్లుగీత కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.10 కోట్లు, సంచార జాతుల ఫెడరేషన్‌కు రూ. 10 కోట్లు, సాగర కో ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌కు రూ. 10 కోట్లు ప్రతిపాదించారు. ఎంబిసి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు కేటాయించారు. చేనేత కారుల సహాయానికి రూ. 1200 కోట్లు కేటాయించారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు ఈ సారి నిధులు పెంచారు. గత సంవత్సరం రూ.342.90 కోట్లు కేటాయించగా ఈ సంవత్సరం రూ.450 కోట్లు ప్రతిపాదించారు. ప్రభుత్వ హాస్టళ్ళు, డైట్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు, స్టైఫండ్ లకు గతంలో నాలుగు కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ.5.20 కోట్లు ప్రతిపాదించారు. ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ కోసం రూ. 800 కోట్లు, స్టడీ సర్కిళ్ళకు రూ. 25 కోట్లు, బిసి గురుకులాలకు రూ. 260 కోట్లు , ఇబిసి ఫీజు రీ ఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌కు రూ.300 కోట్లు ప్రతిపాదించారు. జ్యోతిబాపూలే విద్యానిధి పథకానికి రూ. 60 కోట్లు కేటాయించారు. ఇది గతం కంటే రూ.40 కోట్లు అధికం. కళ్యాణ లక్ష్మి పథకానికి గత బడ్జెట్‌లో రూ.400 కోట్లు ప్రతిపాదించగా ఇపుడు రూ.700 కోట్లకు పెంచారు.

సామాజిక సేవలు

(మొదటిపేజీ తరువాయి)

మైనారిటీల సంక్షేమంతో పాటు ఆసరా పింఛన్లు,కల్యాణలక్ష్మి , షాదీముబారక్, ఎస్‌సి, ఎస్‌టిల ప్రత్యేక నిధి, రెండు పడక గదుల ఇళ్ళు, సంక్షేమ హాస్టళ్ళు, ఆరోగ్యలక్ష్మి, దళితులకు మూడెకరాల భూమి, సామాజికవర్గాల ఫెడరేషన్‌కునిధులు, మైనారిటీలకు స్టడీ సెంటర్లు, ఇస్లామిక్ సెంటర్ ఏర్పాటు ఇలా అన్నింటికీ రూ. 45,479 కోట్లను కేటాయించింది. ఆ తర్వాత వ్యవసాయం, సాగునీటిపారుదల, వైద్యం తదితర రంగాలకు కేటాయించింది.



కాకతీయ ద్వారా 6 వేల క్యూసెక్కుల నీరు విడుదల

మన తెలంగాణ/ మెండోరా (నిజామాబాద్ జిల్లా) : ఎస్సారెస్పీ ప్రాజెక్టు ప్రధాన కాకతీయ కాలువ ద్వారా గురువారం 6000 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. దీని ద్వారా సరస్వతి కాలువకు 500 క్యూసెక్కులను, లక్ష్మి కాలువకు100 క్యూసెక్కులు విడుదలవుతోందని, అయితే అన్ని లీకేజీల ద్వారా మరో 135 క్యూసెక్కుల నీరు వృథా అవుతుందని ప్రాజెక్టు ఎఇ మహేందర్ తెలిపారు. ఎగువ నుండి ఎటువంటి ఇన్‌ఫ్లో రావడం లేదన్నారు. విడుదల చేసిన నీటితోపాటు వృథా అవుతున్న నీటితో కలిపి మొత్తం ప్రాజెక్టు నుండి 6800 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందన్నారు. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను గురువారం సాయంత్రానికి 1064.60 అడుగులుగా ఉందని తెలిపారు. జూన్ 1, 2017 నుండి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 75.265 టిఎంసిల నీరు వచ్చి చేరిందని తెలిపారు. కాగా, మండలంలోని పోచంపాడ్ గ్రామంలో ఉన్న తెలంగాణ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో కాకతీయ కాలువ ద్వారా 6000 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతున్నందున ఆ నీటిని వినియోగించుకుని మూడు టర్బయిన్లతో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. బుధవారం మూడు టర్బయిన్‌లతో 11.50 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అన్నారు. ఈ సీజన్‌కు మొత్తంలో 33.2956 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని డిఈఓ అండ్ ఎంఐ శ్రీనివాస్ తెలిపారు.

సిఐ గజ్జికృష్ణ సస్పెన్షన్

మన తెలంగాణ/గోదావరిఖని : రామగుండం కమిషనరేట్‌లో సిపి అటాచ్‌డ్‌గా ఉన్న సిఐ గజ్జి కృష్ణను సస్పెండ్ చేస్తూ కరీంనగర్ రేంజ్ డిఐజి ప్రమోద్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత కొంత కాలంగా పట్టణంలోని దళిత మహిళ స్వాతి ఆత్మహత్య కేసులో సరైన రీతిలో స్పందించనందుకు గాను సిపికి అటాచ్ చేశారు. విచారణలో కృష్ణపై నిజాలు నిర్ధారణ కావడంతో ఈ చర్యకు పూనుకున్నట్లు తెలిసింది.

ఎసిబి కస్టడీకి పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ / మాదన్నపేట్ : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధకశాఖకు చిక్కిన హెచ్‌ఎండిఏ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డిని,అతని సన్నిహితుడైన శ్రీనివాస్‌రెడ్డిలను ఎసిబి మరోసారి ఆరురోజుల పాటు కస్టడీకి తీసుకుంది. గురువారం చంచల్‌గూడ జైలు నుంచి వీరిని ఎసిబి అధికారులు తీసుకెళ్లినట్లు జైలు అధికారులు తెలిపారు. ఎసిబి పురుషోత్తంరెడ్డి ఇంట్లో అక్రమ ఆస్తుల తనిఖీలు చేసే సమయంలో విదేశీ మద్యం కూడా భారీ ఎత్తున లభించింది. అబ్కారీ శాఖ అధికారులు ఈ విషయంపై పురుషోత్తంరెడ్డికి నోటీసులు జారీ చేయడానికై చంచల్‌గూడ జైలుకు వచ్చారు. ఎసిబి కస్టడీలో ఉన్నట్లు తెలుసుకొని అధికారులు వెనుతిరిగారు.

హామీలు విస్మరించిన ప్రభుత్వం

మన తెలంగాణ/జగిత్యాల : ఎన్నికల సందర్భంగా ఎన్నో హామీలు ఇచ్చి ఆ హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చకుండా ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ ప్రజలను వంచించాడని, తెలంగాణ టిడిపి అధ్యక్షులు ఎల్. రమణ అన్నారు. గురువారం జగిత్యాలలోని ఆయన నివాసంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో రమణ మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగానికి ఒకరోజు ముందే ప్రధాన ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కెసిఆర్ చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన ఉండదని, టిడిపి చెప్పినట్లుగానే నేడు కెసిఆర్ వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా టిడిపి అధ్యక్షులు సాగర్‌రావు, నియోజకవర్గ ఇంచార్జ్ బోగ వెంకటేశ్వర్లు, వొల్లాల గంగాధర్, వొల్లం మల్లేశం, బాలె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

వీడియో కాల్ మాట్లాడుతూ లైవ్ సూసైడ్


మన తెలంగాణ/మల్కాజిగిరి : ప్రేమించిన అమ్మాయితో ఫోన్‌లో వీడియో కాల్ మాట్లాడుతూ ఆత్మహత్యకు పాల్పడ్డాడో విద్యార్థి. ఈ సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మెదక్ జిల్లాకు బంతిలాల్ కొడుకు అజ్మీర్ సాగర్ (20) తన అక్కతో కలిసి నేరేడ్‌మెట్‌లోని వినాయక్ నగర్‌లో నివాసముం టూ ఐటిఐ చదువుతున్నాడు. ఇదిలా ఉండగా గత కొంత కాలంగా సాగర్ ఓ అమ్మాయితో చనువుగా ఉంటున్నాడు. ఈ విషయం ఇరు కుటుంబాల వారికి తెలిసి నాలుగు నెలల క్రితం ఇద్దర్నీ మందలించారు. అయితే సాగర్‌కు వాళ్ల తల్లిదండ్రులు పెళ్లి సంబందాలు చూస్తున్నారు. దీనిపై మనస్థాపం చెంది ఓ వైపు ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోలేక, మరోవైపు ఇంట్లో వాళు చేసే వివాహం ఇష్టం లేక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అమ్మాయితో ఫోన్‌లో వీడియో కాల్ మాట్లాడుతూ ఆమె చూస్తుండగానే లైవ్‌లో ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిజాం సాగర్‌లో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు గల్లంతు

మన తెలంగాణ/ బోధన్ (వర్ని) (నిజామాబాద్ జిల్లా): మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రధా న కాలువలో ఈతకు వెళ్ళిన ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తు నీటిలో కోట్టుకు పోయి గల్లంతైనట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. గురువారం మిత్రులతో కలిసి ప్రధాన కాలువలో స్నానాలు చేసేందుకు సోయల్(17), ప్రభుదాస్(17)లు వెళ్లి గల్లంతయ్యారు. మరో ముగ్గురు యువకులు ప్రమాదం నుండి తప్పించుకున్నారు. గల్లంతైన యువకులలో సోహెల్ బోధన్‌లోని ఉషోదయ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసినట్లు యువకుడి తల్లిదండ్రులు ఇబ్రహీం, దిదియా బేగంలు పేర్కొన్నారు. ప్రభుదాస్ సైతం ఇదే సంవత్సరం ఇంటర్ పరీక్షలు రాసినట్లు తల్లిదండ్రులు చంద్రకాంత్, లక్ష్మి లు పేర్కొన్నారు. స్నేహితులతో కలిసి వెళ్ళి ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. వారి కుమారులు కాలువలో గల్లంతైనట్లు విషయం తెలియడంతో శోక సముద్రంలో మునిగిపోయారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. నీటి విడుదలను నిలిపివేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు పోలీసులు సూచించడంతో సాగర్ నీటిని అధికారులు నిలిపివేసి గాలించేందుకు సహకరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూ దొందే

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి



మన తెలంగాణ/మెదక్ టౌన్ : ప్రజాసమస్యలపై ఉద్యమించే ప్రతిపక్షాల గొంతునొక్కడం సరైంది కాదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. గురువారం మెదక్ పట్టణంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో సిపిఐ 23వ జిల్లా మహాసభలను నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎ.రాజిరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి అమరుల స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాన్నారు. ఏప్రిల్ 1నుండి 4 వరకు హైదరాబాద్‌లో రాష్ట్ర మహాసభలు, 25 నుండి 29 వరకు కేరళలో జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రజాసమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఆదిరెడ్డి, ఏసురత్నం, జిల్లా కార్యదర్శి రాజిరెడ్డి, జిల్లా నాయకులు ఖాలేక్ అయ్యవారి లక్ష్మ ణ్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూములను కబ్జా చేసిన ఎమ్మెల్యే

మన తెలంగాణ/కరీంనగర్ క్రైం : కరీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్ వక్ఫ్‌బోర్డు భూములను కబ్జా చేశారని చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వక్ఫ్‌బోర్డు భూములను కబ్జా చేశారనేందుకు అవసరమైన సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని, బహిరంగ విచారణకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. కొత్తపల్లి మండలంలోని ఖాజీపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 122, 126లోని భూములు గెజిట్ ప్రకారం వక్ఫ్‌బోర్డువని అన్నారు. కాని ఆయా సర్వే నంబర్‌లలో ఉన్న భూములు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేరుతో ఉన్నాయ న్నారు.

సత్వరమే కొత్త పంచాయతీ చట్టం

- ఈ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు ఆమోదానికి సన్నాహాలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 3వేల ఎకరాల భూ పంపిణీ
- మున్సిపాలిటీలుగా నర్సాపూర్, ఖేడ్, తూప్రాన్, రామాయంపేట, చేర్యాల్
- మంత్రి హరీశ్‌రావు



మన తెలంగాణ/ సంగారెడ్డి ప్రతినిధి : ఈ బడ్జెట్ సమావేశాల్లోనే గ్రామ పంచాయతీ చట్ట సవరణ బిల్లును ఆమోదించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్టు నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు చెప్పారు. జిల్లాకు వెయ్యి ఎకరాల చొప్పున సిద్దిపేట, మెదక్ సంగారెడ్డి జిల్లాల్లో మూడు వేల ఎకరాలను దళితులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ హాల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గురువారం సమీక్షించారు. జిల్లాకు వెయ్యి ఎకరాల చొప్పున మూడు వేల ఎకరాలు దళితులకు భూ పంపిణీ కార్యక్రమాన్ని వెంటనే పంపిణీ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. శాసన సభ్యులు ప్రతిపాదించిన భూమికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అయితే దళితుల భూ పంపిణీ కార్యక్రమంలో విమర్శలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని మూడు జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, అధికారులను కోరారు. మొత్తం ప్రక్రియ పార దర్శకంగా జరగాలని, సాగుకు యోగ్యమైన భూములనే మూడు ఎకరాల చొప్పున దళితులకు పంపిణీ చేయాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో నర్సాపూర్, నారాయణఖేడ్, తూప్రాన్, రామాయంపేట, చేర్యాల్ మున్సిపాలిటీలుగా ఏర్పడబోతున్నాయన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే మున్సిపాలిటీలకు స్టార్టప్ నిధులు ఉన్నాయని, వాటితో అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే ప్రారంభించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, చైర్మన్లు తెల్లవారుజామునే పాదయాత్ర చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని కోరారు. సత్వరమే రైతు బజార్ల నిర్మాణం పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి మున్సిపాలిటీలో వైకుంఠధామం ఏర్పాటు చేయాలని సూచించారు. వైకుంఠ రథాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. సిద్దిపేటలోని వైకుంఠదామంను మోడల్‌గా తీసుకొని నిర్మించాలని, వచ్చే ఆరు నెలల్లో మున్సిపాలిటీల రూపు రేఖలు పూర్తిగా మారిపోవాలని మంత్రి కోరారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇంకా 12 దేవాలయాలకు పాలక మండలి ఏర్పాటు కాలేదని, వెంటనే ఆయా కమిటీలను నియమించాలన్నారు. మూడు జిల్లాల్లో మహిళా భవనాలు గ్రామాల్లో కొత్తగా మహిళా భవనాలు నిర్మించాలని ఆదేశించారు. 2014 వరకు ఉన్న చేనేత కార్మికుల రుణాలన్నీ మాఫీ చేసేందుకు లబ్ధిదారుల జాబితాలను వెంటనే సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు బాబూమోహన్, మహిపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకు కుంభకోణంపై దర్యాప్తు

మన తెలంగాణ/రంగారెడ్డి జిల్లా: రంగారెడ్డి జిల్లా పరిధిలోని అజీజ్‌నగర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కుంభకోణంపై దర్యాప్తు ముమ్మరం చేశారు. గురువారం కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ అధికారులుమొయినాబాద్ పోలీసులను మరింత సమాచారాన్ని సేకరించారు. ఐదుగురు సభ్యుల కమిటీతో బాధితుల నుంచి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. నిందితుడు జైపాల్‌రెడ్డి స్థిరాస్తులను కొనుగోలు చేసినట్లు సిబిఐ విచారణలో వెల్లడైంది. రెండు, మూడు రోజుల్లో ఐదుగురు నిందితులను అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఖాతాదారుడి ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేయగా రూ.9కోట్లకుపైగా కుంభకోణం జరిగినట్లు నిర్ధారణ కావడంతో ఈ కేసు దర్యాప్తు సిబిఐకి బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

అభివృద్ధికి చిరునామా తెలంగాణ : కెటిఆర్



మన తెలంగాణ / సిరిసిల్ల : దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉందని, అభివృద్ధికి తెలంగాణ చిరునామాగా మారిందని మంత్రి కె. తారక రామారావు అన్నారు. గురువారం సిరిసిల్లలో సుడిగాలి పర్యటన చేసి ఒక కోటి తొంభైనాలుగు లక్షల యాభైఐదువేల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సిరిసిల్లను పరిశుభ్రంగా ఉంచేందుకు రూ.30 లక్షలతో కొనుగోలు చేసిన ఊడ్చే యంత్రాన్ని మంత్రి ప్రారంభించారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో నాలు గేళ్లలోనే అనితరసాధ్యమైన ప్రగతిని సాధించి దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. అభివృద్ధి పరంపర మరింత వేగంగా కొనసాగించేందుకు గురువారం శాసనసభలో ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎంతగానో ఉపకరించనుందన్నారు. పట్టణాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు పౌర సదుపాయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు పోతున్నామన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్ చెరువు అభివృద్ధి పరిచి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని మంత్రి కెటిఆర్ కలెక్టర్‌కు సూచించారు. కార్గిల్ లేక్ చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలోని అభివృద్ధి పనులను నిర్మాణంలో ఉన్న కలెక్టరేట్ సమీకృత భవన సముదాయాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని, ఆర్‌వి‌ఎమ్ కో–ఆర్డినేటర్ గడ్డం నర్సయ్య, డిఆర్‌ఓ శ్యాంప్రసాద్ లాల్, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, ఎఎంసి చైర్మన్ జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

‘పది’ నిమిషాలలో ప్రశ్నపత్రం లీక్

- తాండూరులో మాస్ కాపీయింగ్
- ర్యాంకింగ్ కోసం బడుల ఆరాటం



పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు, పది పరీక్ష రాస్తున్న విద్యార్థి శ్రీనివాస్‌రెడ్డి

మన తెలంగాణ/తాండూరు (వికారాబాద్ జిల్లా): పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన రోజే వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో మాస్ కాపీయింగ్‌కు తెరలేచింది. పరీక్ష ప్రారంభమైన పది నిమిషాలలోనే ప్రశ్నాపత్రం లీక్ అయింది. దీంతో విద్యార్థుల బంధువులు పరీక్షా కేంద్రాలకు చేరుకుని చీటీలు అందించారు. పట్టణ సిఐ ప్రతాపలింగం రంగంలోకి దిగడంతో పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పదవ తరగతి వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి.గురువారం తెలుగు మొదటి పేపర్ ఉదయం 9:30 నిమిషాలకు విద్యార్థులకు అందించారు. పట్టణంలోని నెంబర్ 1 పరీక్ష కేంద్రం నుండి పరీక్ష ప్రారంభమైన పది నిమిషాలలోనే ప్రశ్నాపత్రం వాట్సప్ ద్వారా లీక్ అయింది. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లితండ్రులు, బంధువులు పరీక్షా కేంద్రాలకు చేరుకుని జవాబు చీటీలను విద్యార్థులకు అందించారు. మిగిలిన పరీక్షా కేంద్రాలకు సైతం వాట్సప్ ద్వారా ప్రశ్నా పత్రం చేరడంతో ప్రతి సెంటర్ వద్దకు జనం చేరుకున్నారు.

‘పది’ పరీక్ష రాసిన ఇంటర్ విద్యార్థులు

మనతెలంగాణ/ధర్మారం : పదోతరగతి విద్యార్థులకు బదులుగా ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాసి అడ్డంగా దొరికిన సంఘటన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం, దొంగతుర్తి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. అదేవిధంగా ఖిలావనపర్తి మారుతి విద్యాలయంలో పదవ తరగతి చదువుతున్న కోల మహేష్, పెండ్యాల శ్రీనివాస్‌లకు దొంగతుర్తిలోని జడ్పీ పాఠశాలలో పరీక్ష రాయాల్సి ఉండగా వారి స్థానంలో ఇంటర్ విద్యార్థులు మామిడి శెట్టి పవన్ కుమార్, సామంతుల హరీష్‌లు పరీక్షలు రాస్తుండగా అనుమానం వచ్చిన ఇన్విజిలేటర్లు తనిఖీ చేయగా దొరికిపోయారు. సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పెద్దపల్లి ఎసిపి హబీబ్‌ఖాన్, సిఐ నరేందర్ విచారణ చేపట్టి ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పది విద్యార్థులు మహేష్, పెండ్యాల శ్రీనివాస్ ఇంటర్ విద్యార్థులు మామిడి శెట్టి పవన్‌కుమార్, సామంతుల హరీష్, మారుతి విద్యాలయం కరస్పాండెంట్ కొమురయ్యపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎసిపి హబీబ్ ఖాన్ తెలిపారు.

ఇంట్లో తండ్రి శవం.. పరీక్షా హాల్లో తనయుడు

మన తెలంగాణ/యాలాల : కన్న తండ్రి చనిపోయినా తనయుడు పదవ తరగతి పరీక్షకు హాజరైన సంఘటన మం డల పరిధిలో నాగసముందర్‌లో గురువారం చోటు చేసుకుంది. వికారాబాద్ జిల్లా, యాలాల మండలం, నాగసముందర్‌కి చెందిన మోహన్‌రెడ్డి గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందారు. మృతుడు మోహన్‌రెడ్డి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి మండల పరిధిలోని పగిడియాల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నారు.తండ్రి శవం ఇంట్లో ఉన్నా పుట్టెడు దుఖఃంలో మొదటి రోజు తెలుగు పేపర్–1 రాయడానికి పరీక్షా కేంద్రం అగ్గనూర్ ఉన్నత పాఠశాలకు హాజరై పరీక్షను రాశాడు.

పేట్లబుర్జు దోపిడీ కీలక నిందితుడు అరెస్టు

- రూ. 6 లక్షల సొత్తు స్వాధీనం
- నిందితులందరినీ అరెస్టుచేస్తాం: సిపి



మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో : నగరంలో సంచలనం సృష్టించిన చార్మినార్ పరిధి పేట్లబుర్జులో జరిగిన నగల దుకాణం దోపిడీకి సంబంధించిన అంతరాష్ట్ర ముఠా నిందితుడిని నగర పోలీసులు అరెస్టుచేశారు. ఇతడి నుండి రూ. 6 లక్షల విలువ చేసే నగలను స్వాధీనం చేసుకున్నారు. ఇతడికి సుమారు 40 కేసుల్లో సంబంధమున్నది. నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ ఈ కేసుకు సంబంధించి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. థానే(ముంబై) ప్రాంతానికి చెందిన అబ్జుద్ ఖ్వాజా అమీన్ షేక్(41) తన ముఠా సభ్యులు 10 మంది కలిసి ఈ నెల 6వ తేదీన చార్మినార్ పరిధిలోని పేట్లబురుజు ప్రాంతంలో నగల తయారీ దుకాణంలో దోపిడీకి పాల్పడ్డాడు. ముఠాకు నిందితుడు అమీన్ షేక్ నేతృత్వం వహించాడు.ఈ ముఠా ముందుగా దోపిడీ చేయాల్సిన ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని అక్కడ రెక్కీ నిర్వహిస్తారు. దోపిడీ చేసే రోజు నేరుగా అక్కడికి ముగ్గురు, నలుగురుగా కలిసి చేరుకుంటారు. దోపిడి చేసిన అనంతరం ముగ్గురు, నలుగురుగా విడిపోయి బస్సుల్లో, రైళ్లలో, అందుబాటులోని ప్రయాణ వాహనాల్లో వెళ్ళిపోతారు. అందరూ కలిసి దూరప్రాంతాలకు చేరుకుని దోపిడీ సొత్తును ముంబై, గుజరాత్ రాష్ట్రాల్లో విక్రయిస్తారు. ఈ నెల 6వ తేదీన ముందుగా ఇద్దరు వ్యక్తులు వచ్చారు. అనంతరం మరో ముగ్గురు ఆటోలో దిగారు. చోరీచేయాల్సిన ప్రాంతపు పరిసరాలను పరిశీలించారు. అనంతరం మిగిలిన వారందరూ అక్కడకు 100 మీ.ల దూరంలో చేరుకుని సైగలతో లక్ష్యంకు చేరుకోవాలని సూచించుకున్నారు. నేరుగా వెళ్ళి ముసుగులు, కత్తులు ధరించి నగల తయారీ కేంద్రంలోకి చొరబడి 3.50కేజిల నగల బంగారాన్ని దోపిడీ చేసి అక్కడి నుండి నేరుగా కొందరు నడుచుకుంటూ మరికొందరు ఆటోలో ఇలా పలురకాలుగా పారిపోయారు. వీరంతా ముంబై ప్రాంతానికి చెందిన అంతరాష్ట్ర ముఠాగా వెల్లడైంది. దోపిడీ నిందితుల కోసం నగర పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు.17 బృందాలుగా పోలీసులు ఏర్ప డి గాలింపు చేపడుతున్నారు. సుమారు 300 సిసిటివిల డివిఆర్‌లను పరిశీలించారు. ముంబై ప్రాంతానికి చెందినవారుగా నిర్ధారణ జరిగిన తర్వాత షోలాపూర్, పూణే, ముంబై నగరాల్లో గాలింపులు జరుగుతున్నాయి కమిషనర్ అంజనీ కుమార్ తెలిపారు. త్వరలో పరారీలో ఉన్న నిందితులందరినీ పట్టుకుంటామని చెప్పారు.

'సైరా..'లో ముఖ్య పాత్రలో..



'బాహుబలి'లో బిజ్జాలదేవగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించి మంచి పేరు తెచ్చుకున్నాడు నాజర్. ఈ చిత్రం తర్వాత అతనికి పెద్దగా చెప్పుకోదగిన పాత్రలు రాలేదు. ఇప్పుడు నాజర్ మెగాస్టార్ చిరంజీవి 'సైరా..నరసింహారెడ్డి'లో ఓ ముఖ్యపాత్ర పోషిస్తున్నాడు. భారత స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ స్వయంగా నిర్మిస్తున్నాడు. చిరంజీవి 151వ చిత్రమిది. భారీ బడ్జెట్‌తో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నాజర్... చిరంజీవి గాడ్‌ఫాదర్‌గా కనిపించబోతున్నాడట. నరసింహారెడ్డి పెళ్లి విషయంలో అతనే నిర్ణయం తీసుకొని వివాహం జరిపిస్తాడని సమాచారం. ఎంతో ముఖ్యమైన పాత్రలో నాజర్ కనిపించనున్నాడు. ఈ చిత్రం అతని కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో బిగ్‌బి అమితాబ్ బచ్చన్, విజయ్ సేతుపతి, జగపతిబాబు, సుదీప్ వంటి భారీ తారాగణం నటించనుంది. అతి త్వరలో అమితాబ్ ఈ చిత్రం షూటింగ్‌లో పాల్గొంటాడని సమాచారం.



మోనిక, రామకృష్ణ, యలమంచిలి రవిశంకర్, నవీన్, సుకుమార్

చిరంజీవి ముఖ్య అతిథిగా 18న ప్రీ రిలీజ్ ఫంక్షన్

రామ్‌చరణ్, సమంత హీరోహీరోయిన్లుగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్, యలమంచిలి రవిశంకర్, సివిఎం (మోహన్) నిర్మాతలుగా రూపొందుతున్న చిత్రం 'రంగస్థలం'. ఈ సినిమా ఈనెల 30న విడుదలకానుంది. ఈనెల 18న ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించబోతున్నారు. ఇక గురువారం సినిమా ఆడియో మార్కెట్లోకి విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో చిత్ర నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ ''రంగస్థలం సినిమాకు సంబంధించిన ఆడియో జ్యాక్‌బాక్స్ మార్కెట్లోకి విడుదలైంది. ఇదివరకే విడుదలైన మూడు పాటలకు చాలా మంచి స్పందన వచ్చింది. ఈనెల 18న వైజాగ్ ఆర్‌కె బీచ్‌లో ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను నిర్వహిస్తున్నాం. ఎంతో ఘనంగా నిర్వహించే ఈ వేడుకకు ముఖ్య అతిథిగా చిరంజీవి రానున్నారు. ప్రస్తుతం సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది''అని అన్నారు. చిత్ర దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ ''రంగస్థలం ఆడియో నేరుగా మార్కెట్లోకి విడుదలైంది. సినిమాలో ఇప్పటికే ఎంత సక్కగున్నావే..., రంగ రంగ రంగస్థలానా..., రంగమ్మ మంగమ్మ... అనే మూడు పాటలు విడుదలైపోయాయి. మరో రెండు పాటలను జ్యాక్‌బాక్స్‌లో వినండి. ఇందులో జిగేల్ రాణి ఐటమ్ సాంగ్, ఆగట్టుకుంటావా? ఈ గట్టుకుంటావా? అనే పాటలు ప్రేక్షకులను అలరిస్తాయి. అలాగే సినిమాలో సర్‌ప్రైజ్ సాంగ్ ఉంటుంది. ఆ సాంగ్‌ను చంద్రబోస్ పాడారు. ఈనెల 30న సినిమాను విడుదల చేస్తున్నాం. 1980 బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది. ఆర్ట్ డైరెక్టర్ రామకృష్ణ, మోనిక 1980 బ్యాక్‌డ్రాప్‌లోని సెట్‌ను చక్కగా వేశారు. ఆ సెట్ చూసి నేను ఆశ్చర్యపోయాను. దేవిశ్రీ ప్రసాద్, చంద్రబోస్‌లు మంచి సృజనాత్మకత కలిగిన వ్యక్తులు. చంద్రబోస్ ప్రతి పాటను10–15 నిమిషాల్లో రాసిచ్చేశారు. పాట రాసిన తర్వాతే ట్యూన్స్ కంపోజ్ చేయడం జరిగింది. సినిమాలోని ఆరు పాటలకు ఇదే పద్ధతిని అనుసరించాం. నేను దాదాపు 28 సంవత్సరాలు పల్లెటూర్లలోనే పెరగడంతో వాటితో మంచి అనుబంధం ఏర్పడింది. ఈ సినిమా చేయడం వల్ల నా అనుబంధాన్ని మళ్లీ వెతుక్కున్నట్లు అయ్యింది. నేను డైరెక్ట్ చేసిన నేనొక్కడినే, నాన్నకు ప్రేమతో సినిమాలు యుఎస్‌లో మంచి వసూళ్లను రాబట్టాయి. నేను అక్కడకు వెళ్లినప్పుడు ఒకాయన...'మీరు అర్బన్ బ్యాక్‌డ్రాప్ సినిమాలు చక్కగా చేశారు. మన సంస్కృతిలో సినిమాలు ఎప్పుడు చేస్తారు'అని అడిగారు. అప్పుడు నాకు సిగ్గు అనిపించింది. ఇలాంటి సినిమా చేయాలని ఎప్పటినుండోఅనుకుంటున్నాను. ఇప్పటికి కుదిరింది. సినిమాలో రంగమ్మ మంగమ్మ... పాటలో ఉపయోగించిన గొల్లభామ అనే పదం ఓ కీటకానికి సంబంధించింది. ఎవరినీ ఏదో అనాలని ఆ పాట చేయలేదు. నా తొలి సినిమాలో ఐటమ్ సాంగ్ పెట్టినప్పుడు అది పెద్ద సక్సెస్ అయింది. అక్కడి నుండి ఐటమ్‌సాంగ్స్ తప్పనిసరిగా పెట్టాల్సి వస్తోంది. నవీన్‌కు ఐటమ్‌సాంగ్స్ అంటే ఇష్టం. ఆయనకు సినిమాలోని ఐటమ్‌సాంగ్ వినిపించాను. నిర్మాతల కు నచ్చడంతో ఐటమ్ సాంగ్ పెట్టాను'' అని చెప్పారు. పాటల రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ ''మంచి సాహిత్యానికి మంచి సంగీతం కుదిరింది. మంచి సినిమాలో అవకాశమిచ్చిన దర్శకనిర్మాతల కు థాంక్స్. దాదాపు అందరూ పల్లెటూర్ల నుండి వచ్చారు కాబట్టి వారికి పాటలు బాగా కనెక్ట్ అయ్యాయి. పాటలు చాలా బావున్నాయని అందరూ ప్రశంసిస్తున్నారు''అని తెలిపారు. ఆర్ట్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ''ఈ సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు థ్రిల్ అవుతారు. నేను నగరంలోనే పుట్టి పెరగడం వల్ల గ్రామీణ వాతావరణం తెలియదు. అయినా కూడా నేను రీసెర్చ్‌చేసి సెట్ వేశాను. నా కెరీర్‌లో బెస్ట్ మూవీగా నిలిచిపోతుంది''అని పేర్కొన్నారు. జగపతిబాబు,ప్రకాష్‌రాజ్, సీనియర్ నరేష్, ఆది పినిశెట్టి, అనసూయ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రత్నవేలు, ఎడిటింగ్: నవీన్ నూలి, ఫైట్స్:రామ్‌లక్ష్మణ్.



ప్రతీక్, శృతి, ప్రభుదేవా, విజయ్ తదితరులు

ప్రభుదేవా డ్యాన్సింగ్ లెజెండ్

ప్రభుదేవా, ఐశ్వర్య రాజేష్ తారాగణంగా ప్రమోద్ ఫిలింస్, ట్రైడెంట్ ఆర్ట్స్ బ్యానర్‌పై విజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'లక్ష్మి'. ప్రతీక్ చక్రవర్తి, శృతి నల్లప్ప, ఆర్.రవీంద్రన్ ఈ చిత్రానికి నిర్మాతలు. హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ప్రభుదేవా మాట్లాడుతూ ''దర్శకుడు విజయ్ నాకు సోదరుడితో సమానం. తనతో 'అభినేత్రి' సినిమా చేయడం గొప్ప అనుభవం. ఆతర్వాత మా కాంబినేషన్‌లో 'అభినేత్రి 2' సినిమా చేద్దామని కూడా అనుకున్నాం. ఆ సమయంలో ఈ స్క్రిప్ట్ వినగానే ఎంతో నచ్చింది. ఇలాంటి సినిమాకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చాలా ముఖ్యం. శామ్ అద్భుతమైన సంగీతాన్ని అందించాడు. డాన్స్ ఫిలిం చేయాలని విజయ్ అంటే ఓ రేంజ్‌లో చేయాలని అనుకున్నాను. నిర్మాతలు కూడా నా అభిప్రాయాన్ని అర్థం చేసుకొని సినిమా మేకింగ్‌లో ఎక్కడా రాజీపడలేదు. డాన్స్ సినిమాలు వచ్చి చాలా రోజులయ్యాయి. ఈ సినిమాలో నటించిన పిల్లలందరూ చాలా బాగా చేశారు. ఇండియా మొత్తం నుండి పిల్లలను ఎంపిక చేశాం. ఈ పిల్లలతో నటించడం మరచిపోలేని అనుభవాన్నిచ్చింది. నేను అన్నట్లుగానే సినిమా ఓ రేంజ్‌లో ఉంటుంది''అని అన్నారు. దర్శకుడు ఎ.ఎల్.విజయ్ మాట్లాడుతూ ''ప్రభుదేవా డాన్సింగ్ లెజెండ్. ఆయనతో ఎప్పుడు సినిమా చేసినా ఓ మంచి అనుభవం వస్తుంది. మంచి స్క్రిప్ట్‌సెన్స్ ఉన్న వ్యక్తి ప్రభుదేవా''అని తెలిపారు. శృతి నల్లప్ప మాట్లాడుతూ ''ప్రభుదేవాతో సినిమా చేయడం నా కల. ఈ సినిమాతో అది నెరవేరినందుకు ఆనందంగా ఉంది''అని పేర్కొన్నారు. ప్రతీక్ మాట్లాడుతూ ''మేము ప్రభుదేవాతో సినిమా చేయాలని ముందుగా ఏమీ ప్లాన్ చేసుకోలేదు. ఏదో అలా జరిగింది. భవిష్యత్తులో తెలుగు, తమిళంలో మరిన్ని సినిమాలు చేస్తాం'' అని తెలిపారు. బేబి దిత్యాబాండే, సల్మాన్ యూసఫ్‌ఖాన్, సోఫియా, కోవై సరళ, సత్యం రాజేష్, చామ్స్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నిరవ్ షా, డైలాగ్స్: సత్య, సాహిత్యం: వనమాలి, కొరియోగ్రఫీ: పరేశ్ సిరోద్కర్, రుయెల్ డౌసన్ వరిందని, స్టంట్స్: స్టంట్ సిల్వ, ఆర్ట్: ఎ.రాజేష్

మరో ప్రయోగాత్మక చిత్రంలో..



రానా

బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ 'బాహుబలి' రానాకు ఎంతో క్రేజ్‌ను తీసుకువచ్చింది. ఈ పాపులర్ స్టార్ ప్రస్తుతం కొత్త తరహా ప్రయోగాత్మక పాత్రలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నాడు. ఇప్పుడు రానా మరో ప్రయోగాత్మక చిత్రాన్ని చేయబోతున్నట్టు తెలిసింది. ఇటీవల సిద్ధార్థ్‌తో 'గృహం'లాంటి బ్లాక్‌బస్టర్ హారర్ మూవీ చేసిన దర్శకుడు మిలింద్‌రాయ్‌తో రానా సినిమా చేయబోతున్నాడట. మిలింద్ చెప్పిన స్టోరీలైన్ రానాకు బాగా నచ్చింది. అయితే ఇది హారర్ జోనరా లేదా ఇంకేదైనా కొత్త తరహా కథా చిత్రమా అనేది ఇంకా తెలియాల్సి ఉంది. మొత్తానికి ఇది కూడా ఓ ప్రయోగాత్మక చిత్రమని సమాచారం. ద్విభాషా చిత్రంగా ఇది తెరకెక్కనుంది. కానీ ఎప్పుడు ప్రారంభమవుతుందనేది మాత్రం ఇప్పుడే చెప్పలేం. ఈమధ్య యాంకరింగ్‌తో పాటు వెబ్ సిరీస్‌లు కూడా చేస్తున్న రానా ఎంతో బిజీగా ఉన్నాడు. తెలుగులో బిగ్‌బాస్ సీజన్ 2కు రానాను యాంకర్‌గా తీసుకునే ఆలోచనలో స్టార్ మా ఛానల్ ఉన్నట్టు సమాచారం.

నిఖిల్, సిమ్రాన్ పరీంజా, సంయుక్త హెగ్డే హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కిరాక్ పార్టీ'. ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రై.లి. బ్యానర్‌పై శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా అందాల తారలు సిమ్రాన్ పరీంజా, సంయుక్త హెగ్డేలు హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు.

మాది ట్రయాంగిల్ లవ్ స్టోరీ



సిమ్రాన్ పరీంజా చెప్పిన సినిమా విశేషాలు..

◆ చాలా అర్థం చేసుకున్నా...
'కిరాక్ పార్టీ'లో నా పాత్ర పేరు మీరా. కన్నడలో ఈ పాత్రను రష్మిక చేసింది. ఒరిజినల్ వర్షన్‌లోని ఆ పాత్రను చూసి నేను చాలా అర్థం చేసుకున్నాను. అయితే రష్మికను మాత్రం నేను ఫాలో కాలేదు.

◆ తేడా ఉంటుంది..
సినిమాలో నా పాత్ర కొత్తగా ఉండాలని ఫిల్మ్‌మేకర్స్ చెప్పారు. ఆ ప్రకారమే నేను చేశాను. రష్మికకు, నాకు మధ్య చాలా తేడా ఉంటుంది. తెలుగు నేటివిటీకి అనుగుణంగా ఈ సినిమా రూపుదిద్దుకుంది.

◆ బాగా ఎంజాయ్ చేశాను..
తక్కువగా మాట్లాడే అమ్మాయిగా కనిపిస్తాను. అలాగే సీరియస్‌గా ఉంటాను. ఎంత మంది అబ్బాయిలు వెంటపడ్డా కూడా పట్టించుకోను. షూటింగ్ సమయంలో ఈ పాత్ర చేస్తున్నప్పుడు బాగా ఎంజాయ్ చేశాను.

◆ ఫ్రెండ్లీగా ఉన్నాడు..
నిఖిల్‌తో నటించడం ఆనందంగా అనిపించింది. కొత్త హీరోయిన్‌ని అయినప్పటికీ అతను నాతో ఫ్రెండ్లీగా ఉన్నాడు. షూటింగ్ సమయంలో సరదాగా ఉండేవాడు. ఇక కెమెరా ముందు ఉన్నంతసేపు పాత్రలో లీనమైపోయి నటించేవాడు.

◆ కాలేజ్ డేస్ గుర్తుకు వస్తాయి..
ఇది పక్కా పైసా వసూల్ సినిమా. ఈ చిత్రం చూశాక ప్రతి ఒక్కరికి వారి కాలేజ్ డేస్ గుర్తుకు వస్తాయి. ప్రతి ఒక్కరు ఆ రోజులను స్క్రీన్ మీద చూసుకోవచ్చు. ఈతరం ప్రేక్షకులకు సినిమా తప్పకుండా నచ్చుతుంది. పూర్తి వినోదాన్నిచ్చే చిత్రమిది. ఫ్రెండ్స్ అందరూ కలిసి చూసేలా ఉంటుంది. .

సంయుక్త హెగ్డే చెప్పిన విశేషాలు..

◆ అందుకే తీసుకున్నారు..
కన్నడ 'కిరిక్ పార్టీ'లో నేను నటించాను. అక్కడ నా పాత్ర అందరికీ నచ్చింది. ఈ పాత్రలో నా అంత బాగా ఎవరూ నటించలేరని తెలుగు 'కిరాక్ పార్టీ'లో కూడా నన్ను తీసుకున్నారు.

◆ తపనతో చేశాను..
ఈ సినిమా విషయంలో నాకు నేనే పోటీగా ఉన్నాను. కన్నడ సినిమా కన్నా ఇక్కడ ఇంకా బాగా చేయాలనే తపనతో చేశాను. కన్నడలో ఇదే నా తొలి సినిమా. అదేవిధంగా తెలుగులోనూ ఇది నా మొదటి చిత్రం కావడం విశేషం.

◆ ఓ ట్విస్ట్ ఉంటుంది...
'కిరాక్ పార్టీ'లో నా పాత్ర పేరు సత్య. రియల్ లైఫ్ పాత్ర నాది. నిఖిల్‌తో ప్రేమలో పడతాను. సినిమాలో నిఖిల్ పేరు కృష్ణ. ఇది ట్రయాంగిల్ లవ్‌స్టోరీ. సినిమాలో ఓ ట్విస్ట్ ఉంటుంది. ఆ ట్విస్ట్ ఏమిటన్నది సినిమాలో చూడాల్సిందే.

◆ ప్రేక్షకులను మెప్పిస్తాను..
కన్నడలో కంటే తెలుగులో నా పాత్ర కాస్త హాట్‌గా కనిపిస్తుంది. నా పాత్రలో ప్రేక్షకులను మెప్పిస్తాను. ఇక కన్నడలో ఈ సినిమా చేసినప్పుడు నా వయసు 17 ఏళ్లు. ఇప్పుడు నా వయసు 19 ఏళ్లు. ఇక తెలుగులో స్వయంగా డబ్బింగ్ చెప్పుకున్నాను.

◆ మంచి ఆఫర్లు వస్తున్నాయి..
ఈ చిత్రం చేసిన తర్వాత టాలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు వస్తున్నాయి. ఇంకా దేన్నీ నేను అంగీకరించలేదు. ఈ సినిమా విడుదలయ్యాక కొత్త చిత్రాలకు సైన్ చేస్తాను.



ప్రియాంక చోప్రా

బయోపిక్ కోసం వస్తోంది

బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా పాపులారిటీ తెచ్చుకొని హాలీవుడ్‌కు వెళ్లిన హాట్ బ్యూటీ ప్రియాంక చోప్రా. హాలీవుడ్‌లోనూ రాణిస్తున్న ఈ భామ ప్రస్తుతం లాస్‌ఏంజిల్స్‌లో నివాసముంటోంది. క్వాంటికో సిరీస్‌తో ఆమెకు అమెరికాలో మంచి క్రేజ్ వచ్చింది. కొన్ని నెలలుగా అక్కడే ఉంటున్న ప్రియాంక చాలా కాలం తర్వాత మళ్లీ ఇండియాకు వస్తోంది. బాలీవుడ్‌లో మూడు నెలల పాటు ఓ సినిమా చేసి తిరిగి అమెరికా వెళ్లిపోతుందట. ఎంతో బిజీగా ఉన్న ప్రియాంక చాలా కాలం తర్వాత హిందీ సినిమాలో నటించనుంది. అయితే ప్రియాంక చేసే సినిమా గురించి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు. తాజా సమాచారం ప్రకారం నాసా శాస్త్రవేత్త కల్పనాచావ్లా బయోపిక్‌లో ఆమె నటించనుందట. ఏడాది క్రితం నుంచి దీనిపై చర్చలు జరుగగా చివరికి ప్రియాంక ఈ సినిమాలో నటించేందుకు ఓకే చెప్పింది. ఇక పంజాబ్‌లో పుట్టిన కల్పనాచావ్లా అక్కడే చదువుకుంది. ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లి అక్కడే నాసా శాస్త్రవేత్తగా స్థిరపడింది. అయితే ఆమె ప్రయాణించిన కొలంబియా వ్యోమనౌక పేలి 40 ఏళ్లకే మరణించింది. ఎంతో ఆసక్తికరంగా ఉండే కల్పనాచావ్లా బయోపిక్‌లో ప్రియాంకచోప్రా నటించనుండడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడడం ఖాయం.



తమన్నా

అవే ప్రత్యేక ఆకర్షణ

టీనేజ్ వయసులోనే హీరోయిన్ అయి కొంతకాలానికే స్టార్ ఇమేజ్‌ను తెచ్చుకున్న తార తమన్నా. సుదీర్ఘ కాలంగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నా ఇంకా ఈ మిల్కీబ్యూటీ వయసు 28 సంవత్సరాలే. తన అందచందాలు, గ్లామర్‌తో ప్రేక్షకులను మురిపిస్తోంది ఈ భామ. తన నడుము అందాలతో తమన్నా యువకుల మతులు పోగొడుతోంది. తాజాగా తమన్నాను మీలోని ప్రత్యేక ఆకర్షణ ఏంటో చెప్పండి అని అడిగితే... తన కళ్లే తన అట్రాక్షన్ అనేసింది. తమన్నాలో నడుము అందాలే ప్రత్యేక ఆకర్షణ అని చెప్పే అభిమానులకు ఇది ఆశ్చర్యాన్ని కలిగించింది. అయితే తనలో తన కళ్లే ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయని తమన్నా చెప్పడం విశేషం. ఇక అందమైన కళ్లు అంటే అప్పట్లో శ్రీదేవి... ఆతర్వాత ఐశ్వర్యారాయ్ గుర్తొచ్చేవారు. ఇప్పటివరకు తమన్నా అందమైన కళ్ల గురించి ఎవరూ పెద్దగా చెప్పుకోలేదు. కానీ తన కళ్లే తనకు అసలు సిసలైన అందం అని తమన్నా చెప్పేసింది.



టాటా చీఫ్ ఎథిక్స్ ఆఫీసర్ ముకుంద్ రాజన్ రాజీనామా

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ నుంచి టాటా సన్స్ చీఫ్ ఎథిక్స్ ఆఫీసర్ ముకుల్ గోవింద్ రాజన్ రాజీనామా చేశారు. టాటా సన్స్ ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. టాటా సంస్థ నుంచి వైదొలగడానికి ఆయన తన వ్యక్తిగత కారణాలను చూపారని సంస్థ పేర్కొంది. రాబోయే నెలల్లో ముకుంద్ వ్యాపారం రంగంలోకి ప్రవేశించే ప్రయత్నాల్లో ఉన్నారని, ఇందుకు గాను ఆయన సంస్థ నుంచి వైదొలిగారని టాటా గ్రూప్ పేర్కొంది. ముకుంద్ తన బాధ్యతలు సరిగ్గా నిర్వహించారని సంస్థ తెలిపింది. టాటా గ్రూప్‌తో అనుబంధ ఎంతో అద్భుతమైందని, తన పదవీ కాలంలో ఎన్నో నిర్ణయాలను తీసుకున్నామని, ఎల్లప్పుడు విలువలకు ప్రాధాన్యత నిచ్చే సంస్థ అని ముకుంద్ పేర్కొన్నారు. 49 ఏళ్ల ముకుంద్ టాటా గ్రూప్‌లో 23 ఏళ్లుగా సేవలందిస్తున్నారు. ఆయన సంస్థలో చైర్మన్‌లు రతన్ టాటా, సైరస్ మిస్త్రీ, ఎన్.చంద్రశేఖరన్ వంటి వారితో కలిసి పనిచేశారు. టాటా సంస్థలో అనేక కీలక పదవులను ఆయన నిర్వర్తించారు. 2000 సంవత్సరంలో టాటా టెలిసర్వీసెస్, విదేశ్ సంచార్ నిగమ్ బోర్డుల్లో నియమితులైన యువ డైరెక్టర్ ముకుంద్ కావడం విశేషం.

లాభాల స్వీకరణతో నష్టాలు

ముంబై: దేశీయ స్టాక్‌మార్కెట్లు మళ్లీ నష్టాలను నమోదు చేశాయి. గత కొద్ది రోజులుగా సూచీలు తీవ్ర ఒడిదుడుకులను లోనయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలతో పాటు మదుపర్ల అమ్మకాల ఒత్తిడితో సూచీలు డీలాపడ్డాయి. సెన్సెక్స్ 150 పాయింట్లు నష్టపోయి 33,685 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 50 పాయింట్ల పతనమై 10,400 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఉదయం 50 పాయింట్లకు పైగా నష్టంతో ప్రారంభమై ఆ తర్వాత కోలుకోలేకపోయింది. యూరోపియన్ మార్కెట్లు సానుకూలంగా ఉన్నప్పటికీ దేశీయంగా అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు నష్టాల నుంచి బయటపడలేకపోయింది. ప్రధానంగా ఏసియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోల్ ఇండియా, బజాజ్ ఫైనాన్స్, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ షేర్లు లాభపడ్డాయి. మరోవైపు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, యస్ బ్యాంక్, రిలయన్స్, గెయిల్, ఐసిఐసిఐ బ్యాంకు షేర్లు నష్టాలను నమోదు చేశాయి.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33685.54	−150.20	−0.44%
నిఫ్టీ	10360.15	−50.75	−0.49%

CLOSING SENSEX REPORT



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు) 22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29000	31016.04	−0.28%
ముంబై	29860	31935.83	0.44%
ఢిల్లీ	29800	31871.66	0.17%
కోల్‌కతా	30060	32149.73	0.27%
కేరళ	28250	30213.90	0%
బెంగళూరు	28600	30588.24	0.53%
హైదరాబాద్	29100	31122.99	−0.21%
గల్ఫ్	1412.08	1510.25	0.67%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	ఆదివారం	మార్పు (%)
చెన్నై	41400.00	41500.00	−0.24
ముంబై	41400.00	41500.00	−0.24
ఢిల్లీ	41400.00	41500.00	−0.24
కోల్‌కతా	41400.00	41500.00	−0.24
హైదరాబాద్	41400.00	41500.00	−0.24



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు


హైదరాబాద్	330	విశాఖపట్నం	330
వరంగల్	332	చిత్తూరు	362
విజయవాడ	322	చెన్నై	370
గోదావరి	322	బెంగళూరు	365



వాణిజ్య లోటు తగ్గింది..

ఫిబ్రవరిలో 12 బిలియన్ డాలర్లు నమోదు

న్యూఢిల్లీ: గత జనవరిలో భయపెట్టిన భారత వాణిజ్య లోటు ఈసారి ఊరటనిచ్చింది. ఫిబ్రవరి వాణిజ్య లోటు 12 బిలియన్ డాలర్లుగా ఉందని వాణిజ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఫిబ్రవరి వాణిజ్య లోటు తగ్గింది. అంతకుముందు మాసంలోని 16.3 బిలియన్ డాలర్లతో పోలిస్తే 12 బిలియన్ డాలర్లుగా ఉంది. కాగా ఫిబ్రవరి నెలలో దేశీయ ఎగుమతులు 25.8 బిలియన్ డాలర్లతో 4.5 శాతం పెరిగాయి. ఈమేరకు కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రీటా తియోతియా వివరాలను వెల్లడించారు. అదే సమయంలో దిగుమతులు 37.8 బిలియన్ డాలర్లు జరగ్గా.. 10.4 శాతం వృద్ధి నమోదైంది. ఏప్రిల్–ఫిబ్రవరి మధ్య కాలంలో దిగుమతులు 21 శాతం పెరిగి 416.87 డాలర్ల వ్యాపారం జరిగింది. ప్రధానంగా ముడి చమురు ధరలు పెరగడంతో దిగుమతులు పెరిగాయి. 4.5 శాతం పెరుగుదలతో 25.8 బిలియన్ల డాలర్ల ఎగుమతులను సాధించామని వాణిజ్య శాఖ కార్యదర్శి వెల్లడించారు. అలాగే జనవరి 24.3 బిలియన్ డాలర్ల ఎగుమతులతో పోలిస్తే ఫిబ్రవరి ఎగుమతులు 25.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఫిబ్రవరిలో దిగుమతులు 37.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. పెట్రోలియం, రసాయనాలు, వెండి, ముత్యాల దిగుమతి పెరగడంతో వాణిజ్య లోటు జనవరిలో ఐదు నెలల గరిష్ఠానికి చేరింది.



విదేశాలకు పారిపోకుండా ఆంక్షలు!

91 రుణ ఎగవేతదారుల జాబితా సిద్ధం

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే బ్యాంకు రుణాలను చెల్లించకుండా వ్యాపారవేత్తలు విజయ్ మాల్యా, నీరవ్ మోడీలు విదేశాలకు పారిపోయారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ఎగవేతదారులు విదేశాలకు పారిపోకుండా ప్రభుత్వం ఆంక్షలు విధించాలని యోచిస్తోంది. గతంలో జరిగిన తప్పులు మళ్లీ పునరావృతం కాకుండా బ్యాంకులకు భారీగా బకాయి బడిన వారి జాబితాను ప్రభుత్వం తయారుచేసినట్లు అధికార వర్గాల సమాచారం. బ్యాంకు రుణాలు ఎగవేయడంతోపాటు, మోసపూరిత లావాదేవీలకు పాల్పడిన కేసుల్లో నిందితులు, ఆ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు జాబితాలో ఉన్నారని తెలుస్తోంది. మొత్తం 400 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదార్లను గుర్తించగా.. వీరిలో 91 మంది ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుల జాబితాను తయారు చేశారని పేరు చెప్పడానికి నిరాకరించిన ఓ అధికారి తెలిపారు. జాబితాలోని వారు దేశం విడిచి వెళ్లకుండా నిషేధం విధించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సమాచారం. దీనిపై ఆర్థికశాఖ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. వేలకోట్ల రూపాయల ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన విజయ్‌మాల్యాను తిరిగి దేశానికి రప్పించేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటికీ ఫలించలేదు. ఇప్పుడు నీరవ్‌మోదీ, మెహుల్ చోక్సీ, రొటోమ్యాక్ కుంభకోణాలు సంచలనం రేపాయి.

2018–19లో వృద్ధి రేటు 7.3 శాతం

క్రెడిట్ రేటింగ్ సంస్థ ఫిచ్ అంచనా

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం(2018–19) దేశీయ ఆర్థిక వృద్ధి రేటును 7.3 శాతంగా రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ అంచనా వేసింది. ఆ తర్వాత 2019–20 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 7.5 శాతానికి పెరగొచ్చని పేర్కొంది. ఈ మేరకు ఫిచ్ తమ గ్లోబల్ ఎకనమిక్ అవుట్‌లుక్ నివేదికలో పేర్కొంది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2017–18) వృద్ధి రేటును 6.5 శాతం వరకు ఉండొచ్చని అంచనా వేస్తోంది. 2016లో పెద్దనోట్ల తర్వాత నగదు కొరత కారణంగా వృద్ధి మందగించింది. 2017 జూన్ నాటికి ఆర్థిక పరిస్థితులు తిరిగి మామూలు స్థితికి వచ్చాయని ఫిచ్ పేర్కొంది. ప్రస్తుతం నోట్ల రద్దుకు ముందు నగదు చలామణి మాదిరి పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు 2017 జులైలో దేశ చరిత్రలోనే అతిపెద్ద పరోక్ష పన్ను జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను)ని ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో ఇబ్బందులు తలెత్తినప్పటికీ నెమ్మదిగా నిలకడ స్థితికి చేరుకుంది. గతేడాది అక్టోబర్‌డిసెంబరు త్రైమాసికంలో వృద్ధిరేటు 7.2 శాతానికి పెరగడమే ఇందుకు నిదర్శనమని పేర్కొంది.



ముఖ్యంగా వ్యవసాయం, నిర్మాణం, తయారీ రంగంలో మంచి వృద్ధి నమోదైనట్లు నివేదికలో తెలిపింది. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ భారత్ వృద్ధికి సానుకూలంగా ఉందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బిఐ(రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) కీలక వడ్డీ రేట్ల పెంపును ప్రారంభించొచ్చని ఫిచ్ అంచనా వేస్తోంది. ప్రపంచ బ్యాంకు కూడా భారత్ వృద్ధి రేటు అంచనాలను ఇదేవిధంగా పెంచింది. 2018–19 ఆర్థిక సంవత్సరానికి భారత్ వృద్ధి రేటు అంచనాను 7.3 శాతంగా అంచనా వేసింది. అలాగే 2019–20 సంవత్సరానికి 7.5 శాతంగా ఉంటుందని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి ముగింపు నాటికి వృద్ధి రేటు 6.7 శాతంగా అంచనా వేసిన విషయం తెలిసిందే. నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు ప్రభావం నుంచి భారత్ ఆర్థిక వ్యవస్థ కోలుకోనుందని, నెమ్మదిగా వృద్ధి బాటలో పయనించనుందని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. 2016 నవంబర్‌లో ప్రభుత్వం పెద్ద నోట్లు రూ.500, రూ.1000లను రద్దు చేసింది. నల్లధనాన్ని నియంత్రించాలనే లక్ష్యంతో వీటి స్థానంలో కొత్త నోట్లను ప్రవేశపెట్టి చలామణిలోకి తీసుకొచ్చింది. ఆ తర్వాత దేశీయ చరిత్రలోనే అతిపెద్ద సంస్కరణ పరోక్ష పన్ను జిఎస్‌టిని ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ రెండు నిర్ణయాలు దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపినా.. నెమ్మదిగా వీటి సత్ఫలితాలు కనిపిస్తాయని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. 2017 ఏప్రిల్–జూన్‌లో దేశీయ వృద్ధి రేటు 5.7 శాతంతో మూడేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన విషయం తెలిసిందే.

తొలి బంధన్ బ్యాంక్ ఐపిఓ 42% సబ్‌స్క్రైబ్



న్యూఢిల్లీ: ప్రైవేటురంగ బంధన్ బ్యాంక్ రూ.4,473 కోట్ల ఐపిఓ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్) తొలి రోజు మంచి స్పందన వచ్చింది. మార్చి 15ను ఈ ఐపిఓ ప్రారంభమై 19వ తేదీన ముగుస్తుంది. క్యూఐబి(క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయర్స్)కు 1.26 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ కాగా.. సంస్థాగతయేతర ఇన్వెస్టర్లకు 1 శాతం, రిటైల్ ఇన్వెస్టర్లు 12 శాతం రిజర్వు చేశారు।సుకున్నారు. ఈ ఐపిఓ మొత్తం 8,34,96,347 షేర్లకు గాను 3,50,05,200 షేర్ల బిడ్‌ను అందుకుందని ఎన్‌ఎస్‌ఇ వెల్లడించింది. కాగా ఈ ఐపిఓకు ధరల శ్రేణిని రూ.370–375గా నిర్ణయించారు. ఐపిఓ విలువ రూ.4,473 కోట్లు.. ఇటీవల ఐపిఓలకు వచ్చిన స్థానిక బ్యాంకుల్లో బంధన్ బ్యాంక్‌దే అత్యధికం కావడం విశేషం. కోటక్ మహీంద్రా క్యాపిటల్, యాక్సిస్ క్యాపిటల్, గోల్డ్‌న్ సాచస్, జేఎం ఫైనాన్షియల్స్, జేపీ మోర్గాన్‌లు ఐపిఓ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. 2015లో వ్యాపారాన్ని ప్రారంభించిన బంధన్ బ్యాంక్.. చిన్నమొత్తాలను రైతులకు రుణాలుగా అందజేస్తుంది.

ఆర్‌పి ఇన్ఫోసిస్టమ్ డైరెక్టర్ల అరెస్ట్

న్యూఢిల్లీ : కోల్‌కతా కంప్యూటర్ ఉత్పత్తుల సంస్థ ఆర్‌పి ఇన్ఫోసిస్టమ్ డైరెక్టర్లను సిబిఐ అరెస్ట్ చేసింది. కెనరా బ్యాంకుతోపాటు మరో తొమ్మిది బ్యాంకులకు రూ.515 కోట్ల మోసానికి పాల్పడిన ఆరోపణల నేపథ్యంలో సిబిఐ ఈ చర్యలు చేపట్టింది. గురువారం ఈ సంస్థ డైరెక్టర్లు శివాజీ పంజా, కౌస్తవ్ రాయ్‌లను అదుపులోకి తీసుకుంది. ఈ కుంభకోణంపై గతనెల 26న ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన సిబిఐ సంస్థ కార్యాలయం సహా ఆరుచోట్ల ఇప్పటికే దాడులు నిర్వహించారు. ఆర్పి ఇన్ఫో సిస్టమ్స్ డైరెక్టర్లైన శివాజీ పంజా, కౌస్తవ్ రాయ్, వినయ్ బాఫ్నా, ఫైనాన్స్ వైస్ ప్రెసిడెంట్ దేవ్‌నాత్ పాల్‌తో పాటు పలువురు బ్యాంకు అధికారులపై కేసు నమోదు చేశారు. రూ.515.15 కోట్ల మోసం జరిగిందంటూ కెనరాతోపాటు తొమ్మిది బ్యాంకుల కన్సార్షియం సిబిఐకి ఫిర్యాదు చేసింది. దీని ఆధారంగా రంగంలోకి దిగిన సిబిఐ వెంటనే బాధ్యులపై మోసం, నేరపూరిత కుట్ర కేసు నమోదు చేసింది.

రిస్క్ మేనేజ్‌మెంట్ యంత్రాంగం

- పిఎన్‌బి తరహా మోసాలను నియంత్రించడమే లక్ష్యం
- ఆరు నెలల్లో ఏర్పాటు చేయాలని బ్యాంకర్ల నిర్ణయం

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)లో నీరవ్ మోడీ రూ.13 వేల కోట్ల మోసం కేసు నేపథ్యంలో బ్యాంకర్లు అప్రమత్తమవుతున్నారు. భవిష్యత్‌లో ఇలాంటి మోసాలు జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు ఆరు నెలల్లో సమర్థవంతమైన రిస్క్ మేనేజ్‌మెంట్ యంత్రాంగాన్ని తీసుకురావాలని బ్యాంకర్లు నిర్ణయించారు. అయితే పిఎన్‌బి మాత్రమే ఎల్‌ఓయు(లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్)ను అక్రమ పద్ధతిలో జారీ చేసిందని, ఇతర ఏ ప్రభుత్వరంగ బ్యాంక్ ఇలాంటి చర్యలకు పాల్పడలేదని గుర్తించామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ ఎండి ఎంఎస్ శాస్త్రి తెలిపారు. మూడు రోజుల చర్చల తర్వాత మీడియాతో ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుల బోర్డులు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నాయని, మూడు నుంచి ఆరు నెలల్లో ఇది సిద్ధమవుతుందని అన్నారు. ఆ తర్వాత దీని బ్యాంకులు అమలు పరచాలని చెప్పారు.

కాగా పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో కుంభకోణం నేపథ్యంలో ఎల్‌ఓయులను జారీ చేయకుండా ప్రభుత్వరంగ బ్యాంకులపై ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) నిషేధం విధించింది. ఈ సందర్భంగా ఎల్‌ఓయూల జారీపై ప్రభుత్వ రంగ అతిపెద్ద బ్యాంకు ఎస్‌బిఐ స్పందిస్తూ.. పంజాబ్ నేషనల్ బ్యాంక్ మినహా ఇంతవరకు ఏ బ్యాంకు నకిలీ ఎల్‌ఓయులను జారీ చేయలేదని, అనధికారిక ఎల్‌ఒసిలు(లెటర్ ఆఫ్ క్రెడిట్) గానీ ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు బ్యాంకు సీనియర్ అధికారులు మీడియాకు వెల్లడించారు. బ్యాంకులు జారీ చేసే ఎల్‌ఓయు ద్వారా ఖాతాదారులు విదేశాల్లోని భారతీయ బ్యాంకుల శాఖల నుంచి రుణాలు పొందే అవకాశం ఉంది. పిఎన్‌బిలో మోసం ఈ ఎల్‌ఓయుల ద్వారానే జరిగింది. ఆఖరికి కుంభకోణం వెలుగులోకి వచ్చింది. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, ఆయన బంధువు మెహుల్ ఛోక్సీ తదితరులు అక్రమంగా బ్యాంకు నుంచి ఎల్‌ఓయులు పొంది వేల కోట్ల రూపాయల రుణాలు పొందారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ కుంభకోణం సంచలనంగా మారింది. నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీలు విదేశాలకు పారిపోగా.. వీరు ఎక్కడ ఉంటున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రూ.50కోట్లకు పైబడి బ్యాంకు రుణాలు పొందాలంటే ఆ ఖాతాదారులు పాస్‌పోర్టు వివరాలను అందించడం తప్పనిసరని ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఎగవేతదారులు విదేశాలకు పారిపోకుండా ఆంక్షలు విధించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సమాయత్తమవుతోంది.



సిబిఐ మరో మోసం కేసు నమోదు

వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, ఆయన మామ మెహుల్ చోక్సీల మోసం కేసు లాంటిదే పిఎన్‌బి బ్రాడి హౌస్ బ్రాంచ్ వద్ద మరో స్కామ్ బయటపడింది. రూ.9 కోట్ల ఎల్‌ఓయు(లెటర్ ఆప్ అండర్ టేకింగ్) అక్రమంగా జారీ చేశారంటూ సిబిఐ మరో కేసును నమోదు చేసింది. నీరవ్, మెహుల్ చోక్సీ కేసులో సిబిఐ విచారణను ఎదుర్కొంటున్న రిటైర్డ్ పిఎన్‌బి ఉద్యోగి గోకుల్‌నాథ్ షెట్టి, బ్రాంచ్ సింగిల్ విండో ఆపరేటర్ మనోజ్ ఖారత్‌లపై తాజాగా సిబిఐ ఎఫ్‌ఐఆర్ రిజిస్టర్ చేసింది.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
ఎసియన్ పెయింట్స్	1,163.75	1,132.15	1,160.80	1,137.00	23.80	2.09
బజాజ్ ఫైనాన్స్	1,739.90	1,714.00	1,726.25	1,710.10	16.15	0.94
ఎంఅండ్ఎం	737.90	729.80	734.85	728.20	6.65	0.91
ఇండియాబుల్స్	1,242.00	1,223.80	1,237.95	1,226.90	11.05	0.90
హెచ్‌డిఎఫ్‌సి	1,887.50	1,865.20	1,880.80	1,864.50	16.30	0.87
కోల్ ఇండియా	298.90	292.10	295.50	293.10	2.40	0.82
ఇండస్‌ఇండ్ బ్యాంకు	1,750.00	1,724.00	1,741.75	1,733.35	8.40	0.48
యుపిఎల్	727.60	717.45	721.15	718.35	2.80	0.39
కోటక్ మహీంద్ర	1,091.95	1,078.65	1,085.65	1,081.75	3.90	0.36
పవర్‌గ్రిడ్ కార్ప్	195.75	193.80	194.80	194.35	0.45	0.23

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
ఐఓసి	193.25	189.25	192.05	197.53	5.48	2.77
ఎస్ బ్యాంకు	321.00	310.85	311.85	318.85	7.00	2.20
రిలయన్స్	929.45	910.00	911.80	929.05	17.25	1.86
గెయిల్	458.75	448.40	450.35	458.00	7.65	1.67
ఐసిఐసిఐ బ్యాంకు	305.75	300.40	301.45	306.05	4.60	1.50
బోస్క్	18,317.10	18,000.00	18,025.20	18,284.30	259.10	1.42
టాటాస్టీల్	622.60	609.60	611.75	620.55	8.80	1.42
ఎస్‌బిఐ	258.80	252.55	253.70	257.05	3.35	1.30
హెచ్‌యుఎల్	1,320.00	1,294.25	1,299.95	1,316.90	16.95	1.29
యాక్సిస్ బ్యాంకు	539.20	528.25	529.65	536.15	6.50	1.21



ఆరోగ్య తెలంగాణ సాధనే లక్ష్యంగా..



మన తెలంగాణ/హైదరాబాద్ : ఆరోగ్య తెలంగాణ సాధనే లక్ష్యంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అన్నారు. సిఎం కెసిఆర్ మనోభిప్రాయాలకు ఈ బడ్జెట్ అద్దం పడుతోందన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై మంత్రి స్పందిస్తూ, ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారని తెలిపారు. ప్రస్తుత బడ్జెట్‌లోని కేటాయింపులతో ఆరోగ్య తెలంగాణను సాధించి తీరుతామన్నారు. అమ్మ ఒడి పథకానికి అదనంగా రూ. 561 కోట్లు ఇచ్చారన్నారు. దీంతో మందులు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు, ఆధునీకరణ, కొత్త నియామకాలు వంటివన్నీ పూర్తవుతాయని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. అలాగే హెల్త్ ప్రొఫైల్ పథకాన్ని సీఎం కేసీఆర్ సభలోనే ప్రకటించారని తెలిపారు.

ఉజ్వల భవితకు ఊపిరి

రాష్ట్ర బడ్జెట్ పెట్టుబడి రూ. 1,74,453.84కోట్లు



మన తెలంగాణ / హైదరాబాద్ : ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ 2018–19 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌ను గురువారం శాసనసభలో ప్రవేశపెట్టారు. సుమారు గంటన్నర పాటు సాగిన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలతో పాటు రైతులకు సంవత్సరానికి రూ. 8,000 (ఎకరానికి) చొప్పున ఇచ్చే 'రైతులక్ష్మి' పంట పెట్టుబడి పథకానికి రూ. 12,000 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రానున్నది ఎన్నికల సంవత్సరం కావడంతో సంక్షేమానికి, అభివృద్ధికి తగిన ప్రాధాన్యత కల్పించారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఈటల రాజేందర్ సమర్పించిన ఐదవ పూర్తిస్థాయి బడ్జెట్ ఇది. వ్యవసాయం, విద్య, వైద్యం, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమానికి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 16.6% వృద్ధితో మొత్తం రూ. 1,74,453.84 కోట్ల మేరకు బడ్జెట్ అంచనాలను సభకు సమర్పించారు. మొత్తం ఆదాయం సుమారు రూ. 1,74,482.28 కోట్ల మేరకు సమకూరనుందని, ఇందులో కేంద్రం నుంచి రూ. 29,041 కోట్ల మేరకు పన్నుల వాటా, గ్రాంట్ల రూపంలో సమకూరనుందని మంత్రి పేర్కొన్నారు. మొత్తం రూ. 5,520 కోట్ల రెవిన్యూ మిగులు బడ్జెట్‌ను అంచనా వేశారు. ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 16.9% పెరుగుదలతో రూ. 1, 74,482.28 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. మొత్తం ద్రవ్యలోటు రూ. 29,077 కోట్ల మేరకు (రాష్ట్ర జిడిపిలో 3.45%) ఉంటుందని అంచనా వేశారు. శాసన మండలిలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అన్ని రంగాల అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమానికి ఉపయోగపడేలా పూర్తి సమతుల్యం ఈ బడ్జెట్‌లో ప్రతిబింబించిందని, ప్రణాళికలను సమర్ధవంతంగా అమలుచేయడానికి ఆస్కారం ఏర్పడిందని ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యాఖ్యానించి ఆర్థిక మంత్రిని, కార్యదర్శిని, సలహాదారును అభినందించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేవలం 45 నెలల వ్యవధిలోనే చీకటి నుంచి వెలుగులోకి, అపనమ్మకం నుంచి ఆత్మవిశ్వాసంలోకి, అణగారిన స్థితి నుంచి అభ్యున్నతికి, వలస బతుకుల నుంచి వ్యవసాయ ప్రగతి వైపు ప్రయాణించామని, ఆర్థిక వృద్ధిలో జాతీయ సగటుకంటే, ఇతర రాష్ట్రాల్లోని ప్రగతి కంటే తెలంగాణ ఎంతో ముందుందని మంత్రి తన ప్రసంగంలో పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో 2013– 14లో కేవలం 5.4% మాత్రమే ఉన్న జిడిపి వృద్ధిరేటు రాష్ట్రం ఏర్పడడంతోనే 6.8%కి పెరిగి ప్రస్తుతం రెండంకెలకు (10.4%) చేరుకుందని తెలిపారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్టి అమలు వల్ల ప్రారంభంలో ప్రతికూల పరిణామాలను ఎదుర్కొన్నప్పటికీ ప్రస్తుతం నిలదొక్కుకున్నామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉత్పత్తి (తయారీ) రంగంలో వృద్ధిరేటు తిరోగమనంలో ప్రయాణించేందని రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే 6.4% వృద్ధి సాధించి ఇప్పుడు 7.6%కి చేరుకున్నామని తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగంలో సైతం 6.9%కి చేరుకున్నామని, 24 గంటలూ విద్యుత్‌ను సరఫరా చేయగలుగుతున్నామని, ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిస్తే ఈ వృద్ధి ఇంకా పెరుగుతుందన్నారు. గత ఆర్థిక సంవత్సరం మన రాష్ట్ర జిడిపి (స్థూల ఉత్పత్తి) రూ. 6,41,985 కోట్లు ఉంటే ఈసారి (2017–18) అది రూ. 7,32,657 కోట్లకు చేరుకుందని, 14.1% వృద్ధి నమోదైందని తెలిపారు.

పెరిగిన తలసరి ఆదాయం : రాష్ట్ర తలసరి ఆదాయం కూడా ఏటేటా మెరుగుపడుతోందని, ప్రస్తుత ధరల సూచి ప్రకారం 2016–17లో రూ.1,54,734గానమోదైందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అది రూ. 1,75,534కు పెరిగినట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు. గతేడాదితో పోలిస్తే 13.4% వృద్ధి సాధించామని, జాతీయ స్థాయి సగటు రేటు కేవలం 8.6% మాత్రమేనని గుర్తుచేశారు. విధానాలను రూపొందించడంలో, ప్రజానుకూల సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడంలో వచ్చిన గుణాత్మక మార్పు వల్లనే ఇది సాధ్యమైందని, మనకున్న వనరులు, అవసరాలను సరిగ్గా అంచనా వేసుకోవడం, దానికి అనుగుణంగా ప్రణాళికలను రచించడంవల్లనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలోని వ్యవసాయ రంగానికి పెద్దగా ప్రాధాన్యత లభించనందువల్ల సంక్షోభం ఎదుర్కొన్నదని, ఆ కారణంగా రైతులకు రుణభారం పెరిగిందని, తెలంగాణ ఏర్పడిన తర్వాత 35.29 లక్షల మంది రైతులకు రూ. 16,124 కోట్ల మేర మాఫీ చేశామని గుర్తుచేశారు. మరోవైపు చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంచడంతో పాటు పొలాలకు సాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా వ్యవసాయం గాడిలో పడిందని, విత్తనాల సమయంలోనే పంట పెట్టుబడిగా ఎకరానికి ఒక్కో సీజన్‌కు రూ. 4000 చొప్పున మొత్తం రైతాంగానికి రెండు సీజన్‌లకు రూ. 8000 చొప్పున ఈ బడ్జెట్‌లో రూ. 12,000 కోట్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు.

స్వల్పంగా తగ్గిన ఆదాయం : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాల ప్రకారం మొత్తం ఖర్చును రూ. 1,42,506 కోట్లుగా అంచనావేశామని, ఇందులో రెవిన్యూ వ్యయం రూ.1,06,603 కోట్లుకాగా, మిగిలిన రూ. 25,447 కోట్లు క్యాపిటల్ వ్యయం అని మంత్రి ఈటల తెలిపారు. గతేడాది జూలై నుంచి అమలులోకి వచ్చిన జిఎస్టి వల్ల ప్రారంభంలో చాలా ప్రతికూల పరిణామాలను ఎదుర్కొన్నామని, ఆదాయం పెరుగుదలలో స్వల్ప తరుగుదల కనిపించిందని పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి బడ్జెట్‌లో రాష్ట్ర స్వంత ఆదాయం సుమారు 20% మేర పెరగనుందని పేర్కొన్నారు. కేంద్రం నుంచి గతేడాది రూ. 26,857 కోట్ల మేరకు పన్నుల వాటా, గ్రాంట్ల రూపంలో ఆర్థికసాయం సమకూరగా రానున్న ఆర్థిక సంవత్సరంలో ఇది రూ. 29,041 కోట్ల మేరకు వుండవచ్చని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలను అమలుచేసే కార్పొరేషన్లు బడ్జెట్‌తో సంబంధం లేకుండా నిధులు సమకూర్చుకుంటున్నందున మొత్తం వ్యయం బడ్జెట్‌లో ప్రతిపాదించినదానికంటే ఎక్కువే ఉండవచ్చని మంత్రి సూచించారు.రానున్న బడ్జెట్‌లో ద్రవ్య లోటు రూ. 29,077 కోట్లు (రాష్ట్ర జిడిపిలో 3.45%) ఉండనున్నట్లు అంచనా వేస్తున్నామని, కార్పొరేషన్లు తీసుకునే రుణాలను బట్టి ఇందులో మార్పు ఉండవచ్చని సంకేతం ఇచ్చారు. అనేక ప్రతికూల పరిస్థితులు, అస్పష్టతలు, అనుమానాలు, సవాళ్ళ మధ్య ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం 45 నెలల కాలంలోనే అనేక విషయాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచే స్థాయికి ఎదిగిందని, ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల కల్పన, పాలనా సంస్కరణలు అనేక రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా నిలిచాయని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందనే ఆత్మవిశ్వాసం ఏర్పడిందని, ఆ విశ్వాసమే ప్రాతిపదికగా, బంగారు తెలంగాణ నిర్మాణమే ధ్యేయం గా రాష్ట్ర ప్రజలందరి సమగ్రాభివృద్ధి కోసం ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు మంత్రి వివరించారు.

రైతు బీమా పథకం


రాష్ట్రంలో వ్యవసాయంమీద ఆధారపడున్నవారిలో చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ సంఖ్యలో ఉన్నందువల్ల వారికి జీవితబీమా సౌకర్యం కల్పించాలని భావించి ఈ బడ్జెట్‌లో రూ. 500 కోట్లను కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వ్యవసాయ రంగంలో కూలీ కార్మికుల కొరతను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వ, యాంత్రికీకరణ ఆవశ్యకతను గుర్తించి రూ. 522 కోట్లను ఈ బడ్జెట్‌లో కేటాయించింది. ట్రాక్టర్ల మొదలు తార్పాలిన్లు, స్ప్రేయర్లు, నాట్లు వేసే మిషన్లు.. ఇలా సబ్సిడీ ధరలపై రైతులకు అందించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. బిందు సేద్యం కొరకు రూ. 127 కోట్లను, పాలీహౌస్, గ్రీన్ హౌజ్ పథకాలకు రూ. 120 కోట్లను మంత్రి కేటాయించారు. ప్రతి మండలంలో ఒక గోదామును నిర్మించే తీరులో మొత్తం రూ. 132 కోట్లను కేటాయించారు. సాగునీటి రంగానికి యథావిధిగా రూ.25,000కోట్లను కేటాయించారు. గ్రామీణ స్థానిక సంస్థల పరిపుష్టికి రూ. 1500 కోట్లను, పట్టణ, స్థానిక సంస్థలఅభివృద్ధికి రూ.1000కోట్లను కేటాయించారు.

బడ్జెట్‌పై ఎవరేమన్నారు

బిసిలకు పెద్దపీట: మంత్రి జోగురామన్న

మన తెలంగాణ/హైదరాబాద్ : బడ్జెట్‌లో బిసిలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని బిసి సంక్షేమం, అటవీ, పర్యావరణశాఖల మంత్రి జోగురామన్న అన్నారు. తెలంగాణలో బిసిలకు స్వర్ణయుగం వచ్చిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కన్నా స్వరాష్ట్రంలో బిసి సంక్షేమశాఖ బడ్జెట్ మూడింతలు పెరిగిందని తెలిపారు. ప్రస్తుత బడ్జెట్‌లో బిసి సంక్షేమశాఖకు రూ. 5,920 కోట్లు ప్రతిపాదించారన్నారు. గతేడాది సంక్షేమ బడ్జెట్ రూ. 5070కోట్లు కాగా ప్రస్తుతం 850కోట్లు పెరిగిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నడూ కూడా రెండువేల కోట్లు దాటలేదన్నారు. తెలంగాణలో బిసిలంతా సంతోషంగా ఉన్నారని, బంగారు తెలంగాణ వైపు అడుగులు వేస్తున్నారని ఆయన చెప్పారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు



మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రతి ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలా లు చేరాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినట్లు స్పష్టంగా కనిపిస్తోందని టిఆర్ఎస్ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. 2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై కర్నె ప్రభాకర్ స్పందించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు చేస్తున్న హామీలను త్రికరణ శుద్ధిగా అమలు చేసే దిశగా ఈ బడ్జెట్ ఉందని ఆయన వ్యాఖ్యానించారు. రైతాంగం కోసం రూ. 15 వేల కోట్లు కేటాయించిన చరిత్ర గతంలో ఎన్నడన్నా జరిగిందా? అని ఎంఎల్‌సి ప్రభాకర్ ప్రశ్నించారు. వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, 130 కోట్ల నిధిని ఏర్పాటు చేయడమే కాకుండా ఈ సారి రూ. 70 కోట్ల బడ్జెట్‌ను కేటాయించడమే ఇందుకు నిదర్శనమన్నారు.

పట్టణాలాభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ హర్షణీయం




అభివృద్ధి చెందుతున్న పట్టణాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిం చిందని, హైదరాబాద్ తర్వాత ద్వితీయ శ్రేణి నగరాల అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షణీయమనినిజామాబాద్ అర్బ న్ టిఆర్ఎస్ ఎంఎల్ఏ గణేశ్ గుప్తా అ న్నారు. వరంగల్ నగర అభివృద్ధి కోసం రూ.300 కోట్లు, అలాగే పలు ఇతర నగరాల కోసం వంద కోట్లు కేటాయించారని ఆయన అన్నారు.సాగునీటి పారుదల ప్రాజెక్టులను అనుకున్న సమయంలోనే పూర్తి అవుతాయన్న భరోసాను ఆర్థిక మంత్రి ఈటల తన బడ్జెట్ ద్వారా చెప్పకనే చెప్పారన్నారు.

జీత భత్యాల కోసం రూ.10 కోట్లు



హోంగార్డులు, ఆశావర్కర్ల జీత భత్యాలను పెంచడంతో పాటు వారి సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.10కోట్లను కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని టిఆర్ఎస్ ఎంఎల్ఏ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆర్థికశాఖమంత్రి ఈటల ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఉపయోగపడేలా ఉందన్నారు. సమైక్య రాష్ట్రంలో బడ్జెట్ కేటాయింపులు, ఇప్పటి కేటాయింపులు చూస్తే ఎవరికైనా ఈ విషయం అర్థమవుతోందన్నారు.

బడ్జెట్ పుస్తకంలో 'ఆంధ్రప్రదేశ్'



మన తెలంగాణ / హైదరాబాద్ : మన రాష్ట్రానికి సంబంధించిన బడ్జెట్ వివరాలను తెలియజేసే పుస్తకంలో 'తెలంగాణ' అని ఉండాల్సిన చోట'ఆంధ్రప్రదేశ్' అని అచ్చయింది.'2018–19) బడ్జెట్అంచనాలు, రెవిన్యూ రాబడులు సవివరమైన అంచనాలు' అనే పేరుతో ముద్రించిన రెండవ సంపుటంలో రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా ఎక్కడి నుంచి ఎంతెంత ఆదాయం వస్తుందో ప్రభుత్వం వివరించింది. ఆ పుస్తకంలో ఆరవ పేజీలో చివరన మొత్తం రూ. 1,71,982,28.34 లక్షలు అనే చోట 'టోటల్ కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ది స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అని ప్రచురితమైంది. వాస్తవానికి ఇది తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అంశం. కానీ ఏ రకంగా జరిగిందోగానీ పొరపాటును అక్కడ 'ఆంధ్రప్రదేశ్' అని అచ్చయింది. అధికారులు కూడా దీన్ని గమనించకపోవడం గమనార్హం.

బడ్జెట్‌లో ప్రధాన కేటాయింపులు

రైతు బీమా పథకం	రూ. 500 కోట్లు
వ్యవసాయ యాంత్రీకరణ	రూ. 522 కోట్లు
బిందు తుంపర సేద్యం	రూ. 127 కోట్లు
విద్యుత్	రూ. 5,650 కోట్లు
హోంశాఖ	రూ. 5,790 కోట్లు
సాంకేతిక విద్య	రూ. 95 కోట్లు
మహిళా శిశు సంక్షేమం	రూ. 1799 కోట్లు
చేనేత జౌళి	రూ. 1200 కోట్లు
పరిశ్రమల శాఖ	రూ. 1,286 కోట్లు
ఐటీ శాఖ	రూ. 289 కోట్లు
పురపాలక శాఖ	రూ. 7,251 కోట్లు
ఎంబీసీ కార్పొరేషన్	రూ. 1000 కోట్లు
మిషన్ భగీరథ	రూ. 1,081 కోట్లు
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	రూ. 15,563 కోట్లు
దళితులకు 3ఎకరాల భూ పంపిణీని	రూ. 1469 కోట్లు
ఎస్టీల సంక్షేమం	రూ. 8,063 కోట్లు
బీసీల సంక్షేమం	రూ. 5,920 కోట్లు
గ్రామీణ స్థానిక సంస్థలు	రూ. 1500 కోట్లు
పట్టణాభివృద్ధి	రూ. 1000 కోట్లు
ఆసరా పింఛన్లు	రూ. 5,366 కోట్లు
కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్	రూ. 1450 కోట్లు
డబుల్ బెడ్ రూం ఇండ్లకు	రూ. 2,643 కోట్లు
కోళ్ల పరిశ్రమ అభివృద్ధి	రూ. 109 కోట్లు
ప్రస్తుత ఆర్థిక (2017–18) సంవత్సరానికి సవరించిన అంచనాలు	
మొత్తం ఖర్చు	రూ. 1,42,506 కోట్లు
రెవెన్యూ వ్యయం	రూ. 1,06,603 కోట్లు
మూలధన వ్యయం	రూ. 25,447 కోట్లు

100కు 100% ఖర్చు చేస్తాం

● **రాబడి కొంత ప్రతికూలంగా ఉన్నా..**
ఇప్పుడు పర్వాలేదు : ఈటల



మంత్రి ఈటల రాజేందర్ గురువారం శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఆయనకు తన ఛాంబర్‌లో మిఠాయి తినిపించి అభినందనలు తెలియజేస్తున్న ఆయన కూతురు నీత, కోడలు క్షమిత

మన తెలంగాణ/ హైదరాబాద్ : 'బడ్జెట్‌లో నిధులు పెడుతున్నారే తప్ప ఖర్చు చేయడం లేదనడం తప్పు. 2017–18లో రూ.1.49 లక్షల కోట్ల బడ్జెట్ పెడితే రూ.1.42 లక్షల కోట్ల వరకు ఖర్చు చేశాం. అంటే 95 శాతం ఖర్చయింది. 2018–19 బడ్జెట్‌లో రూ.1.74 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టాం.వీటిని వందకు వంద శాతం ఖర్చు పెడతామనే విశ్వాసం ఉంద'ని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. జిఎస్‌టి కారణంగా పన్ను రాబడి కొంత ప్రతికూలంగా ఉన్నా, ఇప్పుడు పర్వాలేదని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో పన్ను విస్తృతి, ఆదాయం పెరుగుతుందని, కాబట్టి కేటాయింపులకు అనుగుణంగా ఖర్చు చేస్తామని వివరించారు. శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బడ్జెట్‌పై ఆయన మాట్లాడారు. వ్యవసాయం, నీటి పారుదల, విద్యుత్ రంగాలకు దాదాపు 26 శాతం బడ్జెట్ నిధులు కేటాయించామని, దేశంలో ఎక్కడా వ్యవసాయం, అనుబంధ రంగాలకు ఇంత పెద్ద ఎత్తున కేటాయించలేదని చెప్పారు. రాష్ట్రంలో ఏ కుటుంబమైనా, ఏ వర్గమైనా ఆపదలో ఉండే ఆదుకునే తండ్రిలా ప్రభుత్వం ఉందనే విధంగా బడ్జెట్ ఎదిగిందని చెప్పారు. బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ముందు గత రెండు నెలలుగా దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లను, ఆర్థిక ప్రగతి, కేంద్ర బడ్జెట్‌లను ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో పరిశీలించామన్నారు. వాటి ఆధారంగా బడ్జెట్ వాస్తవాలకు దగ్గరగా, స్పష్టంగా ఉండేలా రూపకల్పన జరిగిందన్నారు.

బిసిలకు నిధులు కొంత ఖర్చు లేదు : బిసి, ఎంబిసి సంక్షేమానికి సమయం సరిపోక కొంత నిధులు కేటాయించలేకపోయామని, ఈ సారి మొదటి త్రైమాసికం నుండి నిధులు ఇస్తామని ఆర్థిక మంత్రి ఈటల వివరించారు. బిసిలను ఉత్పత్తి కులాలు , సేవాల కులాలుగా విభజించి, వారికి అవసరమైన పరికరాలు, రుణాలను అందజేస్తామన్నారు.గతంలో హామీ ఇచ్చిన బిసి సబ్ ప్లాన్ గురించి బడ్జెట్‌లో ఊసే లేదని ప్రశ్నించగా, అన్ని లెక్కలు వేసాక బిసి సబ్ ప్లాన్ కంటే కూడా వివిధ పథకాల ద్వారా ఎక్కువే లబ్ది కలుగుతుందని భావించామని చెప్పారు. బడ్జెట్‌లో ఎక్కువ భాగం పేదల కోసమే ఉన్నదని, రైతు పెట్టుబడి పథకం, ఉచిత విద్యుత్, వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలే లబ్ధి పొందుతున్నారని ఈటల చెప్పారు. చివరకు అగ్రవర్ణ పేదల కోసం కూడా వివిధ పథకాల్లో లబ్ది చేకూరుస్తున్నామని తెలిపారు. రాష్ట్ర స్వంత పన్ను వనరుల్లో 22.84 శాతం వృద్ధి నమోదైందని, విద్య విషయంలో రాష్ట్రం నిర్ధిష్టమైన ప్రణాళికతో దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలు స్తోందన్నారు. రాష్ట్రంలో రైతులకు రూ.5లక్షల బీమా పథకాన్ని ప్రవేశపెట్టా మని, ఇప్పటికే అసంఘటిత కార్మికులకు కూడా బీమా ఉన్నదని, దీంతో రాష్ట్రంలో 1.03 కోట్ల కుటుంబాలలో 95 లక్షల కుటుం బాలు ఈ పథకాల కింద ప్రయోజనం పొందుతాయన్నారు. తెలంగాణలో కుటుంబ పెద్ద మర ణిస్తే, ఏ కుటుంబం కూడా అనాథగా మారొద్దనే ఈపథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు.

ఆర్‌టిసికి అత్తెసరు

గతేడాదితో పోల్చితే తగ్గిన కేటాయింపు

మన తెలంగాణ/హైదరాబాద్: ''ఆర్‌టిసిని ఆదుకుంటాం. నష్టాలలో ఉన్న సంస్థకు ఆర్థికంగా చేయుతనిస్తాం'' అని సిఎం కెసిఆర్, రవాణ శాఖ మంత్రి ప్రకటనలు చేసినా బడ్జెట్ కేటాయింపులు మాత్రం ఆ తరహాలో లేవు. ప్రజా రవాణ వ్యవస్థలో అత్యంత కీలకపాత్ర పోషిస్తున్న ఆర్‌టిసి పట్ల ప్రభుత్వం 2017–18 బడ్జెట్లో కూడా సవతి తల్లి ప్రేమనే కొనసాగించింది. ప్రభుత్వం టిఎస్ఆర్‌టిసికి ప్రస్తుత 2017 – 18 బడ్జెట్‌లో రూ.994.71 కోట్లు కేటాయించగా వచ్చే ఆర్థిక ఏడాది 2018 – 19 బడ్జెట్‌లో ఇంకా తగ్గిస్తూ రూ.975.54 కోట్లను కేటాయించడమే అందుకు నిదర్శనం. వివిధ వర్గాలకు ఆర్‌టిసి ఇస్తున్న బస్‌పాస్‌ల రాయితీ కోసం రూ.520 కోట్లను, ప్రభుత్వ గ్యారెంటీ రుణాలను తిరిగి చెల్లించేందుకు రూ.315.54 కోట్లు, కొత్త బస్సుల కొనుగోలుకు రూ.140 కోట్లను కేటాయించింది. ఇప్పటివరకు టిఎస్ఆర్‌టిసి దాదాపు రూ.2 వేల కోట్ల అప్పులతో కొట్టుమిట్టాడుతుండగా, ప్రతి ఏటా సంస్థకు సుమారు రూ.450 కోట్ల నష్టం వాటిల్లుతున్నది. ఆర్‌టిసి నష్టాలను పూడ్చేందుకు బడ్జెట్‌లో ఎలాంటి కొత్త ప్రతిపాదనలు చేయలేదు. కార్మిక సంఘాలు కోరుతున్నట్లు సంస్థకు కొత్తగా గ్రాంట్‌లు ఏమీ ఇవ్వలేదు.

సంస్థ అవసరాలను తీరుస్తాయి : ఎండి

''ప్రభుత్వం 2018–19 బడ్జెట్‌లో వివిధ పద్దుల కింద టిఆర్ఎస్‌సికి కేటాయించిన నిధులు సంస్థ అవసరాలను తీరుస్తాయి'' అని టిఎస్ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణరావు 'మన తెలంగాణ' ప్రతినిధికి చెప్పారు.

అదనంగా ఇచ్చిందేమిటి : ''బస్‌పాస్‌ల రాయితీ, ప్రభుత్వ గ్యారెంటీ రుణాల చెల్లింపునిధులు ఆర్‌టిసికి చెల్లించాల్సినవే. కొత్త బస్సుల కొనుగోలుకు రూ. 140 కోట్ల కేటాయింపు తప్ప ప్రభుత్వం ఆర్‌టిసికి అదనంగా ఇచ్చిందేమిటి'' అని కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నించారు. ''ఆర్‌టిసిని ఆర్థికంగా ఆదుకోవాలని పదేపదే కోరుతున్నా ప్రభుత్వం మాత్రం కరుణించడం లేదు. నిధుల కేటాయింపు ఆశాజనకంగా లేదు. వందల కోట్ల అప్పులు, నష్టాల్లో ఉన్న ఆర్‌టిసికి ప్రత్యేక గ్రాంట్ ఇవ్వకపోవడం, బడ్జెట్ కేటాయింపులను తగ్గించడం అన్యాయం'' అని ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి, ఎన్ఎంయు డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఇ.అశోక్ తెలిపారు.

పద్దు	2017 – 18	2018 – 19
	(కేటాయింపులుకోట్ల రూపాయలలో)	
రాయితీల తిరిగి చెల్లింపు	520	520
గ్యారెంటీ రుణాల చెల్లింపునకు	334.71	315.54
కొత్త బస్సుల కొనుగోలుకు	140	140
మొత్తం	994.71	975.54

ఆదాయ వనరులు సమకూరేదిలా..

మన తెలంగాణ / హైదరాబాద్ : మంత్రి ఈటల రాజేందర్ సమర్పించిన బడ్జెట్‌లో మొత్తం వ్యయాన్ని రూ. 1,74,453 కోట్లుగా పేర్కొని రూ. 5,520 కోట్ల మేర మిగులును చూపించారు. వివిధ వనరుల నుంచి సమకూర్చుకునే ఆదాయం సుమారు రూ. 1,74,482 కోట్లుగా ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో రూ. 1,30,975 కోట్లు వివిధ రకాల పన్నుల ద్వారా సమకూరనుండగా మిగిలింది రుణం, కేంద్రం నుంచి పన్నుల వాటా, గ్రాంట్లు తదితర రూపాల్లో సమకూరనుంది. వివిధ రకా ల పన్నుల ద్వారా రూ. 92959 కోట్లు, పన్నేతర ఆదాయం ద్వారా రూ. 8973 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ల ద్వారా రూ. 29041 కోట్లు చొప్పున సమకూరనున్నాయి. రాష్ట్రం 201819 ఆర్థిక సంవత్సరానికి సమకూర్చుకోనున్న వసూళ్ళు ఇలా ఉన్నాయి :

రాష్ట్ర జిఎస్‌టి	రూ. 26040 కోట్లు
కేంద్ర జిఎస్టి వాటా	రూ. 6181 కోట్లు
ఐజిఎస్టి వాటా	రూ. 511 కోట్లు
జిఎస్టి నష్టపరిహారం	రూ. 1500 కోట్లు
కార్పొరేషన్ పన్ను	రూ. 5873 కోట్లు
ఇతర పన్నులు	రూ. 4772 కోట్లు
ఆదాయంమీద పన్ను	రూ.446 కోట్లు
లాండ్ రెవిన్యూ	రూ. 4 కోట్లు
స్టాంపులు, రిజిస్ట్రేషన్లు	రూ. 4699 కోట్లు
స్థిరాస్తులపై పన్ను	రూ.129 కోట్లు
కస్టమ్స్	రూ. 946 కోట్లు
కేంద్ర ఎక్సయిజ్ వాటా	రూ. 922 కోట్లు
రాష్ట్ర ఎక్సయిజ్ (మద్యం)	రూ. 10600 కోట్లు
సేల్స్ టాక్స్	రూ. 25942 కోట్లు
వాహన పన్ను	రూ.3950 కోట్లు
విద్యుత్ పన్ను	రూ. 434 కోట్లు
ఇతర పన్నులు	రూ. 5 కోట్లు
వడ్డీల ద్వారా	రూ. 186 కోట్లు
డివిడెండ్లు, లాభం	రూ. 156 కోట్లు
పోలీసుశాఖ ద్వారా	రూ. 223 కోట్లు
సామాజిక సేవల ద్వారా	రూ. 895 కోట్లు
ఆర్థిక సేవల ద్వారా	రూ. 4306 కోట్లు
కేంద్రం నుంచి గ్రాంట్ల ద్వారా	రూ. 29041 కోట్లు
కేంద్రం నుంచి రుణంగా	రూ. 800 కోట్లు
రాష్ట్ర ప్రభుత్వం అప్పుగా తీసుకునేది	రూ.32400 కోట్లు
గృహనిర్మాణం కోసం రుణం	రూ.2550 కోట్లు
పట్టణాభివృద్ధికి రుణం	రూ.4800 కోట్లు
విద్యుత్ ప్రాజెక్టులకు రుణం	రూ. 400 కోట్లు


ఇలాంటి అనేక రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.1,71,982.28 కోట్ల మేర ఆదాయ వనరులను సమకూర్చు కోనుంది. రెవిన్యూ వసూళ్ళు, కేంద్రం నుంచి గ్రాంట్ల ద్వారా రూ. 1,30,975 కోట్లుకాగా మిగిలినదంతా రుణాల రూపంలోనే సమకూర్చుకోనుంది.



పిఎన్‌బి కుంభకోణంపై పార్లమెంటులో చర్చ జరగాలి : వెంకయ్య నాయుడు

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి) కుంభకోణంపై పార్లమెంటు చర్చ జరగాల్సివుందని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు.ఈ కుంభకోణం దేశ ప్రతిష్టనుదెబ్బతీసిందని, ప్రజలు మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థనే నిందించే పరిస్థితి నెలకొందని చెప్పారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో విపక్షాల నిరసనలతో వరుసగా అన్ని రోజులూ అర్థాంతరంగా ముగిసిపోతోంది. గురువారం కూడా ఉభయ సభలూ ఎలాంటి చర్చ చేపట్టకుండానే ముగిశాయి. 'మూడు ఉదంతాల్లో నీరవ్ మోడీ, చోక్సీ, విజయ్ మాల్యాలు దేశ ప్రతిష్టను దెబ్బ తీశారు. అంతేకాదు వ్యవస్థ ప్రతిష్టను కూడా పోగొట్టారు' అని అన్నారు. 'ప్రజలు బ్యాంకింగ్ వ్యవస్థ మొత్తాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇది నిర్మాణాత్మకమైన వైఫల్యమా? వివిధ స్థాయిల్లో ఆ వ్యక్తుల కుట్రా? ఇదే నిజమైతే వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?' అని నాయుడు ప్రశ్నించారు. గురువారం ఇక్కడ రియల్టర్స్ కమిటీ క్రెడాయ్ వార్షిక సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ అంశాలపై పార్లమెంటు చర్చ చేపడుతుందని, ఇందులో నిర్మాణాత్మకమైన, అర్థవంతమైన చర్చ జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.'ఇక్కడ అసలు విషయమేమంటే..బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిపోతోంది, ఇదే పెద్ద అంశం. మదుపుదార్లకు ఎవరు బాధ్యతగా ఉంటారు, ఎవరు హామీ ఇచ్చారు? ఇవే ఇక్కడ పెద్ద సమస్యలు' అని పేర్కొన్నారు.

శరద్ పవార్‌తో రాహుల్ భేటీ




న్యూఢిల్లీ : వచ్చే సాధారణ ఎన్నికల్లో (2019) బిజెపిని నిలువరించేందుకు విపక్షాలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల గాంధీ ముమ్మరం చేశారు. అందులో భాగంగా గురువారం ఎన్‌సిపి చీఫ్ శరద్‌పవార్‌తో భేటీ అయ్యారు.ఉత్తరప్రదేశ్, బీహార్‌లో జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం పొందడం, అక్కడ పార్టీ చాలా బలహీనంగా ఉండడంతో రాహుల్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) అధినేతతో సమావేశం కావడం గమనార్హం. యుపిలోని గోర‌ఖ్‌పూర్, పుల్‌పూర్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో బిజెపి ఓటమి పాలైన కొద్ది గంటల్లోనే బుధవారం రాత్రి రాహుల్‌గాంధీ పవార్‌తో భేటీ అయ్యారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.కాషాయ పార్టీకి వ్యతిరేకంగా సంయుక్త విపక్ష ఫ్రంట్‌ను ఏర్పాటు చేసే ప్రయత్నాలపై ఇరువురి మధ్య జరిగిందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా, ఇటీవలే విపక్ష పార్టీలన్నింటికీ యుపిఎ చైర్‌పర్సన్‌సోనియాగాంధీ డిన్నర్ ఇచ్చిన విష యం తెలిసిందే.ఈ డిన్నర్‌కు కాంగ్రెస్ సహా 20 పార్టీల నేతలు హాజరయ్యారు.ఈ క్రమంలోనే రాహుల్ బుధవారం పవార్‌తో సమావేశమయ్యారు. అయితే త్వరలోనే ఆయనటిఎంసి చీఫ్,పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీతో కూడా సమావేశం కానున్నారు. ఈనెల 28న పవార్ ఆధ్వర్యంలో జరిగే ప్రతిపక్షాల సంయుక్త సమావేశానికి మమతా బెనర్జీ హాజరయ్యే అవకాశమున్నట్లు వర్గాలు తెలియజేశాయి. కాగా, యుపిలో జరిగిన ఉప ఎన్నికల్లో ఎస్‌బి–బిఎస్‌పి ఉమ్మడి అభ్యర్థికి మద్ద తు తెలపకుండా కాంగ్రెస్ స్వతంత్రంగా బరిలోకి దిగింది. పోటీ చేసిన రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోఅభ్యర్థులకు డిపాజిట్ కూడా దగ్గలేదు.

బిజెపి ముందస్తు ఎన్నికలకు వెళ్లొచ్చు



చండీఘడ్ : ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో జరిగిన ఉప ఎన్నికల్లో ఓటమి పాలయిన నేపథ్యంలో బిజెపి ముందుస్తుగా లోక్‌సభ ఎన్నికలకు వెళ్లే అవకాశముందనిబహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రి మాయావతి అన్నారు. ఈ ఆలోచన ఆ పార్టీకి ఓ గుణపాఠాన్ని నేర్పుతుందని చెప్పారు. గురువారం ఇక్కడ నిర్వహించిన ర్యాలీలో ఆమె ప్రసంగించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని, 1975లో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన అత్యయిక పరిస్థితిని మించే విధంగా పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తోందని,మీడియానుదుర్భలంగా మారుస్తోందని విమర్శించారు.'ఉత్తరప్రదేశ్‌లో బిజెపికి గుణపాఠం చెప్పాలని అనుకున్నాం. ఎస్‌పి అభ్యర్థులకు మద్దతు ఇచ్చాం.దీంతో ఆ పార్టీ అభ్యర్థులు గోరఖ్‌పూర్, పూల్పూర్‌లలో ఓడిపోయారు.ఈ ఓటమితో వారు నిద్రకు దూరమయ్యారు' అని అన్నారు.'ఈ ఎన్నికల ఫలితాలతో 2019 కంటే ముం దే బిజెపి ముందస్తు లోక్‌సభ ఎన్నికలకు వెళ్లే అవకాశముంది' ఆమె వ్యాఖ్యానించారు.లోక్‌సభతో పాటు అసెంబ్లీలకు జరిగే ఎన్నికల్లో తమ పార్టీ ఏడెనిమిది రాష్ట్రాల్లో పాల్గొంటుందని చెప్పారు.

కందులపై కేంద్ర సహకారం లేదు



మన తెలంగాణ/న్యూఢిల్లీ: తెలంగాణలో కందులు కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి అనుకున్నంత సహకారం అందలేదని తెలంగాణ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు.ఇప్పటి వరకు 14 వందల కోట్ల రూపాయల కందులను తెలంగాణ రాష్ట్రంలో కొనుగోలు చేశామని ఆయన తెలిపారు.గురువారం ఢిల్లీ పర్యటనకు వచ్చిన ఆయన రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్‌లను కలిశారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు కందుల కొనుగోలులో 4 వందల కోట్ల సహకారం మాత్రమే కేంద్రం నుంచి అందిందని తెలిపారు. సిఎం కెసిఆర్ బ్యాంక్ గ్యారంటీ ఇవ్వడం ద్వారా వెయ్యి కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని అన్నారు. ఇప్పటి వరకు 2 లక్షల 54 వేల మెట్రిక్ టన్నుల కందులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. ఇందులో కేంద్రం కేవలం 75 వేల మెట్రిక్ టన్నుల కందులను మాత్రమే కొనుగోలు చేసిందని తెలిపారు.కేంద్రం కొనుగోలు చేసిన 75వేల మెట్రిక్ టన్నులకు సైతం కేంద్రం నుంచి డబ్బులు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మొత్తం 400ల కోట్లలో 220 కోట్లు విడుదలై మిగిలిన 180 కోట్లు 45 రోజులుగా విడుదల కాక రైతులు రాష్ట్రంలో ఆందోళన చేస్తున్నారని తెలిపారు. కాబట్టి ఈ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు హరీశ్ రావు వెల్లడించారు. అయితే మూడు రోజుల్లో నిధులు చెల్లిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని మీడియాకు వివరించారు.

వాళ్లను ప్రజలు పట్టించుకోలేదు

మన తెలంగాణ/ హైదరాబాద్ : కాంగ్రెస్ శాసనసభ్యులనను సస్పెండ్ చేస్తే ప్రజలు ఎవ్వరు పట్టించుకొనే పరిస్థితి లేరని మంత్రి కె.టి.రామారావు అన్నారు. శాసనసభ లాబీల్లో గురువారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు.కాంగ్రెస్ నాయకులది అధికార ఆరాటమే అని ప్రజలకు తెలిసిపోయిందన్నారు. మంత్రి టి.హరీశ్‌రావు ప్రజల ఆశయాల కోసం నిరసనలు వ్యక్తం చేశారని చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం టిఆర్‌ఎస్ ప్రభుత్వం పాటు పడుతుంటే అధికారం కోసం కాంగ్రెస్ అనవసరపు రాద్ధాంతం చేస్తోందని వ్యాఖ్యానించారు.

భారతమాత రుణం తీర్చుకోనున్న కెసిఆర్


ఈ ప్రాంత బిడ్డగా తెలంగాణ సాధించి సిఎం కెసిఆర్ రుణం తీర్చుకున్నారని,భారత పౌరుడిగా కొత్త ఫ్రంట్ ఏర్పాటు చేసి భారత మాత రుణం తీర్చుకోనున్నాడని కెటిఆర్ అన్నారు.ఇప్పటికే దేశం యావత్తు తెలంగాణ వైపు చూస్తోందని, కెసిఆర్ సరికొత్త రాజకీయాలకు దేశం యావత్తు స్పందిస్తుందన్నారు. సామాన్య ప్రజలకు ఎం కావాలో అదే కేసీఆర్ అజెండా అని, ఉత్తరప్రదేశ్ లో బీజేపీ ,కాంగ్రెస్‌కి ఎదురు దెబ్బ తగిలిందన్నారు.యుపిలో సమాజ్‌వాదిపార్టీ గెలుపుతో ప్రజలు ప్రాంతీయ పార్టీలవైపు,మొగ్గు చూపుతున్నారని తేలిందని చెప్పారు. బిజెపి, కాంగ్రెస్‌లను ప్రజలు ఇకపై నమ్మరని, కొత్త ఫ్రంట్ ఏర్పాటు కావాలని ప్రజలు దేశ వ్యాప్తంగా ఎదురు చూస్తున్నారని చెప్పారు.

ప్రజల్లోకెళ్తామన్నారు..కోర్టుకెందుకు?

మన తెలంగాణ / హైదరాబాద్ : ఇద్దరు శాసనసభ్యుల బహిష్కరణ పై ప్రజా క్షేత్రానికి వెళ్తామన్న కాంగ్రెస్ నేతలు న్యాయ స్థానాలకు ఎందుకు వెళ్తున్నారని మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. టిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు.ప్రీ ఫైనల్ లో గెలవలేని వాళ్ళు ఫైనల్ లో గెలుస్తారా ? 2019 ఎన్నికల తర్వాత అసెంబ్లీ లో ఉండేవి టిఆర్‌ఎస్, ఎంఐఎంలేనని చెప్పారు. ప్రతిపక్షం లేని స్థితి మాకు కూడా బోరింగ్ గానే ఉంటుందన్నారు. ఆర్థక మంత్రి ఈటల రాజేందర్ ప్రవేశపెట్టింది రైతు బడ్జెట్ అని, తెలంగాణ బడ్జెట్ యావత్ భారతదేశానికే తలమానికం కాబోతోందని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు.అన్నీ రాష్ట్రాలకు భవిష్యత్ లో వ్యవసాయ ఆధారిత బడ్జట్ ను ప్రవేశ పెట్టేందుకు తెలంగాణ బడ్జెట్ దోహద పడుతోందన్నారు.

'ఉత్తర' గాలితో ఉలిక్కిపడ్డ బిజెపి





లక్నో/న్యూఢిల్లీ :ఉత్తరప్రదేశ్‌లో రెండు స్థానాలలో ఓటమి బిజెపికి పిడుగుపాటుగా మారింది. ప్రత్యేకించి అతి పెద్ద రాష్ట్రం అయిన ఉత్తర ప్రదేశ్‌లో బిజెపికి ఈ ఫలితం కొరుకుడుపడటం లేదు. పార్టీ వర్గాలలో ప్రమాద ఘంటికలు మోగాయి. ముఖ్యమంత్రి ఆదిత్యానాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యల నియోజకవర్గాలలో బిజెపి పరాజయం పలు ముందస్తు సంకేతాలను ఇచ్చింది. ప్రతిపక్షాల ఐక్యతా సంకేతాలు ఈ పరిణామంతో మరింత బలోపేతం కావడంతో జాతీయ స్థాయిలో బిజెపికి సంకట స్థితి ఏర్పడింది.అన్ని ఎన్నికలను కొత్త ఎన్నికలుగానే భావించుకుంటూ వస్తున్న బిజెపి ఈసారి కీలకమైన యుపి ఎన్నికలను తేలిగ్గా తీసుకుందా? తాము తప్పనిసరిగా గెలుస్తామనే ధీమానే కొంపముంచిందని స్వయంగా ముఖ్యమంత్రి ఆదిత్యానాథ్ అంగీకరించారు. ఈ మధ్యనే ఈశాన్య రాష్ట్రాలలో బిజెపి ఉనికి బలోపేతం అయింది. ఏకంగా వామపక్ష కోటను బిజెపి బద్దలు కొట్టింది. మరి రెండు రాష్ట్రాల్లోనూ బిజెపి మిత్రపక్షాలు అధికారంలోకి వచ్చాయి. అయితే ఈ ఈశాన్య సంతోషం, ఉత్తరప్రదేశ్‌లో ఓటమితో కొట్టుకుపోయింది.పలు ఆర్థిక చర్యలతో ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి రగులుకుంటూ రావడం గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతోనే వెల్లడైంది. ప్రధాని స్వరాష్ట్రం గుజరాత్‌లో బిజెపి అతి కష్టం మీద అధికారం నిలబెట్టుకుంది. ఇక ఓట్ల పరంగా గ్రామీణ ఓటర్లు బిజెపి వ్యతిరేకతను చాటారు.ఇది ప్రతిపక్షాలకు బలం ఇచ్చింది. ఇప్పుడు యుపిలో సంఘటితం అయిన ప్రతిపక్షం బిజెపికి చుక్కలు చూపించింది. దీని ఫలితం కీలకమైన మరో రాష్ట్రం కర్నాటక పై పడుతుందని, ఆ రాష్ట్రంలో బిజెపి తన వాదన విన్పించుకునే పరిస్థితి లేదని వెల్లడయింది. ఇటీవలి పార్లమెంటరీ ఉప ఎన్నికలలో బిజెపికి వరుసగా అపజయాలు ఎదురవుతున్నాయి. అయితే వీటి నుంచి ఆ పార్టీ గుణపాఠం నేర్చుకున్న దాఖలాలు లేవని ఇప్పటి అపజయం తేల్చిచెప్పింది. ఓ క్రమపద్ధతిలో అధికారాన్ని సమీకరించుకుంటూ వచ్చిన బిజెపి ఇదే సమయంలో అనూహ్యరీతిలో ఎదురవుతున్న ప్రజా వ్యతిరేకత, అందుకు తగు వేదికగా మారనున్న ప్రతిపక్ష ఐక్యతను తట్టుకునే పరిస్థితి కనబడటం లేదు.

యుపిలో వైర మిత్రత్వ ఫలితం

అత్యంత సంక్లిష్ట రాజకీయాల వేదిక అయిన ఉత్తరప్రదేశ్‌లో ఎస్‌పి, బిఎస్‌పిలు ఎప్పుడూ రాజకీయ బద్ధశత్రువులు. అయితే దూసుకుపోతున్న బిజెపికి అడ్డుకట్ట వేసేందుకు అక్కడ నెలకొన్న ఎస్‌పి, బిఎస్‌పి మిత్ర సమీకరణం బిజెపి బ్రహ్మాస్త్రాన్ని చిత్తుచేసింది. దశాబ్దాలుగా గోరఖ్‌పూర్ బిజెపికి కంచుకోటగా ఉంది. దీనిని దాటి కాంగ్రెస్ కానీ బిఎస్‌పి, ఎస్‌పిలు కానీ ఇంతవరకూ ముందుకు వెళ్లలేకపోయాయి. అయితే దీనిని ఛేదిస్తూ ఇప్పుడు రెండు స్థానాలను ప్రతిపక్షం దక్కించుకుంది. ఈ అపజయంతో తాము ఎంతో నేర్చుకోవల్సి ఉందని ముఖ్యమంత్రి ఆదిత్యానాథ్ చెప్పారు. పొత్తు బలం గురించి తాము సరిగ్గా అంచనా వేసుకోలేకపోయినట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో సొంతంగా బలం పెంచుకోలేకపోతున్న కాంగ్రెస్ ఇప్పటి పరిణామం ప్రతిపక్షాలకు శుభ సూచకంగా భావిస్తోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో బిజెపిని దెబ్బతీసేందుకు జాతీయ స్థాయిలో మహాఘట్‌బంధన్ ఏర్పాటుకు ఇది దారి చూపిందని కాంగ్రెస్ ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ విశ్లేషించారు.

మాయావతి ఇంటికి అఖిల్

యుపిలో కుదిరిన రాజకీయ సమీకరణ మరింత బలోపేతం అవుతుందని సంకేతాలు వెలువడ్డాయి. ఎస్‌పి నేత అఖిలేష్ యాదవ్ స్వయంగా బిఎస్‌పి నాయకురాలు మాయావతి ఇంటికి వెళ్లి ఆమె ఔదార్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురి నడుమ ప్రతిపక్షాల ఐక్యత విషయం, ప్రత్యేకించి కాంగ్రెస్‌తో వ్యవహార శైలి, ఇతర బలీయ ప్రాంతీయ పార్టీలతో కలిసి జాతీయ స్థాయిలో బిజెపిని ఎదుర్కొనే అంశాలు చర్చలకు వచ్చినట్లు వెల్లడైంది. అయితే కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ఉన్న ప్రాంతీయ పార్టీలు బిజెపికి వ్యతిరేకంగా అయినా కలిసికట్టుగా వ్యవహరిస్తాయా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది ఇప్పటివరకూ జరిగిన అన్ని లోక్‌సభ ఉప ఎన్నికలలో బిజెపి ఓటమి పాలుకావడం కీలక విశ్లేషణాత్మక అంశంగా మారింది. ప్రధాని మోడీ పనితీరుపైనే ఇవి పరీక్షలుగా మారాయని భావిస్తున్నారు. గోరఖ్‌పూర్, ఫుల్పూర్, అరారియా, అంతకు ముందు పశ్చిమబెంగాల్‌లోని ఉలూబెరియా, రాజస్థాన్‌లోని అల్వార్, అజ్మీర్ ఉప ఎన్నికలలో బిజెపి ఓటమి పాలయింది. బిజెపి పాలిత రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లో అధికార వ్యతిరేకత తీవ్రం గా ఉందని స్పష్టం అవుతూ వస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో ఒబిసి, దళితులు, ముస్లిం ఓట్ల సంఘటితం వల్లనే ఎస్‌పి అభ్యర్థులు గెలుపొందారు.

సంఘటిత ప్రతిపక్షంతో బిజెపికి అడ్డుకట్ట

సిపిఐ నేత సురవరం వెల్లడి

హైదరాబాద్ (పిటిఐ): ప్రతిపక్షాల ఐక్యతతో బిజెపికి గండి కొట్టవచ్చునని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి ప్రతిపక్షాల అభ్యర్థులను నిలబెట్టడమే వచ్చే లోక్‌సభ ఎన్నికలలో బిజెపిని ఓడించేందుకు సరైన మార్గం అని తెలిపారు. పలు రాష్ట్రాలలో బిజెపికి వ్యతిరేకంగా ఉమ్మడి అభ్యర్థులను నిలబెట్టేందుకు వీలు ఉంటుందని,అయితే జాతీయ స్థాయిలో ఈ వ్యూహం సమగ్రంగా అమలు చేయడం సంక్లిష్టంగానే ఉంటుందని విశ్లేషించారు. కొన్ని రాష్ట్రాలలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, బలీయమైన ప్రాంతీయ పార్టీల నేపథ్యంలోఉమ్మడి అభ్యర్థుల ఖరారు కీలకం అవుతుందన్నారు.ఉమ్మడి పోటీ జాతీయ స్థాయిలో ఎన్నికల పోటీ విధానంగా పెట్టుకోవడం సాధ్యం కాకపోవచ్చునని తెలిపారు.అదే విధంగా కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్, వామపక్షాలు, మరి కొన్నింటిలో కాంగ్రెస్, అక్కడి ప్రాంతీయ పార్టీలూప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నాయని పేర్కొన్నారు.ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికలలో బిజెపి ఓటమిపై సురవరం స్పందించారు.ఈ పరిణామం దేశంలోని లౌకిక పార్టీలకు అమితమైన స్ఫూర్తిని కల్గిస్తుందని సురవరం విశ్లేషించారు. ఇక కొన్ని రాష్ట్రాలలో సాధ్యం కాకపోయినా, అత్యధిక రాష్ట్రాలలో ముఖాముఖీ పోటీ ఉండటం వల్ల ప్రతిపక్షాలకు లాభిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలన్నీ బిజెపికి వ్యతిరేకంగా ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టడం వల్ల ప్రయోజనం ఉంటుందని, బిజెపికి అడ్డుకట్ట వేసేందుకు సాధ్యమైనంత వరకూ ఎక్కువ చోట్ల ఇదే వ్యూహం పాటించాల్సి ఉందన్నారు.లౌకిక శక్తుల ఐక్యతతోనే దేశంలోని మతోన్మాద శక్తులను, సంఘ్ పరివార్‌ను ఓడించవచ్చుననే విషయం ఉత్తర ప్రదేశ్ ఫలితంతో వెల్లడైందని తెలిపారు.ఇది మంచి పరిణామంగా పేర్కొన్నారు. ఉప ఎన్నికలలో ఎస్‌పి అభ్యర్థులకు మద్దతు నిర్ణయం తీసుకోవడం ద్వారా బిఎస్‌పి అధినేత్రి మాయావతి సముచితంగా వ్యవహరించారని అభినందించారు.ఆమె స్పందన మద్దతుకు దారితీసి,ఈవిజయంసాధ్యం అయిందని అన్నారు.సంఘ్ పరివార్, బిజెపిలకు మరింత గ ట్టిగా జవాబు ఇచ్చేందుకు లౌకిక శక్తులన్నీ మరింతగా కలిసికట్టుగా వ్యవహరించాల్సి ఉందని తెలిపారు.యుపి విజయం లౌకిక శక్తుల మరింత ఐక్యతకు దారి తీసి, ప్రతిపక్షాల ఐక్యత పట్ల సరైన విశ్వాసం పెంచుతుందని సురవరం వెల్లడించారు.

ఓటమి భయంతోనే కోర్టుకు కోమటిరెడ్డి : వేముల

మన తెలంగాణ/ హైదరాబాద్: ఓటమి భయంతోనే కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోర్టులకు వెళ్తా అంటున్నాడని నకిరేకల్ ఎంఎల్‌ఏ వేముల వీరేశం అన్నారు. కోమటిరెడ్డికి గెలిచే దమ్ము, సత్తా ఉంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని ఒక ప్రకటనలో సవాలు విసిరారు. కోమటిరెడ్డి విసిరిన సవాల్ కు కేసీఆర్ అవసరం లేదని, నల్గొండ జిల్లా నేతలు చాలునని అన్నారు.రావి నారాయణ రెడ్డి, ఆరుట్ల కమలాదేవి, నర్రా రాఘవరెడ్డి లాంటి వారిని చూసిన చరిత్ర నల్గొండదని చెప్పారు.కోమటిరెడ్డి లాంటి జోకర్, బ్లాక్ మెయిలర్ల కు నల్గొండ జిల్లా లో స్థానం లేదన్నారు. ఉప ఎన్నిక లో కోమటి రెడ్డి కి ప్రజలు బుద్ధి చెప్పడానికి రెడీ అయ్యారన్నారు.

రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం : టిఆర్‌ఎస్



మనతెలంగాణ/న్యూఢిల్లీ: రాష్ట్రాలకు రిజర్వేషన్ల పెంపు అధికారం ఇచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండివైఖరితో వ్యవహరిస్తుందని టీఆర్‌ఎస్ ఎంపీలు ఆరోపించారు. 9వ రోజు అయిన గురువారం కూడా పార్లమెంటులో రిజర్వేషన్ల అంశంపై నిరసన తెలిపారు. టీఆర్‌ఎస్ ఎంపీల నిరసనలతో పాటు, వివిధ పార్టీలు కూడా తమ తమ అంశాలపై నిరసనలు తెలియజేయడంతో సభ శుక్రవారానికి వాయిదా పడింది. మొదట వివిధ పార్టీల ఎంపీలు నిరసన తెలియజేస్తూ, గట్టిగా నినాదాలు ఇవ్వడంతో లోక్‌సభ స్పీకర్ సభను మొదట 12 గంటలకు వాయిదా వేశారు. 12గంటలకు తిరిగి లోక్ సభ ప్రారంభం కాగానే మళ్లీ అదే సీన్ రిపీట్ కావడంతో స్పీకర్ సమిత్రామహాజన్ సభను శుక్రవారం ఉదయం 11గంటలకు వాయిదా వేశారు. అనంతరం టీఆర్‌ఎస్ ఎంపీలు వినూత్నంగా పార్లమెంటు సెంట్రల్ హాల్ లో నిరసన తెలియజేశారు. రెండు సభలు వాయిదా పడడంతో సెంట్రల్ హాల్‌కి అన్ని పార్టీల ఎంపీలు రావడంతో వారి సమక్షంలో టీఆర్‌ఎస్ ఎంపీలు నిరసన తెలిపారు. అనంతరం ఎంపి బూరనర్సయ్య గౌడ్ మాట్లాడుతూ రిజర్వేషన్ల అంశానికి శాశ్వత పరిష్కారం చూపాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తుందని ఆరోపించారు. అందుకే పార్లమెంటు సెంట్రల్ హాలులో ప్లకార్డులతో నిరసన తెలిపామన్నారు. తాము చేస్తున్న రిజర్వేషన్ల పోరాటానికి ఇతర పార్టీలు మద్దతిస్తున్నాయని తెలిపారు. లోక్ సభలో టీఆర్‌ఎస్ పక్షనేత జితేందర్ రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అధ్యక్షత న జరిగిన బిఏసి సమావేశంలో పాల్గొన్నామని తెలిపారు. లోక్ సభ సజావుగా సాగాలని స్పీకర్ కోరారని అన్నారు. అత్యవసరమైన బిల్లులపై లోక్‌సభ లో చర్చ జరగాల్సిన అవసరముందన్న స్పీకర్ వివరించారని అన్నారు. అయితే బిల్లుపై చర్చించాలంటూ కేంద్రప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. అయితే ఇదే పార్లమెంటు వేదికపై అనేక చర్చలు జరిగిన తర్వాత తెలంగాణకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదనే అంశంపై కేంద్రం ఎందుకు స్పందించరని స్పీకర్ ని ప్రశ్నించినట్లు తెలిపారు.

రెండు బిల్లులకు ఆమోదం

లోక్‌సభలో గురువారం తీవ్ర గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యులు పత్రాలు చించి, సభలో విసిరేయడంతో పాటు నిర్విరామంగా నిరసనలు వ్యక్తం చేశారు. కాంగ్రెస్, టిఎంసి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ వంటి విపక్షాలతో పాటు, ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షమైన టిడిపి సభ్యులు కూడా నిరసనలు వ్యక్తం చేస్తూ సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. ఉభయసభల్లోనూ ఇలాంటి గందరగోళం పరిస్థితుల మధ్య ప్రభుత్వం ఎలాంటి చర్చ చేపట్టకుండానే రెండు బిల్లులను పాస్ చేసింది. ఉదయం లోక్‌సభ ప్రారం భం కాగానే నిరసనలు హోరెత్తడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ తొలుత సభను మధ్యాహ్నం వరకు, ఆ తరువాత మరుసటి రోజుకు వాయిదా వేశారు. రాజ్యసభలోనే ఇదే స్థితి ఉండడంతో సభ మూడుసార్లు వాయిదా పడింది. చివరికి ఆర్థిక, ద్రవ్య వినియోగ బిల్లులపై చర్చ జరగకుండానే ముగిసింది.

కార్తిని 26 వరకు అరెస్టు చేయొద్దు : ఇడికి సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : ఐఎన్‌ఎక్స్ మీడియాఅవినీతి కేసులో కార్తి చిదంబరానికి సుప్రీంకోర్టులో గురువారం నాడు ఊరట లభించింది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కార్తిని అరెస్టు చేయరాదని ఢిల్లీ హైకోర్టు మం జూరు చేసిన గడువును సుప్రీంకోర్టు మార్చి26 వరకు పొడిగించింది. దీంతో పాటు హై కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసును సుప్రీంకు బదిలీ చేసుకుంది.ప్రధాన న్యాయమూర్తి దీప క్ మిశ్రా,న్యాయమూర్తులు ఎఎం ఖన్విల్కర్,డివై చంద్రాచూద్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణను మార్చి 26న చేపడతామని పేర్కొంది.కార్తిని ఇడి అరెస్టు చేయకుండా జారీ చేసిన ఉత్తర్వుల గడువును ఈనెల 20 నుంచి 22 వరకు పొడిగిస్తూ హైకోర్టు తీర్పునిచ్చినగంటల్లోనే సుప్రీంకోర్టు ఈ గడువును ఈనెల 26 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

'అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం'

పార్టీ ఏర్పాటు చేసిన దినకరన్



మధురై : తమిళనాడులో అమ్మ రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. అధికార అన్నాడిఎంకెలో రెబెల్ నేత టిటివి దినకరన్ గురువారం 'అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం' పేరిట పార్టీని ప్రారంభించారు. మాజీ ముఖ్యమంత్రి, తమ నాయకురాలు జయలలిత పేరిట ఈ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు దినకరన్ ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలిపారు. అవినీతి ఆరోపణలపై జైలులో ఉన్న శశికళ మేనల్లుడు అయిన దినకరన్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. విద్రోహులు, వెన్నుపోటుదార్లకు సవాలుగా నిలుస్తామని,ప్రతీకారం తీర్చుకుంటామని శపథం చేశారు. ఎఐఎడిఎంకెను విద్రోహుల గుప్పిట్లో నుంచి విడిపించే దిశలో అమ్మ పేరిట పార్టీని ఏర్పాటు చేసినట్లు దినకరన్ ప్రకటించారు. ఈ క్షణం నుంచీ ఇక ఇదే లక్ష్యంతో తమ మహోద్యమం సాగుతుందని సభికుల హర్షధ్వానాల మధ్య తెలిపారు. ముఖ్యమం త్రి కె పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీరుసెల్వంలను దినకరన్ వర్గీయులు తరచూ విద్రోహులుగా పరిగణిస్తున్నారు. ప్రజా ప్రగతి కోసం వెలిసిన అమ్మ పార్టీ అనే అర్థం వచ్చే ఈ పార్టీ పేరు ను మధురైకి సమీపంలోని మేలూరులో దినకరన్ వెల్లడించారు. దీనితో తమిళనాడులో రాజకీయ సందడి మరో మలుపు తిరిగింది. అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం పేరును దినకరన్ బిగ్గరగా మూడు సార్లు పలికారు.ఈ దశలో ఆయన వర్గీయుల నుంచి భారీ స్థాయిలో కరతాళధ్వనులు వెలువడ్డాయి.అమ్మ పేరిట వెలిసిన ఈ పార్టీ తప్పనిసరిగా రాష్ట్రంలో అధికారం కైవసం చేసుకుంటుందనిదినకరన్ దీమావ్యక్తం చేశారు.

ట్రేడర్లు, కమిషన్ ఏజెంట్లకు ఊరట

- వ్యాపార ఫ్రెండ్లీ విధానాలతో కోలుకుంటున్నామన్న రైస్ మిల్లర్లు
- త్వరలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ

మన తెలంగాణ/హైదరాబాద్ : వ్యవసాయ మార్కెట్ కమిటీలలో బ్యాంకు గ్యారంటీలను మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్ రావు సడలించారు. టర్నోవర్ ను బట్టి బ్యాంకు గ్యారంటీలను సమర్పించాలన్న నిబంధనలపై ట్రేడర్లు, కమిషన్ ఏజెంట్ల అభ్యంతరాలకు ఆయన సానుకూలంగా స్పందించారు. అసెంబ్లీ కమిటీ హాలులో గురువారం జరిగిన సమావేశంలో జిన్నింగ్ మిల్లులు, రైస్ మిల్లుల యాజమానుల సంఘాల ప్రతినుధులతో ఆయన చర్చించారు. కొన్ని వ్యవసాయ మార్కెట్‌లలో సరకు కొనుగోలు చేసిన తర్వాత రైతులకు డబ్బులివ్వకుండా ఎగ్గొట్టిన సంఘటనల దృష్ట్యా టర్నోవర్ ఆధారంగా బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలని మార్కెటింగ్ శాఖ నిబంధనలు రూపొందించిన విషయం తెలిసిందే. కోటి రూపాయల వరకు టర్నోవర్ ఉన్న వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు రూ.5 లక్షలు, రూ. ఒక కోటికి పైగా టర్నోవర్ ఉంటే రూ. 10 లక్షల బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలి. ఇప్పుడు రూ. ఒక కోటి టర్నోవర్ మేరకు లావాదేవీలు జరిపే ట్రేడర్లు, కమిషన్ ఏజెంట్లు రూ. 50వేలు, ఆపైగా ఉంటే రూ. ఒక లక్ష, రూ. 5 కోట్లకు పైగా టర్నోవర్ ఉంటే రూ.2 లక్షలు బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని మంత్రి మినహాయింపులు ఇచ్చా రు. అయితే బ్యాంకు గ్యారంటీ జీ.ఓ కు వ్యతిరేకంగా కోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకోవాలని మంత్రి షరతు పెట్టారు. అందుకు ట్రేడర్లు, కమిషన్ ఏజెంట్లు అంగీకరించారు. ఇకపై నిబంధనలకు మించి కమిషన్లు, ఇతర వసూళ్లు జరిపిన సమాచారం అందితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిజాయితీపరుడైనమంత్రి ఈటల రాజేందర్‌పై కొందరు కాంగ్రెస్ నాయకులు అవినీతి ఆరోపణలు తనకు బాధ కలిగించాయని హరీశ్ రావు అన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలను గట్టిగా తిప్పికొట్టలేకపోయారని రైస్ మిల్లర్లను ఉద్దేశించి మంత్రి వ్యాఖ్యానించారు. నష్టాల పాలై మూతపడిన 700 రైసుమిల్లులు తిరిగి ప్రారంభమవుతున్నాయని, రైసు మిల్లర్లు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారని రైస్ మిల్లర్లు చెప్పారు. సిఎం కెసిఆర్ అనుతిస్తే త్వరలోనే దాదాపు లక్ష మందితో ఒక భారీ బహిరంగసభ ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనిపై సిఎంతో మాట్లాడతానని హైదరాబాద్ లో సభ నిర్వహించాలని హరీష్ రావు కోరారు.

కందిరైతుల బకాయిలు వెంటనే చెల్లించాలి

కంది రైతుల బకాయిల చెల్లింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని మార్క్ ఫెడ్, హాకా, నాఫెడ్ సంస్థలను మార్కెటింగ్ మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. కందులు, మినుములు, శెనగలు, ఎర్రజొన్నల కొనుగోళ్ళు, చెల్లింపులపై మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, హరీశ్‌రావు సమీక్షించారు. రాష్ట్రం అంతటా 2.58 లక్షల మెట్రిక్ టన్నుల కందులను ప్రభుత్వం సేకరించింద న్నారు. ఇందులో 1.83 లక్షల మెట్రిక్ టన్నులు రూ.1000 కోట్ల విలువ చేసే కందులను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయగా ఇందులో రూ.600 కోట్ల చెల్లింపులు కూడా పూర్తయ్యాయన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంకా రూ. 184 కోట్లు వివిధ ప్రభుత్వ ఏజెన్సీలకు రావాల్సి ఉందని హరీష్ పేర్కొన్నారు.మార్క్ ఫెడ్, నాఫెడ్, హాకా తదితర ఏజెన్సీల పనితీరుపై మంత్రులు హరీష్ రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, హరీశ్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆయా సంస్థల పని తీరు మెరుగు పరచుకోవాలని సూచించారు.

ఆమె అప్పటికే పెళ్లయిందని చెప్పలేదు: షమీ



కోల్‌కతా: క్రికెటర్ మహమ్మద్ షమీ భార్య హసీన్ జహాన్ రోజుకో కొత్త ఆరోపణలతో వార్తల్లోకి వస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో షమీ స్పందించాడు. హసీన్‌కు ముందే మరో వ్యక్తితో పెళ్లయిందన్న విషయాన్ని తన వద్ద దాచి పెళ్లి చేసుకుందని షమీ తెలిపాడు. 'నేను హసీన్‌ను పెళ్లి చేసుకునేటప్పటికే ఆమెకు మరొకరితో పెళ్లి అయ్యింది. అప్పటికే ఇద్దరు ఆడ పిల్లలు కూడా ఉన్నారు. కానీ, ఈ విషయం నా దగ్గర దాచి పెట్టింది. ఈ పిల్లలు ఎవరు అని నేను అడిగితే, చనిపోయిన తన సోదరి పిల్లలు అని చెప్పింది. గుడ్డిగా న మ్మిన నేను హసీన్‌ను పెళ్లి చేసుకున్నాను. ఆ తర్వాత కొంత కాలానికి హసీన్ అసలు విషయం చెప్పింది. అప్పటికే తనకు షఫీయుద్దీన్ అనే వ్యక్తితో పెళ్లి అయ్యిందని, ఆ పిల్లలు తన పిల్లలే అంది. నేను షాక్‌కు గురయ్యాను' అని షమి వివరించాడు. హసీన్ 2002లో షఫీయుద్దీన్ అనే వ్యక్తిని పెళ్లాడింది. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత విభేదాలు తలెత్తడంతో 2010లో అతడి నుంచి విడిపోయింది. 2012లో షమీకి హసీన్‌తో పరిచయమైంది. ఆ తర్వాత 2014లో వీరిద్దరూ పెళ్లి చేసుకోగా ప్రస్తుతం వీరికొక పాప. హసీన్ ఫిర్యాదు మేరకు గృహహింస, హత్యాయత్నం కింద షమీపై కేసులు నమోదు చేసిన కోల్‌కతా పోలీసులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించారు.

ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్‌కు 99

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా)బుధవారం విడుదల చేసిన ఫిబ్రవరి నెల ర్యాంకింగ్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు మూడు స్థానాలు ఎగబాకి 99వ ర్యాంకింగ్‌కు చేరుకుంది. స్టీఫెన్ కాన్‌స్టెంటైన్ కోచింగ్ ఇచ్చిన భారత్ జట్టు మార్చి 27న బిష్‌కెక్‌లోని డొలాన్ ఒంర్జకోవ్ స్టేడియంలో 2019 ఎఎఫ్‌సి ఆసియా కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో కిర్గిజ్ రిపబ్లిక్‌తో తలపడనున్నది. ఆసియా కప్ బెర్త్‌ను 27 విరామం తర్వాత భారత్ ఇప్పటికే దక్కించుకుంది. అయినప్పటికీ భారత్ జట్టు 2018లో ఇంకా ఆడాల్సి ఉంది. నవంబర్‌లో జరిగిన ఎఎఫ్‌సి ఆసియా కప్ క్వాలిఫయింగ్ గ్రూప్–ఎ మ్యాచ్‌లో మయన్మార్‌తో ఆడిన భారత్ మ్యాచ్‌ను 2–2తో డ్రా చేసుకుంది. భారత్ ఆరు పాయింట్లు పొంది ఫిబ్రవరి రేటింగ్‌లో 333 పాయింట్లు సంపాదించింది. దాంతో మూడు స్థానాలు ఎగబాకి 99వ ర్యాంకుకు చేరుకుంది. ఇదిలా ఉండగా ఆసియా ఖండంలో ఇరాన్ ఫుట్‌బాల్ జట్టు ఇప్పటికీ అగ్రస్థానంలో కొనసాగుతోంది.

విదర్భను టాప్‌లో నిలిపిన జాఫర్

ఇరానీ కప్

నాగ్‌పూర్: ఇరానీ కప్ పోరులో గురువారం రెండో రోజున విదర్భ జట్టు, రెస్టాఫ్ ఇండియా జట్టుపై బ్యాటింగ్‌లో పూర్తి ఆధిక్యతను చాటుకుంది. విదర్భ రెండో వికెట్ నష్టానికి 289 స్కోరు చేసింది. ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 598 పరుగులు చేసింది. వసీమ్ జాఫర్ 285(నాటౌట్), గణేశ్ సతీశ్ 120 పరుగులు చేశారు. గురువారం మొదటి తొమ్మిది ఓవర్లలో కేవలం ఎనిమిది పరుగులే చేయగలిగారు. విదర్భ జట్టులో జాఫర్, సతీశ్ కలసి బాగా ఆడి స్థితిన పటిష్ట పరిచారు. ఇన్నింగ్స్ 106వ ఓవర్లో సతీశ్ తొలి అర్ధ శతకాన్ని చేశాడు. ఏడు ఓవర్ల తర్వాత జాఫర్ 150 పరుగుల మార్క్‌ను అధిగమించాడు. రెస్టాఫ్ ఇండియా బౌలర్లు వారిద్దరిని కట్టడి చేయడానికి చాలా శ్రమించారు. ఆర్. అశ్విన్ బ్యాట్స్‌మెన్‌లను ఒత్తిడిలో పడేయాలని చూశాడు. కానీ జాఫర్‌కు అదృష్టం కలిసి రావడంతో ఏమి చేయలేకపోయాడు. అశ్విన్ తన బౌలింగ్‌తో రెస్టాఫ్ ఇండియా జట్టుకు కొంత ఆశలు కల్పించినప్పటికీ జాఫర్, సతీశ్ నిలదొక్కుకుని ఆడారు. లంచ్ సమయానికి విదర్భ 2 వికెట్ల నష్టానికి 407 పరుగులు చేసింది. రెండో సెషన్ చివరికల్లా 2 వికెట్ల నష్టానికి ఆ ఇద్దరు 504 స్కోరు చేశారు. 137వ ఓవర్లో జాఫర్ తన ఎనిమిదో ఫస్ట్‌క్లాస్ డబుల్ శతకాన్ని దంచేశాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 18000 పరుగుల మార్కును చేరుకుని ఆరవ భారతీయ క్రికెటర్‌గా నిలబడ్డాడు. జాఫర్‌కు అండగా సతీశ్ ఆడాడు. 140వ ఓవర్లో సతీశ్ తన శతకాన్ని పూర్తి చేసి జట్టు 500 స్కోరును అధిగమించేలా చేశాడు. కానీ మూడో సెషన్‌లో ఓ బౌన్స్‌కు సతీశ్ మూడో వికెట్‌గా ఔటయ్యాడు. జాఫర్ 250 పరుగులు చేశాక, అన్ని పరుగులు చేసిన అత్యంత ఎక్కువ వయస్సుగల ఆసియా ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇరానీ కప్‌లో అత్యధిక పరుగుల రికార్డును కూడా జాఫర్ నెలకొల్పాడు. అతడికి ముందు 2012లో రాజస్థాన్ జట్టుతో ఆడినప్పుడు ఎం. విజయ్ 266 పరుగులు చేశాడు.

క్లుప్తంగా స్కోరు: విదర్భ 598/3. (వసీమ్ జాఫర్ 285(నాటౌట్), గణేశ్ సతీశ్ 120)



రికియవిక్ ఓపెన్ టైటిల్ విజేత భాస్కరన్



ఐస్‌లాండ్: రికియవిక్ ఓపెన్ ఫైనల్ రౌండ్‌లో టర్కీ గ్రాండ్ మాస్టర్ ముస్తఫా ఇల్మజ్‌ను భారత చదరంగం దిగ్గజ ఆటగాడు అధిబన్ భాస్కరన్‌ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. రికియవిక్‌లో ఆడడం తనకిదే తొలిసారని, తొలి ప్రయత్నంలోనే తనకు గెలుపు దక్కడం ఆనందంగా ఉందని, బాబీ ఫిషర్‌కు విశ్రాంతి ప్రదేశమైన రికియవిక్‌లో టోర్నమెంట్ గెలవాలన్నది తన అభిలాష అని, గెలవడం ఇప్పుడు సంతోషాన్నిచ్చిందని భాస్కరన్ అన్నారు. అమెరికా చెస్ దిగ్గజం బాబీ ఫిషర్ 10వ వర్ధంతి పురస్కరించుకుని ఈ ఏడాది 'బాబీ ఫిషర్ మెమోరియల్'ను నిర్వహించారు. బాబీ ఫిషర్ తన చివరి రోజులను రికియవిక్‌లోనే గడిపారు.



ఆసీస్‌కు సిరీస్

- రెండో వన్డేలో 60 పరుగులతో ఆస్ట్రేలియా మహిళా జట్టు విజయం
- ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన బోల్టన్
- సిరీస్‌లో 2–0తో ఆసీస్ ఆధిక్యం

వదోదర: మూడు అంతర్జాతీయ వన్డే సిరీస్‌లో భారత మహిళా క్రికెట్ జట్టు, ప్రత్యర్థి ఆస్ట్రేలియా మహిళా జట్టుకు ఏమాత్రం దీటుగా నిలబడలేదు. రెండు వన్డేలను చేజార్చుకుంది. ఆస్ట్రేలియా మహిళా జట్టు గురువారం వదోదరలో జరిగిన రెండో వన్డేలో కూడా 60 పరుగుల తేడాతో గెలుపొంది 2–0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. మొదటి వన్డేలో 8 వికెట్లతేడాతో గెలిచిన ఆసీస్ జట్టు రెండో వన్డేలో 9 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. తర్వాత మిథాలీ రాజ్ సేనను 49.2 ఓవర్లలో 227కే ఆలౌట్ చేసింది. రెండు వన్డేల్లోనూ భారత మహిళా క్రికెట్ జట్టు ఏమాత్రం సత్తా చాటలేకపోయింది. రెండో వన్డేలో ఆసీస్ నిర్దేశించిన 288 పరుగుల లక్ష్యం ఛేదించడం భారత మహిళా జట్టుకు కష్టమైంది. పూనమ్ రౌత్ తన స్థాయికి తగినట్లు ఆడలేదు. 61 బంతుల్లో 27 పరుగులు చేయడం భారత్ జట్టుకు ప్రతికూలంగా మారింది. చెప్పాలంటే ఆమె స్ట్రయికులే సరిగా చేయలేదు. కాగా ఆమెకు భాగస్వామిగా నిలిచిన స్మృతి మంధన 53 బంతుల్లో 67 పరుగులు చేసింది. మంధన 12 బౌండరీలు, సిక్సర్‌ను బాదింది. పూనమ్ రౌత్ డిఫెన్సివ్ బ్యాటింగ్ చేయడంతో ఒత్తిడంతా మంధన మీదే పడింది. మిథాలీ రాజ్ 15 పరుగులకే ఔట్ అయింది. అందులో మూడు బౌండరీలు బాదింది. కాగా ఎల్లీస్ పెర్రీ వేసిన బంతిని పుల్ షాట్ చేయబోయి అలిస్సా హీలి చేతిలో క్యాచౌట్ అయింది. మూడో బ్యాట్స్‌ఉమెన్‌గా దీప్తి శర్మను పంపిన వ్యూహం ఫలించలేదు. దీప్తి 45 బంతులాడి 26 పరుగులే చేయగలిగింది. ఓపెనర్ పూనమ్ మాదిరిగా ఎడమచేతి వాటం ఉన్న దీప్తి పెద్ద షాట్లను కొట్టలేకపోయింది. మిడిల్ ఓవర్లలోని అనేక బంతులను దీప్తి వృథా చేసింది. ఆమె హర్మన్‌ప్రీత్ కౌర్, వేదా కృష్ణమూర్తిలా షాట్లు చేయలేకపోవడం లోపంగా కనపడింది. 5 బ్యాట్స్‌ఉమెన్‌గా హర్మన్‌ప్రీత్ బరిలోకి దిగేటప్పటికే 25 ఓవర్లలో 165 పరుగులు చేయాల్సిన స్థితి ఉంది. కాగా హర్మన్‌ప్రీత్ 26 బంతుల్లో 17 పరుగులు చేసింది. నాలుగు పరుగుల వ్యవధిలోనే హర్మన్ ప్రీత్, వేదా(2) ఔట్ అయ్యారు. దాంతో భారత మహిళా జట్టు తేలిపోయినట్లయింది. తర్వాత వచ్చిన పూజా వస్త్రకర్ 33 బంతుల్లో 30 పరుగులు చేసింది. భారత్ జట్టు ఎలాగోలా 200 పరుగుల మార్కును చేరుకోగలిగింది.

క్లుప్తంగా స్కోరు:

ఆస్ట్రేలియా: 287/9(50.0ఓవర్లు)
నికోలె బోల్టన్ 84, ఎల్లిసె పెర్రీ 70, బెత్ మూనీ 56.
భారత్: 227/10 (49.2 ఓవర్లు)
స్మృతి మంధన 67, దీప్తి శర్మ 26, పూనమ్ రౌత్ 27, జెస్ జోనాస్సెన్ 3.

నికోలె బోల్టన్ మెరుపులు

అంతకుముందు ఆసీస్ ఓపెనర్ నికోలె బోల్టన్ 88 బంతుల్లో 84 పరుగులు చేసి 'ప్లేర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కించుకుంది. ఆసీస్ బ్యాటింగ్ చేసినప్పుడు 31వ ఓవర్లో నాలుగు వికెట్లకు 144 పరుగులకు భారత్ జట్టు నిలువరించింది. అయితే పెర్రీ 70 బంతులకు 70 పరుగులు, బేత్ మూనీ 40 బంతులకు 56 పరుగులు చేసి 14 ఓవర్లలో 96 పరుగులు జతచేశారు. పెర్రీ ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లు దంచేసింది. మూనీ తొమ్మిది బౌండరీలు తన ఖాతాలో వేసుకుంది. భారత్ తరఫున బౌలింగ్ చేసిన శిఖా పండే 10 ఓవర్లలో 61 పరుగులకు 3 వికెట్లు తీసుకుని మెరుగనిపించుకుంది. కానీ ఆమె బంతులన ఆసీస్ బ్యాట్స్‌విమెన్లు ఉతికిపారేయడం కూడా జరిగింది. ఇక ఫైనల్ వన్డే మార్చి 18(ఆదివారం) జరగనుంది.



పదో తరగతి పరీక్షలో కోహ్లిపై ప్రశ్న?

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పదో తరగతి పరీక్ష్‌లో క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లిపై ప్రశ్న ఇచ్చారట. మంగళవారం జరిగిన ఆంగ్ల పరీక్షలో 'విరాట్ కోహ్లి గురించి రాయండి' అన్న ఓ ప్రశ్న పెట్టారట. విద్యార్థులు దానికి తబ్బిబ్బయి కోహ్లిపై టకటకా రాసేశారట. 'ఈ ప్రశ్న పది మార్కులది. పదికి పది వస్తాయి' అంటూ అలీ అనే విద్యార్థి చెప్పాడు. 'అసలు కోహ్లి గురించి ప్రశ్న అడుగుతారని ఊహించలేదు. అతడు నా ఆదర్శం' అని షమీమ్ అక్తర్ అనే మరో విద్యార్థి చెప్పాడు. 'కోహ్లి గురించి అడగడం బాగుంది. ఇలాంటి ప్రయోగానికి మద్దతు ఇవ్వాలి. భవిష్యత్తులో ఇలా క్రీడాకారులపై అడిగేలా చర్యలు తీసుకోవాలి' అని ఎంఎల్ఎ, మాజీ క్రికెటర్ లక్ష్మీ రతన్ శుక్లా చెప్పారు. ప్రస్తుతం టీమిండియా కెప్టెన్ కోహ్లి విశ్రాంతి తీసుకుంటున్నాడు. త్వరలో ఐపిఎల్ మ్యాచుల్లో అతడు ఆడనున్నాడు. ఏప్రిల్ 7 నుంచి ఐపిఎల్ సీజన్ ఆరంభం కానుంది.

క్వార్టర్స్‌లోకి సింధు

ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్



బర్మింగ్‌హం: ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్‌లో థాయిలాండ్‌కు చెందిన నిచోన్ జిండాపోల్‌తో ప్రపంచ నెం. 3 భారత షట్లర్ పి.వి. సింధు హోరాహోరి తలపడి 21–13, 13–21, 21–18తో గెలిచింది. 1గంట 7 నిమిషాలపాటు సాగిన పోరులో సింధు విజయాన్ని చేజిక్కించుకుంది. దీంతో ఆమె క్వార్టర్ ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఈ టోర్నమెంటులో సూపర్బ్ స్ట్రోక్‌లతో ఎప్పుడు ఒక అడుగు ముందుంటూనే ఆడింది. తదుపరి తాను ఒకుహూరా లేక ఇండోనేషియా క్రీడాకారిణితో తలపడాల్సి ఉండొచ్చని, అయినా తాను టోర్నమెంటు గురించి పెద్దగా ఆలోచించడంలేదని సింధు మ్యాచ్ తర్వాత తెలిపింది. ఆటను మెరుగుపరుచుకుంటూ ఆడ్డమే తన లక్ష్యం అని చెప్పింది.

బిసిసిఐ కార్యవర్గ సభ్యుల అధికారాలకు కళ్లెం

- కార్యవర్గ సభ్యుల ఏకపక్ష నిర్ణయాలను నివారిస్తూ ఆదేశం
- కాంట్రాక్టులు, నియామకాలపై సంతకం నిరాకరించిన తాత్కాలిక కార్యదర్శి
- కార్యవర్గ సభ్యులు, నిర్వాహకుల కమిటీ మధ్య తీవ్రమైన పోరు

ముంబయి: భారత క్రికెట్ నియంత్రణ బోర్డు(బిసిసిఐ) ముగ్గురు కార్యవర్గ సభ్యుల అధికారాలన్నింటిని ఇద్దరు సభ్యులున్న నిర్వాహకుల కమిటీ తీసేసుకుంది. బిసిసిఐ తాత్కాలిక అధ్యక్షుడు సి.కె.ఖన్నా, తాత్కాలిక కార్యదర్శి అమిత్ చౌదరి, కోశాధికారి అనిరుద్ధ్ చౌదరి ఉన్న కార్యవర్గ సభ్యుల(ఆఫీస్ బేరర్స్) అధికారాలన్నింటినీ వినోద్ రాయ్ నేతృత్వంలోని ఇద్దరు సభ్యుల నిర్వాహకుల సంఘం(కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్) తీసేసుకుంది. గత వారం సుప్రీం కోర్టులో దాఖలు చేసిన ఏడవ స్టేటస్ రిపోర్టులో వారి తొలగింపు కోసం ఇప్పటికే అభ్యర్థించడం జరిగింది. అయితే నిర్వాహకుల కమిటీ ఒకడుగు ముందుకేసి కార్యవర్గ సభ్యులు ఏకపక్షంగా ఎలాంటి నిర్ణయం తీసుకోరాదని ఉత్తర్వు జారీ చేసింది. లోధా సంఘానికి సంబంధించిన కేసుల్లో చట్టపరమైన ఖర్చులకు బిసిసిఐ నిధులు ఉపయోగించరాదంటూ బోర్డు అధికారులను నిరోధించింది. ఇకపై అధికారులు నిర్వాహకుల కమిటీ అనుమతి లేకుండా వివిధ సమావేశాలకు తమ పర్యటన, హోటల్ వసతి ప్రణాళికలు వేసుకోడానికి వీలులేదు. భారతీయ ఆటగాళ్ల బీమా పాలసీలు ముగిసిపోనున్న తరుణంలో భారతీయ ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్టులపై కార్యవర్గ సభ్యులు వైఖరి నిర్వాహకుల కమిటీ చీఫ్ వినోద్ రాయ్‌ను చికాకుపరిచిందని తెలుస్తోంది. పేజీ త్రీ జర్నలిస్ట్, ప్రస్తుతం సినీ నిర్మాణ కంపెనీ మార్కెటింగ్ జిఎంగా ఉన్న వ్యక్తిని రూ. 1.65 కోట్ల వార్షిక ఆదాయంపై నిర్వాహకుల కమిటీ నియమించడాన్ని కార్యదర్శి అమితాబ్ ప్రశ్నించడంతో విషయం ఇంకా జఠిలంగా మారింది. ఇప్పుడు ని ర్వాహకుల కమిటీ 12 పాయింట్ల ఆదేశంతో కార్యవర్గ స భ్యుల అధికారాలన్నింటినీ తీసేసుకుంది. తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి నెలలో 25 రోజులు పర్యటిస్తున్నారని, ఫైవ్‌స్టార్ హోటల్ వసతులు అనుభవిస్తున్నారని, బోర్డు ఖర్చులపైనే ప్రీమియం ఎయిర్ టికెట్లు కొంటున్నారని కా ర్యనిర్వాహకుల కమిటీ ఆరోపించింది. ఇక కోశాధికారి అనురుద్ధ్ చౌదరి అనేక సమావేశాలకు హాజరుకాకుండా త ప్పుకున్నారని కూడా ఆరోపించింది. ఇదిలా ఉండగా భారతీయ క్రికెట్ ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్ట్‌పై సంతకం చేయడానికి, కొత్త ఎసియు చీఫ్, జిఎం(మార్కెటింగ్) నియామకాలపై సంతకం చేయడానికి తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి నిరాకరించారు.







కోపంతో ఫీల్డర్‌పైకి బంతి విసిరిన బౌలర్

షార్జా: పాకిస్తాన్ సూపర్ లీగ్(పిఎస్ఎల్)లో మరోసారి ఇద్దరు పాకిస్తాన్ క్రికెటర్లు సహనం కోల్పోయి ప్రవర్తించారు. బుధవారం క్వెటా గ్లాడియేటర్స్, లాహోర్ ఖలందర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. దీనిలో భాగంగా లాహోర్ ఖలందర్స్ ఆటగాళ్లు సొహైల్ ఖాన్, యాసిర్ షాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. క్వెటా ఇన్నింగ్స్ భాగంగా 19 ఓవర్‌ను లాహోర్ బౌలర్ సొహైల్ అందుకున్నాడు. ఆ క్రమంలోనే నాల్గో బంతికి సొహైల్ తన నియంత్రణను కోల్పోయాడు. ఫీల్డింగ్ సెట్ చేసే క్రమంలోనే బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న యాసిర్ షాను ఫలానా చోట ఫీల్డింగ్ చేయాలంటూ ఆదేశించాడు. దానికి యాసిర్ షా నుంచి సరైన స్పందన రాకపోవడంతో అతనిపైకే బంతి విసిరి అక్కడ ఫీల్డింగ్‌లో నిలబడు అంటూ అసహనాన్ని ప్రదర్శించాడు సొహైల్. ఈ క్రమంలోనే యాసిర్‌సొహైల్ మధ్య మాటల యుద్ధం జరిగింది. ఆ బంతిని తిరిగి అందుకున్న యాసిర్.. సొహైల్ వైపు అంతే వేగంగా విసిరాడు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. గత వారం గ్లాడియేటర్స్ పేసర్ రహత్ అలీ, కరాచీ కెప్టెన్ ఇమాద్ వసీంల మధ్య వాగ్వాదం జరిగిన సంగతి తెలిసిందే. అయితే వారిద్దరిని శాంతింపజేసేందుకు న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రాండెన్ మెకల్లమ్ ప్రయత్నించాడు. 'తన కెరీర్‌లో అదో ఫన్నీయెస్ట్ మూమెంట్' అని క్వెట్టా గ్లాడియేటర్స్ బ్యాట్స్‌మన్ కెవిన్ పీటర్సన్ తన ట్వీట్‌లో చెప్పారు. యాసిర్ షా, సొహైల్ ఖాన్ తరఫు లాహోర్ జట్టు క్వెట్టా జట్టుపై 17 పరుగుల తేడాతో గెలుపొందింది.

బంగ్లా జట్టులోకి షకీబల్ హసన్ పునరాగమనం



కొలంబో: శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు టోర్నీలో భాగంగా శుక్రవారం శ్రీలంకతో జరగున్న కీలక మ్యాచ్‌కు బంగ్లాదేశ్ టెస్ట్, టి20 కెప్టెన్ షకీబల్ హసన్ అందుబాటులోకి వచ్చాడు. ఫైనల్‌కి వెళ్లాలంటే తాడోపేడో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో షకీబల్ అందుబాటులోకి రావడంతో బంగ్లాదేశ్ జట్టుకు బలం పెరిగింది. జనవరిలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో చేతి వేలికి అయిన గాయం నుంచి షకీబల్ పూర్తిగా కోలుకోవడంతో జట్టు అందుబాటులోకి వచ్చాడు. షకీబల్ గురువారం రాత్రి శ్రీలంక చేరుకునే అవకాశం ఉందని సమాచారం. ఈ టోర్నీలో భారత్ మూడు మ్యాచుల్లో గెలిచి ఫైనల్‌కు చేరుకోగా శ్రీలంక, బంగ్లాదేశ్‌లు చెరో విజయంతో సమ ఉజ్జీలుగా ఉన్నాయి. రేపటి మ్యాచ్‌లో గెలిచిన వారికే ఫైనల్ ఛాన్స్ ఉండడంతో ఇరు జట్లకు ఈ మ్యాచ్ కీలకంగా మారింది. ఈ సమయంలో షకీబల్ జట్టులోకి తిరిగి రావడంతో బంగ్లాదేశ్ బలం పెరిగినట్టు అయింది.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.